ఉదయశ్రీ

[ఖండకావ్యముల సంపుటి]

జంధ్యాల పాపయ్య శాస్త్రి

కరుణశ్రీ

NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D. P. R. I.
Acc. No.
1082

కరుణశ్రీ కావ్యమాల

గుంటూరు

894.8271
PAP

అంకితం

కరుణామూర్తి
అరుణచరణాలపై

కిరణాలు

అంజలి	౧౧
ఉషస్సు	౧౪
ఉదయశ్రీ	౧౫
ఉత్తిష్ఠ	౧౬
కరుణమూర్తి	౧౮
కరుణాకుమారి	౨౨
కరుణామయి	౨౫
పారవశ్యము	౨౮
విశ్వప్రేమ	౩౫
అద్వైతమూర్తి	౩౬
సాంధ్యశ్రీ	౩౭
వైశాఖి	౩౮
ప్రాభాతి	౩౬
రాట్న సుందరి	౪౦
మధురస్మృతి	౪౧
తపోభంగము	౪౩
పుష్పవిలాపము	౪౭
కుంతీకుమారి	౫౧

ధనుర్భంగము	౫౯
ఊర్మిళాకుమారి	౬౨
అనసూయాదేవి	౬౫
సతీ సావిత్రి	౬౮
పోతన	౭౩
ఆంధ్రవిద్యార్థి	౭౭
అస్వతంత్రుడు	౮౦
తెనుగుతల్లి	౮౩
కళ్యాణగీతి	౮౭
జయోస్తు	౮౮
కవితాకుసూరి	౮౯
బీదపూజ	౯౦
సార్థకత	౯౩
స్వేచ్ఛాపుష్పాలు	౯౫
మాతృశ్రీ	౯౭
నమస్తే	౯౮

MEMORIAL LIBRARY
V.R.NARLA
D. P.R. I.
Acc. No.

7



శ్రీ రామయామాత్యులు

నాకు పరమపూజ్యులు, నా కావ్యాన్ని ఆంధ్ర సహృదయ
లోకానికి అందించడంలో అన్నివిధాలా సహాయం చేసిన
నా ప్రియమిత్రులు శ్రీ ఆదిపూడి శ్రీ కృష్ణమూర్తిగారి జనకులు

కృతజ్ఞత

డంబ మెరుగని ఒక నిరాడంబరుండు
కష్టపడి నేల పండించు కర్షకుండు
ధర్మమార్గమ్ము తప్పని కర్మయోగి
సత్యగుణశాలి రామయామాత్యమౌళి

కోప మొకింత లేదు, తనకున్ గలదానికె తృప్తి, లేక చే
సాపినరోజు లే దొరుల సన్నిధిలో, పదిమందిలో పటా
టోపము చూపబోడు, టకటొంకు లెరుంగని ధర్మరాజు, సం
ప్రాపిత సద్యశుండు పెదరామయ తోడి నియోగిమండలిన్.

నాకున్ మిత్రుడు, నీకు పుత్రుడు, రసానందైకలోలుండు, మీ
శ్రీకృష్ణుం డతిమాత్ర బాల్య మధురస్నేహార్ద్ర భావమ్ముతో
నా కావ్యమ్మున కొక్క రూపిడె—రసజ్ఞస్వీన్న నేత్రాలలో
ఆకల్పాంతము నిల్చునీ యశము మామా ! రామయగ్రామణీ !

నమస్సులు

గురుదేవులు

శ్రీ కుప్పా శ్రీ ఆంజనేయ శాస్త్రి గారికీ

శ్రీ భమిడిపాటి వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రి గారికీ

శ్రీ ఆచార్య శివశంకరులకూ

ధన్యవాదాలు

నా కావ్యాన్ని అక్షర రూపంలో

సహృదయలోకానికి అందించిన

మిత్రుడు ఏ. యస్. కృష్ణా గారికి

M

నమ శివాభ్యాం నవయౌవనాభ్యామ్

అరుణ రేఖలు

ఆనాడు నా శిథిల జీవితానికి ఒక మధుర ప్రభాతం. నా హృదయంలో ఒక ఉదయశ్రీ.

కన్నులు విప్పి చూచాను. శ్రీమతినీ చిరంజీవినీ విడిచి బరువుగుండెతో మేడమెట్లు దిగే గౌతమబుద్ధుని కారుణ్యమూర్తి కనిపించింది. ఆయన అర్ధనేత్రాంచలాల్లో కరుణాకుమారి తొంగి చూచింది.

ఆమె వదనంలో అయోధ్యానగరం అంతఃపురాల్లో నుంచి దండకారణ్య పర్ణకుటిలో తన జీవిత సౌభాగ్యం వెతుక్కుండే ఊర్మిళాకుమారి ఉత్కంఠ తొణుకు లాడుతూ వుంది.

ఆమె కంఠంలో పాషాణహృదయుల ప్రక్కలక్రింద రెక్కలు విడి నలిగి నశించిపోయే పూలబాల జాలిపాట మెల్లమెల్లగా ప్రేమగు తూవుంది.

ఆమె నిట్టూర్పులో గంగానది గట్టుమీద నిలిచి నిర్భాంత పోయి ఏటి కెరటాలలోపడి ఎక్కడెక్కడికో కొట్టుకుపోయ్యే కొడుకు వైపు నిశ్చల నిరీహనేత్రాలతో చూచే కుంతీకుమారి గుండెల చప్పుడు వినిపిస్తూవుంది.

ఆమె అర్ధనేత్రాల్లో మృత్యుదేవత వెంట ఒంటరిగా పతి కోసం పరువెత్తే సతీమణి సావిత్రి ప్రణయస్వరూపం ప్రతిబింబిస్తూవుంది.

ఆమె చల్లనిచేతుల్లో కరుణామయి రాధిక హృదయవిపంచి అమృత రాగాలు ఆలపిస్తూవుంది.

ఆమె కన్నీటి కెరటాలలో భారతమాత బాష్పధారలు ప్రవహిస్తూవున్నాయి. ఆమె నిట్టూర్పులు నన్ను మానవుణ్ణిచేశాయి ఆమె కన్నీళ్ళే నాలోని కవిత్వం. ఆమె నా కరుణామయి. నాజీవిత సహచరి. నా కల్యాణమూర్తి. నా ఆరాధ్యదేవి.

భగవంతుడు కరుణామయుడు - సృష్టి కరుణామయం - జీవితం కరుణామయం. ప్రపంచం కరుణలో పుట్టి కరుణలో పెరిగి కరుణలోనే విలీన మౌతుంది.

కరుణకూ కవికీ అవినాభావ సంబంధం వుంది. కరుణ లేకపోతే కవికి వ్యక్తిత్వం లేదు. కవి లేకపోతే కరుణకు అస్తిత్వం లేదు.

ఈనాడు నా శిథిల జీవితానికి ఒక మధురప్రభాతం. నా హృదయంలో ఒక ఉదయశ్రీ.

—కరుణశ్రీ

అంజలి

పుట్టబోయెడి బుల్లిబుజ్జాయి కోసమై
పెదుగుగిన్నెకు పాలు పోసి పోసి
కలికి వెన్నెల లూరు చలువ దోసిళ్ళతో
లతలకు మారాకు లతికి యతికి
పూల కంచాలలో రోలంబములకు రే
పటి భోజనము సిద్ధపరచి పరచి
తెలవారకుండ మొగ్గలలోన జొరబడి
వింత వింతల రంగు వేసి వేసి

తీరికే లేని విశ్వ సంసారమందు
అలసిపోయితివేమొ దేవాదిదేవ!
ఒక నిమేషమ్ము కన్ను మూయుదువు గాని
రమ్ము! తెరచితి మాకుటీరమ్ము తలుపు!!

కూర్చుండ మాయింట కురిచీలు లేవు; నా
ప్రణయాంకమే సిద్ధపరచనుంటి
పాద్యమ్ము నిడ మాకు పన్నీరులేదు; నా
కన్నీళ్ళతో కాళ్ళు కడుగనుంటి
పూజకై మావీట పుష్పాలు లేవు; నా
ప్రేమాంజలులె సమర్పించనుంటి
నైవేద్య మిడ మాకు నారికేళము లేదు;
హృదయమే చేతి కందీయనుంటి

లోటు రానీయ నున్నంతలోన నీకు
రమ్మ! దయసేయు మాత్మపీఠమ్ము పైకి
అమృతఝరి చిందు నీ పదాంకములయందు
కోటి స్వర్గాలు మొలపించుకొనుచు తండ్రి!

లోకాలచీకట్లు పోకార్చ రవిచంద్ర
దీపాలు గగనాన త్రిప్పలేక
జగతిపై బడవచ్చు జలరాశి కెరటాలు
మామూలు మేరకు మడవలేక
పనిమాలి ప్రతిరోజు ప్రాణకోటుల గుండె
గతీయారముల కీలు కదపలేక

అందాలు చిందు నీలాకాశ వేదిపై
చుక్కల ముగ్గులు చెక్కలేక

ఎంత శ్రమనొందుచుంటివో యేమొ సామి!
అడుగిడితి వెట్లో నేడు మా గడపలోన;
గుండె కుదిలించి నీముందు కుప్పవోతు
అందుకోవయ్య! హృదయపుష్పాంజలులను.

ఈ పేస్సు

కర్కశ కరాళ కాలమేఘాల నీడ
లెగురుచున్నవి ప్రజల నెమ్మోగములందు;
క్రౌర్య కౌటిల్య గాఢాంధకార పటలి
క్రమ్మికొన్నది దిగ్దిగంతమ్ములెల్ల.

ఈ నిసబత కంతరార మెదియో! యీ కారుమేఘాలలో
ఏ నిర్భాగ్య నిరర్థ నీరస గళం బెల్లెత్తి వాపోవునో!
ఈ నీరంధ్ర నిశీథ గర్భకుహర, మ్మో భావ గంభీరతా
పౌనఃపున్యము దాచెనో! వెలయవో ప్రాభాత శోభావళుల్!!

ఈ చీక ట్లిక తెల్లవారవఁ! లేనేలేవటయ్యా స్మిత
శ్రీ చైతన్య నవప్రభాతములు నిర్జీవ ప్రపంచాన! మా
ప్రాచీబాల కపోల పాళికలపై ప్రత్యూష సౌవర్ణ రే
ఖా చిత్రమ్ములు గీతు రెవ్వ రనురాగస్వీన్న హస్తాలతో!!

ఉదయశ్రీ

సుప్రభాతము ! రాగోజ్జ్వల ప్రబోధ
మంధలోకాని కిడు జగద్బాంధవుండు
ఉదయమగుచుండె నవయుగాభ్యుదయమునకు
అరుణ కిరణాలతో కరుణార్ద్రమూర్తి !

చీకటిలో లోక మ్మిది
చీకాకైపోయె; సంస్పృశింపగవలె నీ
శ్రీకరముల, కరుణా కమ
లాకర తరుణ ప్రభాకరా ! రావోయీ !

శుద్ధోదన రాజేంద్రుని
శుద్ధాంతము చిందె శాంతిసుధల, అహింసా
సిద్ధాంత మొలుకు గౌతమ
బుద్ధుని చిరునవ్వులోన పులకీకృతమై !

ఉతిష

చిన్నికుమారు చిర్నగవు చెక్కిలిలో పులకించు రాణి క్రీ
గన్నుల నీడలన్ సుఖముగా సుమడోలల తన్మయుండవై
ఉన్నత భర్మసౌధముల నూగెడి రాజుల చిన్నవాడ! నీ
కన్నులు విప్పి నల్ దెసలు కన్గొనరా! యిక నిద్రచాలురా!

నిదురన్ భంగము చేసినా ననుచుగానీ; కూర్మిదేవేరి ప
య్యెద బాంధవ్యము బాపుచుంటి నని కానీ, కిన్కగైకోకు! నీ
హృదయమ్మున్ హృదయేశ్వరీ హృదయమందే కాదు - సుప్తప్రజా
హృదయాబ్జమ్ముల మేలుకొల్పు 'ఉదయశ్రీ'లో ప్రపంచింపరా!

ప్రేయసి ప్రేమలోన కనిపించెడి తీయని స్వర్గ మొక్కటే
ధ్యేయము కాదు, హీను లతిదీనులు మ్లానతనుల్ దరిద్ర నా
రాయణు లేడ్చుచుండిరి, తదశ్రువులన్ దుడువంగపొమ్ము— నీ
ప్రేయసితోడ, నీ కట లభించును కోట్లకొలంది స్వర్గముల్ !!

బుద్ధుడవై సుప్తుల ప్రబుద్ధుల చేయుము [౧౭ పుట]

బుద్ధుడవై సుషుప్తుల ప్రబుద్ధుల చేయుము, శాంతి సత్య ధ
ర్మోద్ధరణార్థమై బ్రతుకు నొగ్గుము, మానవ సంఘ సేవయే
సిద్ధికి త్రోవ, వత్సలత చిందెడి ప్రేమ సుధా స్రవంతులన్
శుద్ధ మొనర్పు ముజ్జ్వలయశోధర! జర్జరితప్రపంచమున్!!

లెమ్మిక మేలుకొమ్ము! కదలింపుము క్రాంతిరథమ్ము శాంతి మా
ర్గమ్మున—కాంతి పుంజము లఖండముతై నవ జీవన ప్రభా
తమ్ములు నింప, సర్వసమతా సుమకోమల మానవాంతరం
గమ్ముల ప్రేమసూత్రమున కట్టుము మంగళ తోరణమ్ములన్!

గుటగుటలాడ ప్రాణములు గొంతుకలో—పసికన్న గొల్ల్రలన్
బొటబొట రాల బాష్పకణపుంజము, బోరున నేడ్చు నల్లదే
కటికి కసాయి కెంపు చురకత్తి గనుంగొని గొట్టెపిల్ల; సం
దిట గదియింపవే! దిగులు దీర్పవె! ముద్దుల బుజ్జగింపవే!!

ఈ మహి స్వర్గఖండ మొనరింపుము—ఘోర హలాహలమ్ము ది
వ్యామృతమాచరింపుము, "జయోస్తు" కుమార! శిరస్సునై అహిం
సా మకుట ద్యుతుల్ దశదిశల్ వెలిగింప ప్రపంచ మెల్ల నీ
ప్రేమ రసైక వృష్టి గురిపింపుమురా! కరుణాకళాధరా!

కరుణమూరి

ఈ ప్రగాఢ నిగూఢ మధ్యేనిశీధి
గడియ కదలించుచున్న సవ్వడి యిదేమి ?
ఇప్పు డంతఃపురమునం దెవరు వీరు
మూసియున్నట్టి తలుపులు దీసినారు ?

తెర తొలగ ద్రోసికొని చనుదెంచుచున్న
ముగ్ధ మోహన కారుణ్యమూర్తి యెవరు ?
అందములు చిందు పున్నమచందమామ
కళ దరుగుటేమి కాలమేఘాల లోన ?

నిండు గుండెలపై వ్రాలి నిదురపోవు
ఏ హృదయదేవి పావన స్నేహమునకు
ద్రోహ మొనరించి ప్రక్కకు త్రోసిపుచ్చి
వచ్చెనో కాక—వదన వైవర్ణ్య మేమి ?

నమ్మి జీవన సర్వస్వ మమ్ముకొన్న
ప్రణయమయి శాశ్వతప్రేమబంధనములు
త్రెంపుకొని బైటపడు ప్రయత్నంపులేమొ—
తడబడుచు కాళ్ళు గడపలు దాటవేమి!

ఒడలు తెలియక ప్రక్కపై బడి—యనంత
మోహనస్వప్నలోకాలలో హసించు
ముద్దు పాపాయి చిరునవ్వు ముత్తియములు
దొరలుచున్నవి వాలు కందోయి తుదల!

గేహమే వీడలేకనో—గృహిణితోడి
స్నేహమే వీడలేకనో—శిశువు మీది
మోహమే వీడలేకనో—సాహసించి
దేహళిని దాట నింత సందేహపడును?

ప్రణయ భాగ్యేశ్వరీ బాహుపాశమట్లు
జారిపోలేక—ముందుకు సాగనీక—
వెంట జీరాడుచు బుజమ్ము నంటి వచ్చు
నుత్తరీయాంచలము చక్కనొత్తడేమి?

కేలుగవ సాచి ఆర్ద్ర నేత్రాలతోడ
మెట్టు మెట్టుకు పాదాల చుట్టుకొనెడి
ప్రేయసీ కల్పనా ప్రతిబింబ శత స
హస్రముల గాంచి నిస్తబ్ధ డగుచు నిలుచు !

పడియు ముందుకు, వెనుకకే ప్రాకులాడు
ప్రభువు చరణాలు స్ఫటిక సోపాన పంక్తి ;
గాలి కెదురుగ సెలయేటి జాలులోన
పయన మగు రాజహంస దంపతుల భంగి.

ఆ మహోన్నత భర్మ హర్మ్యాలు దిగుట
ఏ మహోన్నత సౌధాల కెక్కుజనుటొ ?
ఈ వన విహారములు త్యజియించి చనుట
ఏ నవ విహారములు సృజియించుకొనుటొ !

లలిత లజ్జావతీ లాస్య లాలనములు
కనెడి కన్నులు సత్య నర్తనము కనెనొ !
శ్రీ చరణ మంజు మంజీర శింజితములు
వినెడి వీను లంతర్వాణి పిలుపు వినెనొ !

మినుకు మినుకున గుడిసెలో కునుకుచున్న
దీప మంపిన దీన సందేశ మేమొ !
స్వర్ణశాలలపై భ్రాంతి సడలి, జీర్ణ
పర్ణశాలల మార్గమ్ము పట్టినాడు !

ఆపుకొలేని హృదయమ్ము నదిమిపట్టి
దూరమగుచుండె ప్రభువు సంసారమునకు;
శ్రీయు—శ్రీమతియును—చిరంజీవి లేని
ఈ "మహానిష్క్రమణ" కర్థ మేమి కలదొ ?

కాంతిలోనుండి కటిక చీకటులలోన
కలిసిపోవుచునున్నాడు "కరుణామూర్తి"
కటికి చీకట్లలోనుండి కాంతిలోన
పతితపావనుడై బయల్పడగనేమొ !!

కరుణాకుమారి

ఆమె భువనైకమోహిని, అమృతమయి, అ
నంత విశ్వ విహారిణి, శాంతమూర్తి ;
ఆమె లోకైక పావని—ఆమెవంటి
అందములరాణి లేదు బ్రహ్మాండమందు.

ఆమె మానస కమలాకరాంతరమున
జలజమై తేలు నీ చరాచరజగత్తు;
ఆమె నిట్టూర్పులో పరమాణులట్లు
కరగి నీరౌను మేరుమందరము లెన్నో !!

ఆమె కడకంటి చూపులో అనవరతము
కాపురముసేయు దివిజగంగాభవాని ;
ఆమె చిరునవ్వు తళుకులో అహరహమ్ము
నవ్వుకొన్నవి వంద నందనవనాలు !!

బాలభానుడు పసిడి హస్తాలతోడ
పసుపు పారాణి నిడు నామె పాదములకు;
ఆ దయామయి విశ్వ విహారమందు
ప్రతిపదమ్మును కోటి స్వర్గాలపెట్టు.

ఆర్ద్రత, అహింస, అనసూయ ఆమె యింటి
ఆడబిడ్డలు, నిత్యకల్యాణి ఆమె;
ఆ మహారాజ్ఞి మృదుల పాదాంతికమున
అవనతశిరస్కు డగును బ్రహ్మంతవాడు!

ఆమె గాథ పరిష్వంగమే మదీయ
జీవితమునకు మోక్షలక్ష్మి ప్రసాద;
మామె యనుభూతియే శుష్కమైన నాదు
బ్రతుకు నోదార్చు మలయ మారుతపు వీచి.

కర్కశ కఠోర కాలచక్రాన నలిగి
చితికిపోయిన నా ముగ్ధ జీవితమ్ము
నింపుకొందును అంచులనిండ, ఆమె
అడుగుదమ్ముల కమ్మపుప్పొడులతోడ.

అస్మదీయ జీవిత పరమార్థ మెల్ల
ఆమె పాదాల మీదనే అంకితమ్ము;
ఆమె హృదయము హృదయాన నందుకొనక
సార్థకత లేదు నా నరజన్మమునకు.

భరతమాత ఆనంద బాష్పాలలోన
నిండు జాబిల్లి పండువెన్నెలలలోన
విశ్వ మానవ కల్యాణ వేదిపైన
జరిగినది మాకు గాంధర్వపరిణయమ్ము.

అస్మదారాధ్యదేవియౌ ఆమెకొరకె
ఆమెకొరకె మదీయ మహాతపస్య;
బుద్ధభగవాను గారాబు పుత్రి — ఆమె
నవ్య సుకుమారి "శ్రీకరుణాకుమారి."

నీ యసితద్యుతుల్ కనులనింపితి కాటుకచేసి—అల్లిదే
తీయనిపాటతో తలుపుదీసెను ..... [అగ పుట]

శ్రీయుతమూ ర్తియై కరుణచిందెడి చూపులతోడ స్వామి
వెంచేయును, పాదపూజ దయచేయును.....[౨౫ పుట]

కరుణామయి

నీ దరహాస చంద్రికలు నిండిన నా హృదయాంగణమ్ములో
లేదుగదా తమస్సు లవలేశము, ప్రేమసుధానిధాన! నే
డీ దయనీయదాసి భరియింపగలే దిక నీదు ప్రేమలో
పేదరికమ్ము - మేను మరపింపుము మోహన వేణుగీతికన్!

నీ యసితద్యుతుల్ కనుల నింపితి కాటుకచేసి—అల్లదే
తీయని పాటతో తలుపుదీసెను గుండెకు గున్నమావిపై
కోయిలకన్నె—నా వలపు కొండలపై కడకళ్లనుండి వే
రే యమునా ప్రవంతి ప్రవహించెనురా! అనురాగవార్ధీ!

"శ్రీయుతమూర్తియై కరుణచిందెడి చూపులతోడ స్వామి వేం
చేయును, పాదపూజ దయసేయును మా" కను సంబరాన, ఆ
ప్యాయముగా త్వదీయ పథ మారయుచున్నవి నేడు, పూచియుం
బూలరుని పచ్చపట్టు పరపుల్ గొని శ్యామల శాద్వలీ స్థలుల్.

నిద్దపు ముద్దుమోవి పయనించు భవన్మురళీరవమ్ములో
నిద్దురవోయినట్లు శయనించె సమస్తము; సద్దులేని ఈ
యద్దమరేయి ఒంటిగ—రహస్యముగా—తపియించు గుండెపై
నద్దుకొనంగ వచ్చితి దయామయ! నీ చరణారుణాబ్జముల్!!

ఏది మరొక్కమాటు హృదయేశ్వర! గుండెలు పుల్కరింపగా
ఊదగదోయి! ఊదగదవోయి! సుధామయ యుష్మదీయ వే
ణూదయ రాగ డోలికల నూగుచు, విస్మృతిలో విలీనమై
పోదును నాదు క్రొవ్వలపు పువ్వుల ముగ్ధ పరీమళమ్ముతో!!

నీ చిరునవ్వు పాటలు ధ్వనించెడి మామక మానసమ్ములో
లేచెనురా! ప్రఫుల్ల మురళీ రవళీ రమణీయ భావనా
వీచి—దృగంచలమ్ముల ద్రవించి స్రవించు మనోనురాగముల్
దాచుకొనంగలేని పసిదాననురా! విసిగింపబోకురా!

ఇది యది యంచు తేల్చి వచియింపగరాని విషాద మేదియో
హృది గదలించుచున్నది—దహింపగసాగె నిరాశ శుష్కమౌ
బ్రదుకును—స్నిగ్ధ శీతల కృపారస ధారల, దుర్దినమ్మునే
సుదినము చేయరా! యదుకిశోర! కృశాంగి ననుగ్రహింపరా!

నీరసమైన నీ ప్రణయినీ హృదయ మ్మిది చల్లచల్లగా
నీ రసగీతిలో కరగి నీరయిపోవుచునుండె, మోహనా
కార! రవంత వచ్చి కనికారము జూపవయేని, కాలువై—
యేరయి-పొంగి-పొర్లి-ప్రవహింపదొ గోకుల మాకులమ్ముగన్!

ఈ కరుణామయీ హృదయమే ఒక ప్రేమ మహాసముద్రమై
లోకము నిండెరా! కడుపులో బడబాగ్నిని దాచి; కాంక్ష మ
ఱ్ఱాకయి తేలె, చక్కనిదొరా! శయనింతువుగాని పొంగి వ
చ్చే కెరటాలమీద; దయసేయుము! గోప కిశోర మూర్తివై!

రాధనురా ప్రభూ! నిరపరాధనురా! అనురాగ భావనా
రాధన మగ్నమానసనురా! కనరా! కరుణింపరా! మనో
వీథి పదేపదే కలకవేయుచునున్నదిరా! పురా రహో
గాథలు—ఈదలేనిక అగాధ తమోమయ కాలవాహినిన్!!

పారవశ్యము

అది శరద్రాత్రి, గగన సౌధాంగణమున
దేవతాస్త్రీలు దీపాలు తీర్చినారు;
సరస రాకా సుధాకర కరములందు
కలకలమటంచు నవ్వె శృంగారసరసి.

పూచె వనలక్ష్మి, పిండారబోసినట్లు
పండువెన్నెల జగమెల్ల నిండిపోయె;
యమున శీతల సురభి తోయమున దోగి
చల్లగా—మెల్లగా—వీచె పిల్లగాలి.

ఆ మహోజ్జ్వల రజని, మోహన విహార
నవ నవానంద బృందావనమ్మునందు,
అమల యమునానదీ శాద్వలముల మీద,
లలిత బాల రసాల పల్లవ పరీత
మధుర మంజుల మాలతీ మంటపమున,

పాల రా తిన్నెపయి కల్వపూలతోడ
మాల గట్టుచు కూర్చున్న బాల యెవరు ?
ప్రణయ మకరంద మాధురీ భరిత ముగ్ధ
లోచనమ్ములలోని యాలోచనమ్మో
లేమొ—ప్రేమ సుధారస శ్రీముఖమగు
ఆ ముఖములోని యాకాంక్ష లేమొ—త్రిజగ
తీ సముజ్జ్వల సౌందర్యతిలక మామె
ముద్దుచేతులలో ప్రేమ పుష్పమాల
అంద మెగబోయి ఏ కళానందమూర్తి
కంఠము నలంకరించునో—

"చిచ్చువలె చందురుడు పైకి వచ్చినాడు !
పెచ్చరిలినాడు గాడుపు పిల్లవాడు !
రాడు మోహన మురళీస్వరాలవాడు !
తప్ప కేతెంతు నని మాట తప్పినాడు !"

అంతకంతకు నిట్టూర్పు లతిశయించె
కొమరు చెమటలు చిగురు చెక్కుల జనించె
వదన మరచేతిలో నట్టె వ్రాలిపోయె
పడె కపోలమ్ముపై నొక్క బాష్పకణము,

అంతలోపల సుశ్యామలాంగు డొకడు
అల్లనల్లన పుడమిపై నడుగులిడుచు
వెనుకగా వచ్చి తన ముద్దు వ్రేళ్ళతోడ
గట్టిగా మూసె నామె వాల్గన్నుదోయి.

కమ్మ కస్తురి తావులు గమ్మ్మనియె
లలిత తులసీ పరీమళమ్ములు చెలంగె
తరువె తన్మృదులాంగుళుల్ తవిడిచూచి
"కృష్ణుడో, కృష్ణుడు" యంచు కేకవేసె.

"సరస శారద చంద్రికా స్థగిత రజత
యామున తరంగ నౌకా విహారములకు
సన్ను రమ్మంచు చెప్పి బృందావనమున
కింటిలో హాయిగా కూరుచుంటివేమి ?

ఎంత తడవయ్యె నే వచ్చి—ఎంతనుండి
వేచియుంటిని—పొదరిండ్లుపూచి—వలపు
వీచికలు లేచి – హృదయాలు దోచికొనెడి
యీ శరజ్జ్యోత్స్నలో—పుల్కరించి పొంగి
మ్రోతలెత్తెడి యమునానదీ తటాన !

ప్రియసి నుపేక్ష సేతువే ప్రియవయస్య!
ఇంత నిర్దయ పూనెదవే దయాళు!
ఇంతగా చిన్నబుచ్చెదవే మహాత్మ!
ఇట్లు గికురింతువే నన్ను హృదయనాథ?"

కలికి యిటు వచ్చిరాని పేరలుక తోడ
సజలనయనాల జీవితేశ్వరుని గాంచె

సరస సంగీత శృంగార చక్రవర్తి
సకల భువనైక మోహన చారుమూర్తి
రాధికా మానస విహార రాజహంస
మందహాసమ్ము కెమ్మోవి చింద పలికె

"ఆలసించుట కాగ్రహ మందితేని
వెలది! విరిదండ సంకెలల్ వేయరాదొ!
ముగుద! పూబంతితో నన్ను మోదరాదొ!
కలికి! మొలనూలుతో నన్ను కట్టరాదొ!"

రాధికా క్రోధ మధురాధర మ్మొకింత
నవ్వెనో లేదొ ; పకపక నవ్వె ప్రకృతి ;
నవ్వుకొన్నది బృందావనమ్ము, యమున
నవ్వుకొన్నది, చందురుడు నవ్వినాడు ;
విరగబడి తమ పొట్టలు విచ్చిపోవ
నవ్వినవి రాధతలలోని పువ్వులెల్ల.

వాలుకన్నుల బాష్పాలు జాలువార
నంత రాధిక వివశయై అలఘ్రియుగళి
వ్రాలిపోయిన ప్రియుని కెంగేలనెత్తి
చిక్కువడిన ముంగురులను చక్కనొత్తి
చెరగిపోయిన తిలకమ్ము సరియొనర్చి—

"అవును లేవోయి ! కపటమాయాప్రవీణ !
ధీరుడవు మంచిశిక్షనే కోరినావు !
నిత్య సుకుమారమైన సున్నితపు మేను
నాదు చేబంతి తాకున నలిగిపోదె ?
సొక్కి సోలిన నీమోము చూడగలనె ?
చేతు లెట్లాడు నిన్ను శిక్షింప నాథ !

పొందనేర్తునె నిన్ను నా పూర్వజన్మ
కృత సుకృత వైభవమున దక్కితివి నాకు [33 పుట]

ఎంత నిర్దయురాలనో పంతగించి
కృష్ణ! నీచేత నిట్లు ప్రొక్కించుకొంటి—
నవ్య వనమాల కంఠాన నలిగిపోయె
చెక్కుటద్దాల తళుకొత్తె చిగురు చెమట
కొదుమ కస్తూరి నుదుటిపై చెదరిపోయె
బర్హిబర్హంబు చీకాకు పడియె మౌళి.

పొందనేర్తునె నిన్ను నా పూర్వజన్మ
కృత సుకృత వైభవమున దక్కితివి నాకు
విశ్వసుందర చరణారవింద యుగళి
ముద్దుగొని చెక్కుటద్దాల నద్దుకొను అ
దృష్ట మబ్బిన దొక్క రాధికకె నేడు.
తావకీన సౌందర్య సందర్శనాను
భూతిలో పొంగి ప్రవహించి పోదునోయి!

ఎంత కారుణ్యమున్నదో యెంచగలనె
కమలలోచన! నీ కటాక్షములలోన—
ఎంత లావణ్య మున్నదో యెంచగలనె!
ప్రేమమయమూర్తి! నీ ముద్దుమోములోన—

ఎంత మాధుర్యమున్నదో యెంచగలనె!
సులలితకపోల! నీ మృదు సూక్తిలోన—
ఎంత యమృతము గలదొ భావింపగలనె!
స్వామి! తావక మందహాసమ్ములోన—

ఎంత మైకము కలదొ యూహింపగలనె!
రాధికానాథ నీ మధురాధరమున"

అనుచు రాధిక పారవశ్యమున మునిగి
వ్రాలె మాధవు స్నేహార్ద్ర వక్షమందు

"రాధపై ప్రేమ యధికమో మాధవునకు
మాధవుని పైన రాధ ప్రేమయొ ఘనమ్మో"
ఈ రహస్యము నెరుగలే రెవరుగూడ
ప్రణయమయ నిత్యనూత్న దంపతులు వారు!

విశ్వప్రేమ

ఏ ప్రేమ మహిమచే నీ ధారుణీచక్ర
మిరుసు లేకుండనే దిరుగుచుండు
ఏ ప్రేమ మహిమచే నెల్ల నక్షత్రాలు
నేల రాలక మింట నిలిచియుండు
ఏ ప్రేమ మహిమచే పృథివిపై బడకుండ
కడలిరాయడు కాళ్ళు ముడుచుకొనును
ఏ ప్రేమ మహిమచే నీరేడు భువనాల
గాలిదేవుడు సురటీలు విసరు

ఆ మహాప్రేమ—శాశ్వతమైన ప్రేమ—
అద్భుత మఖండ మవ్యక్తమైన ప్రేమ—
నిండియున్నది బ్రహ్మాండభాండమెల్ల
ప్రేయసీ! సృష్టి యంతయు ప్రేమమయము!!

అద్వైతమూర్తి

చూచెదవేల నో ప్రణయసుందరి! కాటుక కళ్ళలోని ఆ
లోచన లేమిటో హరిణలోచని! నీ చిరునవ్వులోని సం
కోచము లెందుకో కుసుమకోమలి! నీ మధురాధరమ్ములో
దాచుకొనంగ నేటికి సుధామయసూక్తి కళావిలాసినీ!

భావోద్యానమునందు కొత్తవలపుం బందిళ్ళలో కోరికల్
తీవల్ సాగెను పూలుపూచెను; రసార్ద్రీభూతచేతమ్ముతో
నీవే నేనుగ నేనె నీవుగ లతాంగీ! యేకమైపోద మీ
ప్రావృ ణ్నీరద పంక్తి క్రింద పులకింపన్ పూర్వపుణ్యావళుల్!

మన దాంపత్యము సత్యమౌ ప్రణయసామ్రాజ్యమ్ములో లోతులన్
గనియెన్; సాగెను భాగ్యనౌక కవితాకాళిందిలో; నవ్య జీ
వన బృందావన దివ్యసీమ విహరింపన్ రమ్ము! నే కొల్లగొం
దును నీ కోమల బాహుబంధనములందున్ కోటి స్వర్గమ్ములన్!



కొల్లగొందును నీ కోమల బాహు

కంజదళాక్షి నీ ప్రణయ గానములో పులకింతునా మనో

రంజని ! పుష్పవృష్టి పరిరాల్చి నినున్ పులకింపనేతునా! [32పుట]

"శుభమౌ నీకు పథమ్మ" లెమ్మ ప్రభవిష్ణూ! జైత్రయాత్రామహా
ప్రభ సాగింపుము దిక్కులందు, నికటప్రాప్తవ్యమౌ దివ్య భ
వ్య భవిష్యత్తుకు దారితీయుము, స్వతంత్రానందబాష్పాలతో
నభిషేకింపుమురా భవజ్జనని పాదాంభోజముల్ ఫల్గుణా!

నరు డేకైకధనుర్ధరుం డయి, యఖండత్యాగదీక్షాధురం
ధరుడై నిల్చిన ముజ్జగమ్ముల నసాధ్యమ్మన్నదే లేదు; ద
గ్గరతే వెట్టి నిరోధశక్తులను, సంగ్రామావనిక నేడిటుల్
నరనారాయణు లొక్కరై నిలిచిరన్నక జెప్పనేమున్నదో!

రథియై గాండివ మూని ఫల్గుణుడు పోరాటమ్ము సాగింప, సా
రథియై పగ్గము లూని శౌరి రథసారథ్యమ్ము గావింపగా—
ప్రథనమ్మం దెదిరించి నిల్వగలడే ఫాలాక్షుడైనక, వృథా
వ్యథ నీ కేలర వీరభారతకుమారా! విల్లు చేపట్టరా!

కృతహస్తుండవు, సాంయుగీనుడవు, సాక్షీభూతభూతేశ్వర
స్తుతిపాత్రం, బతిమాత్ర మైనది భవద్దోర్దండవిక్రాంతి; వి
స్మృతిపాల్గాకుము—వర్తమాన మరుదెంచెన్—ధూర్తకౌరవ్యదు
ష్కృతికిక నిష్కృతి నేడు క్రీడిసమరక్రీడాసమారంభముల్!!

పాశుపతమ్ము నిచ్చుచు నపారకృపా పరిపూర్ణమానసుం
డా శశిశేఖరుండు "విజయా! విజయోస్తు! సమస్తవిద్విష
న్నాశన మాచరింపు" మని నా డనినాడుగదా, వృథావ్యథా
వేశపరుండవై తుడిచివేయుదు వెట్లు మహోగ్రరాజ్ఞలన్?

కట్టిడి వైరిరాచతలకాయలు గొట్టక, గాండివమ్ముతో
పిట్టలు గొట్టుకొందువో! అభేద్యకిరీటము రాజు నొద్ద తా
కట్టిడి పొట్టనింపుకొనగా తలపెట్టితొ! రాజయోగివై
చెట్టుల పుట్టలం జపముసేయుచు నీ బ్రతుకీడ్వ నెంతువో!
నెగ్గితివో స్వరాజ్యరమ నీ శిరముం గయిసేయు జాళువా
నిగ్గులుచిందు రత్నరమణీయకిరీటముతో, రణావనిన్
బ్రగ్గితివో యశోరమ సురమ్య సుమంగళ పుష్పమాలతో
సిగ్గులు చిందిపోవ గయిసేయును నీ యురమున్ పరంతపా!

రాజ్యము వీరభోజ్యము; పరాక్రమశాలియె భారతీయ సా
మ్రాజ్యము నేలజాలు; రణరంగము నందున సత్యవీర్య సా
యుజ్యము గల్గె, కల్గ దిక ఓటమి; సల్పు మఖండయజ్ఞమున్,
పూజ్యము క్షాత్రమున్ విడువబోకుము, పోకుము పారుబోతువై!

పాంచాలీ పరిషత్పరాభవ మహాపాపౌఘమేఘమ్ము గ
ర్జించెఁ నీ ప్రతిపక్ష శీర్షములపై, శీఘ్రమ్ము లే లెమ్ము ! నీ
చంచద్దాండివ నిర్విముక్త విశిఖాసారమ్ముతో బాటు వ
ర్షించుంగావుత రక్తవర్షము ప్రహర్షీభూతభూతమ్ముగఁ !

"శ్రీమద్భారతభాగ్యరేఖ, "విజయశ్రీ," విశ్వవీరుండు, వీ
డా మా వా" డని హర్షవిస్ఫురితసర్వాంగీణగర్వోల్లసత్
ప్రేమావేశుడు పాండురాజు దివిషద్బృందాలలో శ్లిష్ట సం
గ్రామఁ నిఁ గనులార జూచుకొనుగాకఁ నాకలోకస్థుడై !

"చంచచ్చండగదాభిఘాతముల యుష్మద్దుష్టవక్షస్థలుల్
సంచూర్ణించి, కదుష్ణరక్తలహరీ సంసిక్తహస్తుండనై
పాంచాలీ పరికీర్ణ కేశభరముఁ బంధింతురా" యంచు గ
ర్జించెఁ భీముడు దుస్సహేను గని యా సింహంబు నిద్రాణమే !

గంధేభమ్ములపై మృగేంద్రమువలెఁ గర్జింపుచున్, కౌరవ
స్కంధావారముమీద వాయుజుడు దూకంబోవుచుండెఁ భుజ
స్కంధమ్మందు గదాయుధమ్మిడి, ప్రతిజ్ఞాధర్మబంధాలలో
బంధింపంబడె నింతకాల, మిపు డాపంజాల రెవ్వారలుఁ !

వాడిమి పెంపు రాచ మగవారికి సొంపులు నింపు, నగ్గికిఁ
వేడిమివోలె, పౌరుషము వీడుట జాలిగ మాటలాడుటల్
పోడిమిగూర్చునయ్య నినుబోటికి? మంచి ధనంజయుండవే!
బూడిద మూడ్క తన్నుకొని పోదురు దుర్బలులఁ బలాధికుల్!!

అగుట లేదు గుట్టములు, హస్తములఁ బిగబట్టి పగ్గముల్
లాగుదు నెంతదాక! రణలగ్నము డాయుచునుండె–దుందుభుల్
మ్రోగకముండె లెమ్ము! గుణముఁ బిగియించి స్వరాజ్యలక్ష్మికిఁ
స్వాగత మిమ్ము గాండివశరాసన! చంద్రకులైకభూషణా!

జన్యము సేయ నస్త్రములు శస్త్రములుంగొని, దేశదేశ రా
జన్యులు వచ్చియుండిరి నిజధ్వజరాజివిరాజిమానులై;
దైన్యము నంది నీ విటు స్వధర్మము దక్కిన, ధార్తరాష్ట్ర దౌ
ర్జన్య దవాగ్ను లా నిరపరాధుల నిల్వున గాల్చివేయవో!

పరధనముల్ హరించి, పరాభూమినులన్ జెరబట్టి, ధర్మ త
త్పరు లగు వారి బానిసలభంగి నొనర్చెడి దుండగీండ్రపై
కరుణ వహించి జాలిపడగాదగునయ్య! నిరంకుశత్వ మ
ర్మర మనుజాధిపాథములు మానవజాతికి ఘోరశత్రువుల్!

నేనుంటిక రథముక గదల్చుటకు, సంధింతుక సమస్తమ్ము నే
నే నీ వుండు నిమిత్తమాత్రముగ, సందేహమ్ము పోనాడి నా
పైనర్పింపుము భారమంతయును, గెల్వంబో దధర్మంబు మం
దేనోయా ! విజయమ్మ, ముద్దులమరందీ! నమ్ము ముమ్మాటికిక !

కర్తన్ నేను సమస్త భూతములకుక, కౌంతేయ ! సర్వమ్ములో
వర్తింతున్, అవతారధర్మమును నిర్వర్తింతు, భూభారముక
దీర్తుక, నీవు నిమిత్తమాత్ర మగు మంతే! క్లైబ్యమింకేల నీ
కర్తవ్యమ్మును గుర్తెంరిగి విజయా ! గైకొమ్ము గాండీవముక !!

శుద్ధాంతమ్మును రచ్చకీడ్చిన నికృష్టుల్ నష్టమైపోవుటే
సిద్ధాంతమ్ము — దనంజయా ! విజయలక్ష్మి శాంతి సంక్రాంతమై
యుద్ధాంతమ్మున వీరభారతము విశ్వోత్కృష్టమౌ — చాలు నీ
రాద్ధాంతమ్ములు — కార్యసిద్ధికయి లేరా ! వారి సారింపరా !

గాండీవమ్ము ధరించి వైరిబలమున్ ఖండించి, యుష్మద్భుజా
పాండిత్యమ్మును జూప కీక్రియ భయభ్రాంతుండవై కుంగికూ
ర్చుండక పాశుపతమ్ము మైలబడిపోదో! పాండుభూభృద్యశో
డిండీరమ్ముల పాండిమమ్మున కిరీటీ ! లోటువాటిల్లదో !

వనవాసమ్ములు తీరిపోయె—చనె దుర్వారమ్ము లజ్ఞాత వా
స నిరాశామయ వాసరమ్ము లిక యుష్మద్దేవదత్తస్వతం
త్రనినాదమ్ముల వేళయయ్యె, చిరనిద్రామూఢగాఢాంధయా
మిను లల్లల్లన తెల్లవారెను, సమున్మీలించె ప్రాగ్భాగ్యముల్ !!

ఉత్తర దిక్కునఁ కురుచమూత్కరముం గని గుండెబ్రద్దలై
తత్తరపాటుతో దిగి రథమ్ము, పథమ్మున పర్వులెత్తు న
య్యుత్తరు నొత్తిపట్టి, దిగులూడిచి, ధైర్యము సెప్పి, తేరిపై
కెత్తిన వీరహస్తము లతే ! దిగజార్చెను గాండివ మ్మిటుల్ !

యంత నియంతయై విజయ నంతటి వానికి క్షాత్రధర్మసి
ద్ధాంత ముపన్యసించు టుచితంబును ధర్మము కాదు గాని, కొం
డంత ధనుర్ధరుండు సమయంబున చల్లగ జారిపోయి ది
గ్భ్రాంతి వహించు టెంతయు నపక్రమ మౌట నుపక్రమించితిన్!

తమ్ముల పొంగుతో నెదిరి తమ్ము నెరుంగడు రాజు, కర్ణు మీ
సమ్ములు, దుస్సహేనునిభుజమ్ములు, మామ కనుంబొమల్, మదిఁ
నమ్మిరణమ్ము నెత్తికొనినాడు—మెడల్పడి క్రుంగి శృంగభం
గమ్మగు; జేనికిఁ దురధికారమదాంధత గెల్పునిల్పునే!

ఈ గర్వాంధుల రూపుమాపుటకె గానీ! జీతమా బత్తెమా
నీ గుఱ్ఱమ్ముల దోలునంత పనికిఁ నేనేల? మా యింటిలో
నే గుఱ్ఱాలను దోలలేనొ! నిజమింతే ధర్మరక్షార్థమై
యోగ మ్మానితి పార్థ సారథి మహోద్యోగమ్ము సాగించితిఁ!!

ఆకర్ణాంతవికృష్ట విశ్వవిజయోద్యద్ధాండివజ్యారవం
బాకర్ణించిన మాత్ర, దుస్సహ దురన్యాయప్రభుత్వమ్ములో
భూకంపమ్ములు పుట్టు, బ్రద్దలయిపోవుఁ ధూర్త దుశ్శాసన
ప్రాకారమ్ములు, క్రుంగి కూలు కురుసమ్రాడ్భావనాహర్మ్యముల్!

గురు గాంగేయులతోడి పోరితము సంకోచింపగా దగ్గదే
మరి వా రేటికి మిన్నకుండక యధర్మమ్ముఁ సమర్థించి ముం
దర కేతెంచిరి? భీష్మపౌత్రుడవుగాదా ధర్మ దీక్షఁ, ధను
ర్ధర మూర్ధన్య! పురోగమింపుము పవిత్రక్షాత్రరక్షార్థివై!

"ఇది నీ మాతృఋణంబు" తీర్చుకొనుమోయీ! వేడిరక్తమ్ముతో!
"ఇది నీ కగ్నిపరీక్ష" దీక్ష గొనుమోయీ! క్షాత్రవిస్ఫూర్తితో!
"ఇది కర్తవ్యము" నీకు నిల్వబడుమోయీ! కర్మవీరుండవై!
"ఇది నీ జీవిత లక్ష్య" మందుకొను మోయీ విల్లు! శత్రుంజయా!

ఆహవ మ్మిది స్వేచ్ఛా మహా హవమ్మ,
నీవు హోత, వుపద్రష్ట నేను, స్రువము
గాండివమ్మ, విరోధి మూకలు హవిస్సు,
యజ్ఞఫలము స్వరాజ్యసంప్రాప్తి, పార్థ!

త్రిభువనమ్మ లేలు దేవేంద్రు మకుటమ్మ
తగుదు నంచు మౌళి దాల్చినావు;
సురల గౌరవమ్మ సురరాజు మరియాద
శిరసు వంచి క్రిందుసేయకయ్య!

నిలిచియున్నాడు వీరాంజనేయమూర్తి
జయము సాధింప నీ ధ్వజాంచలమునందు;
నరుడవే యిట్టులైన, వానరు డత్తండు
తోకజాడించి చెంగున దుమికిపోడె!

కుంతి కూరుచుండె కొండంత యాసతో
కొడుకులేమొ ముక్తి గూర్తు రంచు;
దిక్కుమాలి ఎన్ని దినములు పడియుండు
జాతివారి కన్నుసన్నలందు?

"పార్థ" శబ్దమున కపార్థమ్ము గల్గించి
వాడిసెడుట రాచపాడి గాదు;
'ఇట్టికొడుకు' వన్న యింద్రుని సభ నున్న
పాండురాజు కింక బ్రతుకు గలదె!

దేవదత్తము పరువు, గాండీవ గౌర
వమ్మ్మ, శ్వేతాశ్వముల మహత్త్వము, కపిధ్వ
జ ప్రతిష్ఠయు, త్వ త్పరాజయ కళంకి
తమ్ములై నిల్చు కవుల గ్రంథముల ముందు.

"ఇంట నిప్పువెట్టు" నీ నృశంసుల జంప
"కంట నీరువెట్టు" కరుణ చాలు,
కంట నీరు వెట్ట కాలమ్మ్ము గా దిది
వింట బాణ మెక్కు వెట్టుమోయి!

ఆత్మవిస్మృతి నంది, సంది
గ్ధాత్మ్మడవు గాబోకు మోయీ!
ఆత్మగౌరవ పథములో ముం
దడుగు నిడు మోయీ!

భరతవీరా! లేవవోయీ!
పౌరుషము మేల్కొలుపుమోయీ!
"నరుడ"వోయీ నీవు! "నారా
యణుడ"నే నోయీ!

కర్మవీరా! నిల్వబడి, నీ
ఘర్మకణములు తుడుచుకోరా!
ధర్మమును చేపట్టి విజయ
ధ్వజము నెత్తుమురా!

విజృంభణము

అర్జునుడు

మోహ మడంగె నో భువనమోహనరూప! తొలంగె ధర్మసం
దేహము లన్నియుఁ, దిగులుదీరె, మనమ్ము కలంకదేరె, ను
త్సాహము మైకొనెఁ, విగతధర్ముడనైన ననుఁ స్వధర్మ ని
ర్వాహకుగా నొనర్చిన భవత్కృప కియ్యవె ధన్యవాదముల్!

ఉదయశ్రీ కరుణారుణారుణ నవాభ్యుత్థానముల్ పద్మినీ
హృదయముఁ కదలించి జీవితమధుప్రేమామృతాస్వాదసం
పద పొంగించెడి రీతి, తావక మహోపన్యాసముల్ నా మదిన్
కదనోత్సాహము నూలుకొల్పె, నిలిపెన్ కర్తవ్య రంగమ్మునన్!

ముందుకుసాగనిమ్మ రథముఁ మధుసూదన! చేత గాండివ
మ్మందితి, "సోమశేఖరునియాన" త్యజింపను! రాజు గుండియల్
కొందలమంద తద్బలము గూల్చెద, మాత కఖండసుప్రజా
నందము గూర్చెదఁ, ద్రుపదనందన దుఃఖభరమ్ము దీర్చెదఁ!

ఒత్తుము పాంచజన్యము! ముహుర్ముహురాకులితారిసైన్య మే
నొత్తెద దేవదత్తము, మహోదయ! నీ దయ కల్మి నీ మదో
న్మత్తుల ద్రుంచి, ఈ దురిభిమాననితాంతనిరంకుశత్వ సం
పత్తికి స్వస్తిచెప్పి "నవ భారత వీర పతాక" నెత్తెదఁ!

శ్రీ కృష్ణుడు

శ్రీమంతం బగుగాక భారతము! సుస్నేహార్ద్రరాజప్రజా
సామంతం బగుగాక క్షాత్రము! సముచ్చైశ్శాంతిసీమంతినీ
సీమంతం బగుగాక సృష్టి! విజయశ్రీ, క్రాంతి సంక్రాంతికిఁ
హేమంతం బగుగాక నవ్య యుగ సందేశ ప్రభావంతమై!

ఇతి శ్రీ

అనుక్రమణిక

అంగతాణ కృపాణ	59	ఆకర్ణాంత విక్షప్త	69
అంగేశుం గని భీతి	49	ఆగుటలేదు గుఱ్ఱములు	66
అందేకాంత రహస్సభా	38	ఆగుమాగు మొకింత	47
అంధత్వమ్మున కన్న	55	ఆడది యేడ్చి తెచ్చుకొని	25
అంధుడు వృద్ధరాజట	23	ఆడితి మోడిపోయితి	25
అతడు భగదత్తు	45	ఆత డజాతశత్రుడు	62
అతడె శకునాలపక్షి	44	ఆత్మ విస్మృతి నంది	71
అతిరథులు వీరు	41	ఆప్తమిత్రుల ననుగు	50
అది పాంచాలి పటాంచలా	21	ఆప్తులు కారవేశ్వరున	46
అధిష్ఠితోద్దండ	26	ఆయెను బోయెసంధి	29
అని చిరుఁవ్వు నవ్వుచు	38	ఆర్యజనసన్నుతుని	51
అనుచు తెలుపుమనియె	37	ఆలకించినారలా	37
అన్నకర మ్మనంత	61	ఆశాస్యమ్ములు దీరుచెల్లి	31
అన్నయు నాన్నగారు	29	ఆశ్చర్య మ్మవిలంఘ్యమా	21
అబ్ధిప్రావృతమేదినీ	22	ఆ సభయందు రాసభము	23
అమ్మ పరాయి పంచ	62	ఆహవమ్మిది స్వేచ్ఛా	70
ఆరదము లూపు	46	ఇంక రణోత్సుకత్వము	56
ఆరుగో దుశ్శాసనాది	45	ఇంట నిప్పువెట్టు	71
ఆర్థముల కోసమై	28	ఇండ్లు గాల్చుటండు	44
ఆర్థింపన్ విజయమ్మ్రి	59	ఇందరు శౌర్యధైర్య	49
ఆల వారణాసి	55	ఇట్టి దారుణ మారణక్రియ	52
ఆల్లదే ముద్దుబావ	44	ఇది నీ మాతృబుణంబు	69
ఆవియొక వీరభారత	21	ఇదియేమీ ఇదియేమి	49
ఆస్త్రవిద్యారహస్యము	43	ఇమ్మనాన్న డయిదూళ్ళు	20

ఈ గర్వాంధుల రూపు 69
ఈ మహామహుడైన 42
ఉత్తరదిక్కునన్ కురు 68
ఉదయశ్రీ కరుణారుణా 73
ఎంతపని కొడిగట్టు 51
ఏమయిన తప్పదిక 33
ఏ మహోద్దేశసిద్ధి 37
ఏమీ ఇప్పటికైన 31
ఐనవి సంధిసంబరములు 19
ఒత్తుము పాంచజన్యము 74
ఔదాసిన్యము నుజ్జగింపు 61
కక్ష మెయి పోరాడుకొని 53
కట్టిడి వైరిరాచతల 64
కత్తులు గ్రుచ్చినన్ 57
కదలివచ్చిన హిమవన్నగంబో 42
కర్తన్ నేను సమస్త 67
కర్మవీరా ! నిల్వబడి 72
కలితలలితేందుకుల 24
కాలుని దున్నపోతు 20
కుంతి కూరుచుండె 70
కుటిల కీటకశత 14
కుపిత పాండవకాండ 32
కృతహస్తుండవు 63
కేలపెను విల్లువెలయ 42
కొంచెపు మాటిలాడెదు 57
క్షాత్ర తేజస్సు భారత 37
ఖాండవము దహియించు 50
గంధేభమ్ములపైమృగేంద్రము 65
గాండివము చేవీడు చున్నది 48
గాండివము మోపెట్ట వలెనా 50
గాండీవమ్మది చేయిజారినది 49
గాండీవమ్మ ధరించి 67
గుండెలు రాయిచేసికొని 56
గురు గాంగేయులతోటి 69
గురున కా ప్రక్క అపర 43
గోడుగోడున నాలుబిడ్డలు 53
గ్రామము లైదు మీ రడుగగా 31
ఘోషయాత్రనాటి 24
చంచచ్చండ గదాభిఘాత 65
చంప్రటో చచ్చిపోవుటయొ 58
చాలితిరేని ముందునకు 30
చిక్కని పోటుమానిసి 54
చిత్తము చిక్కబట్టుము 54
చుట్టాల చంపి పట్టము 28
జన్యము సేయ నస్త్రములు 66
జెండా జాతికి జీవకట్టి 60
తగవులఁ సహోదరులలో 27
తన కుమారుల పగతంత్ర 36
తప్పదు హింస యెందుకు 56
తమ్ముల పొంగుతో 68
తాతలను తండ్రులను 50
త్యజింతురో క్షాత్రకుల 26
త్రాటం గట్టిరి నీట 21
త్రిజగతీ రాజ్యమ్మె 52

త్రిపథగాసుత కుంభజ 32
త్రిభువనమ్మ్ము లేలు 71
దండము దక్క-నొండొక 23
దారుణ రణాంగణమ్మున 28
దిక్కు చెడియున్న మిత్తల్లి 36
దుష్టదుర్యోధనుడు 52
దుష్టదుర్యోధనునికొరకై 40
దేవదత్తము పరువు 70
దేశకల్యాణ దివ్య 36
దేహమా కంపించుచున్నది 48
దొరల మటంచు రాజసముతో 22
దోసమెు మోసమో జరిగె 25
ధన ధనంధన భీముగదా 32
ధర్మక్షేత్రిముక్షాత్రి 59
ధర్మసమ్మోహమ్ము చేతము 53
ధూర్తమతిసై స్వార్థమ్మున 52
నన్నుగని కౌగిలించి 34
నరు డొకైక ధనుర్ధరుండయి 63
నలుగురు సోదరులొకపై 33
నిండిన పాపభాండము 31
నిదార్శిణమ్మగు జాతికిన్ 60
నిలిచియున్నాడు వీరాంజ 70
నీ దైన్యమ్మిక చాలు 60
నెగ్గితివో స్వరాజ్యరమ 64
నెయ్యమునకు మే మంపిన 33
నేనుంటిన్ రథమున్ కదల్చి 67
పచ్చని రాజవంశమును 22
పరధనముల్ హరించి 66
పరపరాభవ రోష 32
పరిచితాభీల సంగర 39
పరుల పంచలపడు 34
పాంచాలీ పరిషత్ పరాభవ 65
పార్థశబ్దమున కపార్థమ్మ్ము 64
పాశుపతమ్ము నిచ్చుచు 64
పుట్టితి పూజ్యుడౌ ద్రుపద 29
పుట్టినదాది రాజుకొని 23
పుణ్యపదవీ భ్రష్టుడను 53
పెంటితనమ్ము మై మనసు 57
పెద్దన్నయ్యయహింసయే 56
పోయితి మీకు వారికిని 51
ప్రాతరుత్థుల్ల పంకజశ్రీ 42
ఫళఫళ ద్రోగెరా విజయ 61
బందుగుల ద్రుంచిపంప 48
బంధింపక దలపెట్టి 20
బావను హస్తినాపురము 25
బిడ్డలకు దూరమై 34
భటహుంకృతు లొకయెడ 41
భద్రగజము వీపుపైన 44
భరతవీరా! లేవవోయీ! 72
భవదీయ స్తవనీయ 61
భారతభాగ్య దీపికలపై 35
భారత వీరమాతయగు 30
భీష్మపార్ష్వాన 33
భుజాగ్రముల్ పొంగ 26

మండిత పాండవాన్వయుడు	30	విపరీతమ్ము గ విశ్వ	35
మణిమయ స్వర్ణకింకిణీ	39	విరటుగోగణమ్ము	24
మనకు సాయమ్ము సలుప	45	విశ్వవిఖ్యాత భారత	33
మాధవా! రథ ముభయ	41	వీడే భారతవీరుడు	60
మాపాలు మా కొసంగగ	33	వీర భారతభూమి	39
మారని మాటలేటి కిటు	29	శంకా సంకుచితాంత	56
మారుచున్నది యంతకంతకు	47	శుద్ధాంతమ్మును రచ్చ	67
ముందుకు సాగనిమ్మ	74	శుభమా నీకు పథమ్మ	63
ముందు కూర్చుండి నే	40	శ్రీమంతంబగుగాక	74
మోహమడంగె నో భువన	73	శ్రీమదాభరత భాగ్యరేఖ	65
ముక్కడి కొరవాధములు	53	సంతోషించితి కురురాట్	28
యంత నియంతలైరి	68	సంధియగు బాల్యమైర	27
రక్తపు కూడు గాక	57	సంపాదించిన తండి	35
రణముహూర్తము డాసె	40	సత్వర పరాజితారాతి	40
రథియై గాండివముని	63	సస్యశ్యామల రత్నగర్భ	62
రాజరాజు సహాయులై	41	సింహలాంగూలకేతన శ్రీ	43
రాజుక్కడ నంగరాజు	45	సింహాసనమ్మ్మ్మె కొరకై	27
రాజ్యము వీరభోజ్యము	64	సిద్ధవందితచరితు	51
రాజ్యలోభా కాంత	51	సిరులు దొరంగి ఘోర	20
రారాజైవ్వడు రాజ్యమేలగ	22	స్మరింపుడీ భూతసభా	26
లెమ్ము ధనంజయా!	58	స్వచ్ఛజ్యోత్స్నలు చిందు	35
వనవాసమ్ములు తీరిపోయె	68	హింస యహింస యంచు	30
వాడిమి పెంపు రాచ	66	హింసయొనర్పనంటివి	58
విజయశ్రీ గొనితెత్తు	62	హింసామయజీవనుల	27

★

అరుణ కిరణాలు

ప్రతులకు:

రామా పబ్లిషర్స్

ప్రొ॥ రామా బైండింగ్ వర్క్స్

కందులవారి వీధి

విజయవాడ

అరుణకిరణాలు

జాతీయ గేయాలు

జంధ్యాల పాపయ్యశాస్త్రి
కరుణశ్రీ

కరుణశ్రీ కావ్యమాల
అమరావతి

క

సర్వస్వామ్యములు
రచయితవి

తృతీయ ముద్రణము
౧౦౦౦ ప్రతులు

జనరల్ ప్రింటర్స్
తెనాలి

న మ స్తే

కిరణాలు ప్రకృతికి అలంకరణాలు - ఆత్మజ్యోతికి ఆవిష్కరణాలు - విశ్వవిప్లవ విస్ఫురణాలు -

కిరణాలు నిద్రించేవారిని మేల్కొల్పుతై - మేల్కొన్న వారిని ముందుకు నడిపిస్తాయ్ - నడిచేవారికి చీకట్లో త్రోవ చూపిస్తాయ్ -

కిరణాలు స్తబ్ధమైన బ్రతుకుల్ని పులకింపచేసి పలికింప చేస్తాయ్ - క్రొత్త రక్తాన్ని ఒలికింపచేస్తాయ్ -

కిరణాలు రవిలోనుంచే కాకుండా కవిలోనుంచి కూడా ప్రసరిస్తాయ్ - రవికిరణాల్లో వలెనే కవికిరణాల్లో కూడా ఒక నవోదయం - ఒక యుగోదయం దాగి వుంటుంది.

వీటిలో చాలా భాగం ధంకా చిత్రగుప్త రూపవాణి తెలుగుతల్లి ప్రజాశక్తి భారతి గృహలక్ష్మి ఆంధ్ర పత్రికల్లో ప్రకటితాలు. అందుకు ఆ పత్రికలకూ సంపాదకులకూ ధన్యవాదాలు -

నా కిరణాల్లో ఏ ఒక్కటైనా పాఠక హృదయాన్ని కదిలిస్తే కృతార్థుణ్ణి -

కరుణశ్రీ

అంకితం

అరుణకు

అనుక్రమణిక

జయ్ హింద్	౯
కరుణాంజలి	౧౦
అరుణ	౧౧
కెప్టెన్ లక్ష్మి	౧౩
జయప్రకాష్	౧౪
ఆంధ్రకేసరి	౧౫
బాపూజీ	౧౬
బాలవీరులు	౧౯
కందుకూరి	౨౧
యశోధర	౨౩
నాన్న కోసం	౨౪
నిద్దురలేవోయ్	౨౯

జ్యోతి	33
పండుగరోజు	3E
తప్పులేని తమ్ముడు	3ఔ
బీదాసాదా	४०
స్వేచ్ఛాదీపాలు	४ం
ఓప్రభూ	४ౠ
బుల్లిమరదలు	४ఴ
దివ్యదీపావళి	౫०
బాకా	౫ం
ఉదయగీతి	౫४
చల్ చల్ రే నౌజవాఁ !	౫ౠ
వ్యత్యాసాలు	౫౬
తరంగాలు	౫ఴ
కావాలి	౬౫
వందేమాతరం	౬3

జయ్ హింద్

జయలక్ష్మీరా!! జయలక్ష్మీరా!!
జయలక్ష్మీరా! జగజ్జనని భారతమాత
జయపెట్టరా! నీదు జన్మభూమికి నేడు
జయలక్ష్మీరా!!

ప్రేమోగింపరా!! ప్రేమోగింపరా!!
ప్రేమోగింపరా! దిశాంతముల నీజయభేరి
సాగింపరా! ప్రజాస్వాతంత్ర్య రథము నిక
ప్రేమోగింపరా!!

స్థాపింపరా!! స్థాపింపరా!!
స్థాపింపరా! నీ స్వరాజ్య విజయ ధ్వజము
ప్రాపింపరా! నవ్యభారత మహోదయము
స్థాపింపరా!!

కరుణాంజలి

[బొంబాయి నావికుల బలిపీఠాలపై]

కదనోద్ధత కర్మవీర
వదనోద్ధత రుధిరపూర
బలి పులికత నవభారత
జగతీ జాగరణాంజలి
తరుణ తరుణ బాష్పాంజలి

పరిమ్లాన దీన హీన
పరిక్షిప్త శప్త తప్త
పరాభూత జనతా దు
ర్భర జీవన మరణాంజలి
అరుణ అరుణ బాష్పాంజలి

సత్యాగ్రహ దీక్షాబల
సంస్తంభిత పరప్రభుత్వ
హత్యామయ దుష్కృత్య
ప్రత్యక్షీ కరణాంజలి
కరుణ కరుణ బాష్పాంజలి

అరుణ

యువభారత యుగోదయంలో
నవభారత మహోదయంలో
పూచిం దొక అరుణతరంగం
లేచిందొక క్రాంతి విహంగం

కంఠంలో విప్లవరాగం
గమనంలో విద్యుద్వేగం
దేశానికి నవసందేశం
లోకానికి నూత్నాలోకం

త్యాగోజ్జ్వల మహిమా మండిత
రాగారుణ రక్తపతాకం
నవభారత హృదయాంబరమున
ప్రసరించిన మహేంద్రచాపం

చైతన్యం జీవిత లక్ష్యం
స్వాతంత్ర్యం అంతస్సాక్ష్యం
ప్రాచీ దిగ్ దృగంచలంలో
రోచిస్సులు చిలికే కిరణం

అజ్ఞాతం అతిక్రమించిన
ప్రజ్ఞామయ విజయవిహారం
కురుక్షేత్ర సంగ్రామానికి
గురిపెట్టిన ఘన గాండీవం

కెప్టెన్ లక్ష్మి

లాల్ ఖిల్లా ప్రాంతంలో
లక్ష్మి సాక్షాత్కారం
ఏమానాన్ని దిగుతున్నది
వీరఝాన్సి అవతారం

అరిభీకర కరవాలం
సుర పురిలో దాచిపెట్టి
దిగివచ్చావా క్రిందికి
దేవీ ! ఝాన్సీబాయీ ! !

నేతాజీ కుడిభుజమై
స్వాతంత్ర్య క్షేత్రానికి
జాతిని నడిపిన దివ్య
జ్యోతివి కెప్టెన్ లక్ష్మి ! !

రక్తాక్షుల రణకవచం
రంగూన్‌లో ఉతుకవేసి
పచ్చావా ! మాతృచరణ
వందనార్థమై నేటికి !

జయప్రకాష్

వెలువడింది వెలువడింది
విప్లవ సింహ కిశోరం

కుటిల జటిల శృంఖలాలు
పెటపెట ఫెటఫెటా త్రెంచి
కఠోర కారగారపు
కటకటాలలో నుంచి
వెలువడింది వెలువడింది
విప్లవ సింహ కిశోరం

పీడిత తాడిత జనగణ
ప్రేమమయ ప్రియ సుహృదయ!
ధనికవాద దావానల
శమన ఘనాఘనాభ్యుదయ!

జయ్! జయ్! జయ్!
జయ్‌ప్రకాష్!!
నవభారత యువ సమ్రాట్!!!
జయ్! జయ్! జయ్!

ఆంధ్రకేసరి

ఆ కన్నుకొనలలో
ఆంధ్ర తేజోరేఖ మొలిచిందిలే!
ఆ కార్యదీక్షలో
అసమాన ధైర్యమ్ము నిలిచిందిలే!

ఆ సింహగర్జనో
అచల కర్తవ్యమ్ము మ్రోగిందిలే!
ఆ సాహసమ్ములో
ఆత్మగౌరవ గీతి తూగిందిలే!

వీరాంధ్రకేసరీ! విజయాంధ్రకేసరీ!
వేంచేయుమా రాష్ట్ర విజయవేదిక పైకి
ఆంధ్రప్రజా ప్రసుప్తాంతరంగముల కొక
అమర సందేశమ్మువై!!
ఆశా ప్రకాశమ్మువై!!

బాపూజీ

మా

నవాభ్యుదయ సంకేతం
నీ జన్మదినోత్సవ జయగీతం

హిమాలయ
మహా మహీధర
శిఖరాగ్రం మీదినుండి
స్వచ్ఛమైన అందం లాగున
స్వచ్ఛందచ్ఛందం లాగున
చెంగు చెంగుమని లంఘించే
చల్లని నదీమతల్లుల
ఉదాత్త జీవనానికి
ఉజ్జీవనం
బాపూజీ!
నీ జీవనం!

నీ నిత్యోజ్జ్వల వదనంలో
నీ సత్యాగ్రహ కదనంలో
బుద్ధదేవు కారుణ్యం వలె
శ్రద్ధామయ కర్తవ్యంవలె
ప్రవహించిన
ప్రతిధ్వనించిన
ప్రశాంత జయ ఘంటాధ్వానం
ప్రపంచ నవ యుగాహ్వానం !

పరాధీన భారతదేశంలో
నిరాధార నిర్భాగ్యప్రజలకు
తరతరాల చైతన్యం
నరనరాల కెక్కించే
భవ్యభవ త్తపశ్శక్తి
భారతీయు దాస్యవిముక్తి !

నీ అహింసా మకుట మణికాంతులు
ఈ మహాప్రపంచ సుఖశాంతులు !

నీఖాదీ
మా ఆజాదీ!

నీ ధ్యేయనిష్ఠ
జాతిస్వాతంత్ర్య పునఃప్రతిష్ఠ!

నీ సత్యాగ్రహ సాధన
శాంతిదేవతా సమారాధన!

నీ కర్తవ్య మహాదీక్ష
లోకానికి శ్రీరామరక్ష!

నీ సర్వమానవ సమాన దృష్టి
సత్యాహింసల సమిష్టి!

నీ బోసి నవ్వులు
దేశమాత పూజకోసం
కోసి రాసి పోసిన పువ్వులు!!!

బాలవీరులు

స్వజాతి వీర శక్తులం
ప్రజా ప్రభుత్వ భక్తులం
అఖండ శౌర్య యుక్తులం
అజేయులం!! అజేయులం!!

స్వధర్మ కర్మవీరులం
స్వరాజ్య కర్ణధారులం
స్వదేశ చాటుకారులం
స్వతంత్రులం!! స్వతంత్రులం!!

ఆజేయ భారతీయులం
అమోఘ వజ్రకాయులం
అనంత గుణ విధేయులం
అఖండులం!! అఖండులం!!

మహాత్మగాంధి శిష్యులం
సుబాస్‌బోసు తమ్ములం
విశాల విశ్వభారతీ
విధాతలం !! విధాతలం !!

నువర్ణ వర్ణమాలతో
త్రివర్ణ కేతనాలతో
స్వతంత్ర సమర గాధలక్ష
లిఖించుతాం !! లిఖించుతాం !!

జయధ్వజంబు సాగెరా
జయం! జయం! జయం! జయం!
ప్రభాతభేరి మ్రోగెరా
శుభం! శుభం! శుభం! శుభం !!

కందుకూరి

అందుకోండోయ్! అందుకోండోయ్!
అందుకోండోయ్! కాన్క లందుకోండోయ్!
"కందుకూరీ" గొప్ప కర్మవీరుండోయ్!
వీరేశలింగ మొక విప్లవతరంగమోయ్!

ఆంధ్రజాతికి మేలుకొల్పు పాడా డతడు
ఆంధ్రగౌరవగీతి ఆలపించా డతడు
అంధవిశ్వాస గాఢాంధకారము బాపి
అభ్యుదయగతుల ముందడుగు వేయించాడు !!

తెలుగుగడ్డకు మంచి పేరు తెచ్చా డతడు
తెలుగుబిడ్డకు ముందు చూపు నిచ్చా డతడు
తెలుగు గుండెకు క్రొత్త వెలుగు పోశా డతడు
కులమతద్వేషాలు కూల్చివేశా డతడు !!

నవ్యాంధ్రసాహితికి నాందిగీత మ్మతడు
ప్రాచీనసాహితికి భరతవాక్య మ్మతడు
దేశమంతటికి సందేశమైనా డతడు
లోకాని కొక నవాలోక మైనా డతడు!!

సంఘసంస్కార దీక్షాబద్ధకంకణుండు
సాహిత్య నవయుగాస్థాన సంస్థాపనుండు
మహిళా మహాభ్యుదయ మహనీయజీవనుండు

అమరజీవికి పూజ లర్పించుకుందాము
రం...డోయ్! రండో...య్! రం...డో...య్!!

యశోధర

కన్నీళ్లతో ప్రభువు కదలిపోతున్నాడు
ఎన్నాళ్లకో మాకు యిక పునర్దర్శనము
శోకమా కన్నెత్తి చూచుకోవమ్మా !
కోకిలా గొంతెత్తి కూయబోకమ్మా !

పరమ సుకుమారములు ప్రాణేశు పాదాలు
హెచ్చుతగ్గుల దారి గుచ్చుకుంటుందేమొ
మెల్లంగ రావయ్య మేఘుడన్నయ్యా !
చల్లంగ ముత్యాలు చల్లిపోవయ్యా !

కసుగందునో స్వామి కుసుమకోమలమూర్తి
పసివాడునో స్వామి మృణమంజులమూర్తి
కాకచూపింపకో లోకబాంధవుడా !
కనిపెట్టియుండుమో కమలబాంధవుడా !

నాన్న కోసం

[అర్ధరాత్రి అంధకారంలో శ్రీమతినీ, చిరంజీవినీ విడిచి శోకమయమైన లోకాన్ని సముద్ధరించటం కోసం కరుణామూర్తి గౌతముడు కదలిపోతాడు. క్రమంగా కొన్నాళ్లకు గౌతముని కుమారుడు రాహులుడు పెరిగి పెద్దవాడవుతాడు. "నాన్న యేడి? ఎక్కడికి వెళ్లా?" డని వాళ్లమ్మని వేధించటం మొదలుపెడుతాడు. కన్నతల్లి యశోధరాదేవి ఎన్నోవిధాల కొడుకును మాయమాటలు చెప్పి మరపింప చూస్తుంది. అందరబ్బాయిల నాన్నల్ని చూచి కుమార రాహులిహృదయంకూడా తండ్రిదర్శనం కోసము తహతహ లాడుతుంది. ఆ పసికంఠం లోనుంచి ప్రసరించిన భావకిరణాలేయివి.]

నాన్నయేడే అమ్మ!
నాన్న యేడే?

ఎక్కడికి పాయినాడె
ఎన్నాళ్లకొస్తాడె
వస్తు వస్తూ ఏమి
వస్తువులు తెస్తాడె!

రేపు వస్తా డంటు
మాపు వస్తాడంటు
చూచిచూచీ కళ్లు
వాచిపోతున్నాయి

గోలచేస్తాననీ
కోప మొచ్చిందిటే !
అల్లరబ్బాయినని
అలిగిపోయినాడుటే
నాన్నయేడే అమ్మ !
నాన్నయేడే ?

అదుగదుగొ మబ్బుల్లో
అందాల జాబిలి !!
పంచకల్యాణిపై
బాబయ్య రాడేమె ?
ఆ కొండ మీదుగా
ఆ మబ్బులోనుంచి
నాన్న మన యింట్లోకి
నడచి వస్తాడుటే
నాన్నయేడే అమ్మ !
నాన్నయేడే ?

నిన్న నీ వొళ్లోను
నిదురపోతుంటేను
నాన్న కళ్లో కొచ్చి
నన్నెత్తుకున్నాడె
చల్లగా మెల్లగా
వొళ్లంత నిమిరాడె
మానాన్నచేతుల్లో
మైమరచి పోయినానె
నాన్నయేడే అమ్మ !
నాన్నయేడే ?

నాన్న చల్లని చెయ్యి
నాన్న తియ్యనిముద్దు
మరచిపోదామన్న
మరపురాకున్నాయె !
తనవెంట ననుగూడ
గొనిపోదునన్నాడె
కన్ను లెత్తే సరికి
కనుపించనే లేదె
నాన్నయేడే అమ్మ !
నాన్నయేడే ?

నీ కళ్లలో యిన్ని
నీటి ముత్యా లేమె!
గుండె టకటక యిట్లు
కొట్టుకుంటుందేమె!
ఎక్కెక్కి యేడుస్తు
యేమి లే దంటావు
చేతు లివి చూడవే
చిక్కిపోయినా యెంతొ
నాన్నయేడే అమ్మ!
నాన్నయేడే?

రేపులెన్నో పోయె
బాపుజీ రాడాయె
మాయమాటలు చెప్పి
మరపించుతున్నావు
నన్నయిన పంపవే
నాన్న దగ్గర కెళ్లి
అమ్మ యేడుస్తున్న
దని పిల్చుకొస్తాను
నాన్నయేడే అమ్మ!
నాన్నయేడే!

అందరబ్బాయిలతో
ఆడుకోబోతేను
జనమంత నావైపు
జాలిగా చూస్తారె
నాన్నలే కేడ్చేటి
నాలాంటి పసివాళ్ళ
కన్నీళ్లు తుడిచి, ఓ
దార్చి వస్తాడుటే
నాన్నయేడే అమ్మ
నాన్నయేడే ?

ఎక్కడికి పోయినాడె
ఎన్నాళ్ళ కొస్తాడె
వస్తువస్తూ ఏమి
వస్తువులు తెస్తాడె ?

నిద్దురలేవోయ్

కొంపలు గోడలు గుల్లలుచేస్తూ
తల విరబోసుక తైతకలాడే
మద్యపానమను మహారాక్షసిని
నీ పలుగులతో పొడిచెయ్యాలోయ్—
నిద్దురలేవోయ్ !! కర్షకుడా !!

రైతుల పైబడి రక్తము త్రాగే
బీదల కండలు కరకర నమిలే
వడ్డీ దయ్యపు కాళ్లుచేతులను
నీ గొడ్డలితో నరికెయ్యాలోయ్—
నిద్దురవోలేయ్ !! కర్షకుడా !!

ధనికతత్వమూ స్వార్థపరత్వము
బిగుసుకుపోయిన బీటిపాతాలను
పాదుకుపోయిన పాటిదిబ్బలను
నీ నాగలితో దున్నెయ్యాలోయ్—
నిదురలేవోయ్ !! కరకుడా !!

కార్మికవర్గము కండలుకొరికే
కర్మాగారపు కఠినచట్టములు
యంత్రాలయముల హైన్యపద్ధతులు
నీ గుంటకతో సరిచెయ్యాలోయ్—
నిద్దురలేవోయ్ !! కర్షకుడా !!

జాతివైరములు చదునై పోయిన
జాతీయత వ్యవసాయము చేసిన
జన్మభూమిలో శాంతీ బీజములు
నీ జడ్డిగమున వెదబెట్టాలోయ్ .
నిద్దురలేవోయ్ !! కర్షకుడా !!

పైరుపాలాల్లో పడి తెగతెంటూ
రంకెలుబెట్టే ఆబోతెద్దుల
గంతులువేసే గంగిరెద్దులా
నీ ములుగర్రతో అదిలించాలోయ్—
నిద్దురలేవోయ్ !! కర్షకుడా !!

అల్లిబిల్లిగా అల్లుకుపాయ్యే
మూఢాచారపు ముళ్లతీగలను
మతవిద్వేషము కలుపు మొక్కలను
నీ కొడపలితో కోసెయ్యాలోయ్—
నిద్దురలేవోయ్ !! కర్షకుడా !!

పంటచేలపై పచారుచేస్తూ
పైపై తిరిగే పరిగ పిట్టలను
కంకులుకొరికే కాకిమూకలను
నీ వడిసెలతో బెదరించాలోయ్—
నిద్దురలేవోయ్ !! కర్షకుడా !!

కుప్పలు బడ్డా కులభేదాన్ని
కల్లాన్నేసీ నురిపిడిచేసీ
భరతభూమిపై పాటలుపాడుతు
నీ చేటలతో తూర్పెత్తాలోయ్—
నిద్దురలేవోయ్ !! కర్షకుడా !!

అగ్రజాతులా అత్మలలోపల
అంటుకుపోయిన అస్పృశ్యతనీ
అతుక్కుపోయిన అంధత్వాన్నీ
నీ పాలికట్టతో తుడిచెయ్యాలోయ్—
నిద్దురలేవోయ్!! కర్షకుడా!!

తాలూతరకా గాలికిపోసీ
దయాశాంతులను ధాన్యపురాసులు
బండ్లకునెత్తీ పాతరవేసీ
నీ గాదెల్లో నిండించాలోయ్—
నిద్దురలేవోయ్!! కర్షకుడా!!

జ్యోతి

వెలిగింపరా !! జ్యోతి
వెలిగింపరా !!

విజయ భారతజాతి
విశ్వ మంగళ గీతి
వినవచ్చుచుండెరా !
విద్యార్థి సోదరా !

వెలిగింపరా !! జ్యోతి
వెలిగింపరా !!

పారతంత్ర్య మహాంధ
కార కారాగార
ద్వారాలు బ్రద్దలై
వీర విస్ఫూర్తితో

నవ్యభారత భాగ్య
దివ్య ఘంటాధ్వనులు
దిగ్ దిగంతాల ప్ర
తి ధ్వనించుచునుండె

వెలిగింపరా !! జ్యోతి
వెలిగింపరా !!

అభ్రంకష మహా హి
మాల యోత్తుంగ శృం
గాగ్ర గంగా తరం
గ ప్రవాహమ్ములో
కాల మేఘాభీల
ఘట పటాపంచలై
స్వాతంత్ర్య చంద్రికలు
జాలు వారేటట్లు

వెలిగింపరా !! జ్యోతి
వెలిగింపరా !!

అరిభయంకర జయం
కర పవిత్రక్షాత్ర
వీరవిస్ఫార భా
రత కురుక్షేత్రాన
కలుష కౌరవచమూ
కర్ణ భేదమ్ముగా
విజయ గాండీవరా
వము విజృంభించినది

వెలిగింపరా !! జ్యోతి
వెలిగింపరా !!

విజయభారత జాతి
విశ్వ మంగళగీతి
వినిపించు చుండెరా !
విద్యార్థి సోదరా !!
వెలిగింపరా !! వెలిగింపరా !!

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R. NARLA
D.P.R.I.
Acc. No.

పండుగరోజు

కుచ్చితంపూ దొరల కుటిల కృత్యాలలో
బిచ్చగత్తెగనైన పిచ్చి "భారతమాత"
పచ్చన్ని చేలతో పసిడి కుచ్చెళ్లతో
పచ్చపచ్చగ "పచ్చిబాలెంత" యగురోజు
వచ్చిందిరా!! బాబు వచ్చిందిరా!!

ఇల్లుదోపిడిగాళ్లు కల్లుదోపిడిగాళ్లు
మిల్లు దోపిడిగాళ్లు వొళ్లుదోపిడిగాళ్లు
తెల్లమోములువేసి దేబెచూపులతోడ
తోకల్లు జాడించి తొలగిపోయేరోజు
వచ్చిందిరా!! బాబు వచ్చిందిరా!¡

అన్నదమ్ముల మంచు అన్నిజాతులవారు
పిన్నతమ్ముళ్లతో చిన్నచెల్లెళ్లతో
కన్న చల్లనితల్లి పున్నెంపు పాదాలు
పొన్నపూలూ తెచ్చి పూజచేసేరోజు
వచ్చిందిరా!! బాబు వచ్చిందిరా!!

తప్పులేని తమ్ముడు

[ఆయమ్మకు ఐదుగురు సంతానం. పెద్దవాళ్లు నలుగురూ చిచింద్రీలు. ఆయిదోవాడు అమాయకుడు. అన్నలంతా ఒకపై తమ్ముణ్ణి విడ్రొక్కారు దూరంగా వుండమన్నారు. ముట్టుకుంటే తంతామన్నారు. పాపమా పసిబిడ్డ తల్లిని కాగిలించుకొని బావురుమన్నాడు. చిక్కి శల్యమైవున్న చిన్న కొడుకును చూడంగానే కడుపు తరుక్కుపోయింది. వొళ్లోకి తీసికొని బుజ్జగించింది. కొడుకుల్ని కూకలేద్దామనుకుంది. అంతలోకే వచ్చారు అసహాయ శూరులు పెద్దబ్బాయిలు. విషాద వీణ మోగింది కన్నతల్లి కంఠంలో]

అందకుండా మీరు
ముందు పరుగేస్తుంటె
విడలేక తమ్ముడూ
వెనకాలె వస్తుంటె
ధుమ ధుమలాడారుటే!! బిడ్డపయి
దుమ్మెత్తి పోశారుటే!!

వడగాడ్పులో శోష
వచ్చి నాలుక యెండి
చెర్లోని దేవుడిచ్చిన
నీళ్లు త్రాగబోన్
కళ్లెర్ర చేశారుటే! తండ్రిపై
రాళ్లన్ని రువ్వారుటే!!

ధ్వజస్తంభముకాడ
దణ్ణాలు పెడుతుంటె
మడిగట్టి కూర్చున్న
గుడిలోని జేజాయి
మైలబడు నన్నారుటే!! నాయన్ని
మాలవాడన్నారుటే!!

అన్నలంతాగూడి
నన్ను కేటాజేసి
శివుడు గుళ్లోకెళ్ళి
చిందులేశారంటు
వెక్కి వెక్కేడ్చాడురా!! నాతండ్రి
చిక్కి సగమైనాడురా!!

జట్టులో రానీక
నెట్టివేశారంటు
మరగిపోయెను మనసు
తిరిగి పోయెను బుద్ధి
కరగి పోతున్నాడురా !! నాతండ్రి
తరిగి పోతున్నాడురా !!

కడగొట్టు తమ్ముడని
గారాబు తమ్ముడని
కనికారమేలేని
కటికి రక్కసులార
ఏతప్పు చేశాడురా !! మీసొమ్ము
ఏమి కాజేశాడురా !!

బీదా సాదా

ఉందామంటే కొంపాలేకా
తిందామంటే తిండీలేకా
కొందామంటే పైసాలేకా
కూరుచున్నామోయ్ తండ్రీ!
కుములు చున్నామోయ్!

రెక్కలన్నీ విరుచుకొని
రక్తమంతా ధారపోస్తే
రాకాసి లోకమ్మా మమ్మా
కూకలేస్తుందోయ్ తండ్రీ!
కేకలేస్తుందోయ్!

ఎండిపోయెను కండలన్నీ
యింకి పోయెను నెత్తురంతా
క్షామదేవత మా గుడిసెల్లో
కాలుపెట్టిందోయ్ తండ్రీ!
గజె గటిందోయ్!

జ టు

స్వేచ్ఛదీపాలు

దీపావళి దీపావళి
దివ్యోజ్జ్వల దీపావళి

అస్వతంత్ర భారతీయ
దాస్య తమస్సమూహములు
శాశ్వతముగ పోకార్చే
విశ్వశాంతి చేకూర్చే
దీపావళి దీపావళి
దివ్యోజ్జ్వల దీపావళి

స్వార్థపరుల గుండలపై
పెట్టదిమ్మ ఫెళఫెళలూ
దేశద్రోహుల మొగములు
తెలమతాబా కళలూ

కోటీనుగి కొడుకు చేతి
తోటాలో నిప్పురవ్వ
కూటికేడ్చు బీదవారి
గుడిసెలు కాల్చేసింది

సీమబొగ్గు చిటచిటలూ
టపాక్కాయ పటపటలూ
చిచింద్రీలు చిచ్చుబుడ్లు
దివ్విటీలు పువ్వత్తులు
రువ్వలు తారాచువ్వలు

దహనం లంకాదహనం
పరప్రజల బాధించే
నరకాసుర సామ్రాజ్యం
హరోం హరోం హరోంహరోం

శీతాచల శిఖరాగ్రం
స్వాతంత్ర్య జ్యోతులతో
నిగనిగలాడిం దదుగో
ధగధగ మెరిసిందదుగో

వెలిగింపవె వెలిగింపవె
వీరబాల! దీపమాల
యుగయుగాల చైతన్యం
జగజగాల వెలిగింపవె
నవయువకుల హృదయంలో
వేడివేడి చమురు పోసి
వెలిగింపవె వెలిగింపవె
వీరబాల! దీపమాల!

అస్మదీయ పూర్వపురుష
ప్రస్ఫుర దాత్మజ్యోతులె
దీపికలై నవ్యయుగో
దీపికలై దిగివచ్చెను

అదుగదుగో అరుణకాంతి
అదుగదుగో స్వర్ణకాంతి
దేశమాత గుమ్మంలో
దివ్యోజ్జ్వల దీపకాంతి

తియ్య తియ్య నవ్వులతో
తేట తెలుగు పువ్వులతో
లేత లేత చేతులతో
స్వాతంత్ర్యపు గీతులతో
గుమ్మటాలు తిప్పుకుంటు
గుమ్మంలో కుర్చున్నావ్
ఎవరమ్మా? అమ్మాయీ!
అమ్మాయీ! ఎవరమ్మా?

ఓ ప్రభూ

ఉదయాద్రి కాలూను
కొదమ భానుని చూచి
చరమాద్రి కాళ్లారు
చందమామను చూచి
ఉప్పొంగి బిట్టూర్తువా?
ఉస్సురని నిట్టూర్తువా?

పట్నమేలే రాజు
పసిడి పళ్లెములోన
కట్టెలమ్మే వాని
మట్టికంచములోన
పన్నీరు చిలికింతువా?
కన్నీరు నొలికింతువా?

పసమించు పురిటింటి
పసిపాప దెసగాంచి
ససిచెడ్డ పెరటింటి
ముసలమ్మ దశ గాంచి
పొంగి పోవుచు నుందువా?
క్రుంగి పోవుచు నుందువా?

చిన్నారి పొన్నారి
చగురు టాకుల వైపు
పండిరాలుచు నున్న
పండు టాకుల వైపు
సంతోషముగ చూతువా?
సంతాప మెగబోతువా?

పార్కులో విహరించు
బాబుగారిని చూచి
జైలులో కృశియించు
దేశభక్తుని చూచి
కులికి పోవుచునుందువా?
కుమిలిపోవుచు నుందువా?

ఫెళఫెళా ప్రమోగేటి
పెండ్లి బాజాలలో
దేవుడో యని యేడ్చు
చావు కంతాలలో
తలబ్రాలు పోయింతువా?
తలకొరివి పెట్టింతువా?

బానిసలుగా ప్రజలు
పాలించు భూభుజుల
పరతంత్రులై భంగ
పడిన దేశప్రజల
అందలము లెక్కింతువా?
క్రిందనే త్రొక్కింతువా?

V.R. NARLA MEMORIAL LIBRARY * V.R.N.
V.R. NARLA
D.P.R.I.
Acc. No.

బుల్లిమరదలు

నిద్రమంచంనుంచి లేవోయీ!
ప్రొద్దు పొడిచిందదుగొ బావోయీ!
జాతీయ సౌరభ్య సరస ప్రచారముం
స్వాతంత్ర్యవాయువులు సాగినవి మెల్లగా

ప్రవిమిలోదయ భాగ్య
నవనవారుణరేఖ
ప్రాచీ దిశాంగనా
ఫాలమున మెరిసింది

నిద్రమంచంనుంచి లేవోయీ!
ప్రొద్దు పొడిచిం దదుగొ బావోయీ!

కటికి చీకటి తెరలు గడచిద్విజబృందములు
కలకల ధ్వనులతో గగనాని కెగసినై

నిరుపేద కర్షకుడు
అరక కోటేరేసి
బువ్వమూ టెత్తుకొని
పొలము పోతున్నాడు

నిద్రమంచంనుంచి లేవోయీ!
ప్రొద్దుపొడిచిం దదుగొ బావోయీ!

చంటిపిల్లావాణ్ణి చంకన్న వేసుకొని
బీదబాలిం తొకతె బిచ్చాని కొచ్చింది
మొలగుడ్డ ససిలేని
ముసలి తాత య్యొకడు
వాకిట్లొ కూర్చొని
కేకలేస్తున్నాడు

నిద్రమంచంనుంచి లేవోయీ!
ప్రొద్దుపొడిచిం దదుగొ బావోయీ!

దివ్య దీపావళి

వెలగవే వెలగవే
విశ్వాంగణమ్ములో
దివ్య దీపావళీ!
నవ్యశోభావళీ!!

వెలగవే వెలగవే
వీర భారత భూమి
దిగ్ దిగంతము లెల
దేదీప్యమానముగ
విజయ విప్లవ కర్మవీర వక్షోరక్త
సంసిక్తముక్తావళీ
కాలభైరవ మహాభీల ఫాలేక్షణ
ప్రజ్వలత్ జ్వాలావళీ

దివ్య దీపావళీ
నవ్య శోభావళీ

బాకా

మేమంతా తెలుగు పటాలం
ఏమైనా సహింపజాలం
స్వార్థానికి స్వాగతమిచ్చి
సాంబారుకు సలాముచేస్తాం

ఆంధ్రంలో ఆలోచిస్తాం
అరవంలో ఫెయిర్లు వ్రాస్తాం
హిందీలో ప్రూఫులు దిద్దీ
ఇంగ్లీషులో అచ్చేయిస్తాం

మంత్రులమై బైఠాయిస్తాం
మదరాసుకు నీళ్ళువదుల్తాం
మనరాష్ట్రం సమస్య వస్తే
మనకెందుకులే పొమ్మంటాం

బస్సుల్లో పచార్లుచేస్తాం
యస్సంటే యస్సేనంటాం
విస్సన్నలు విమర్శచేస్తే
ముస్సోలిని ముఖాలు పెడతాం

స్వర్గానికి నిచ్చెన వేస్తాం
స్వాతంత్ర్యం మోసుకువస్తాం
అయ్యల హస్తాల్లో పెట్టి
అఘోరిస్తు యింటికి వస్తాం

తెలుగంటే మూతివిరుస్తాం
వెలుగంటే కన్నులు మూస్తాం
కలుగుల్లో ఎలుకల్లాగా
స్వార్థానికి గోతులు తీస్తాం

కాలానికి తాళంవేస్తాం
మేళానికి హంగులుచేస్తాం
ఎవరన్నా యిదేమిటంటే
మీకెందుకు పోపొమ్మంటాం

గ్రూపుల్లో షాపులు పెడతాం
షాపుల్లో కాపులు వేస్తాం
కాపుల్లో చూపులు చూసి
పాపాలకు పర్మిటిస్తాం

అయోమయం మా శుద్ధాంతం
అంధత్వం మా సిద్ధాంతం
మేమంతా తెలుగుపటాలం
ఏమైనా సహింపజాలం

ఉదయగీతి

ఎవరు నను మేల్కొల్పి
రీ నవోషస్సులో
ఈ నవోషస్సులో – నీరవ సరస్సులో –

ఎచటి వీ రమణీయ
రాగారుణాంగుళులు
ఎచటి వీ కమనీయ
కంకణక్వణనములు
ఈ నవోషస్సులో – జీవిత తమస్సులో –

ఎంత చల్లని పాణి
ఎంత చక్కని వాణి
పులకించి బ్రతుకంత
పొంగులెత్తేని
ఈ నవోషస్సులో – మంజుల మహస్సులో –
ఎవరు నను.....

చల్ చల్‌రే నౌజవాఁ!

ఊదరా! ఊదరా! ఊదరా! సోదరా!
ఉడుకు రక్తపు పొంగు లుప్పొంగ జయశంఖ
మూదరా!! ఊదరా!!

ఉరకరా! ఉరకరా! ఉరకరా! సోదరా!
విధురప్రజారుధిర మధురసోన్మదులపై
ఉరకరా!! ఉరకరా!!

నిలుపరా! నిలుపరా! నిలుపరా! సోదరా!
జ్యోతిః ప్రపూత జాతీయ విజయధ్వజము
నిలుపరా!! నిలుపరా!!

వ్యత్యాసాలు

మా కండలు పిండిన "నెత్తురు"
మీ పెండ్లికి చిలికిన "అత్తరు"
మా మొగాల కీ "కన్నీరూ"
మీ మొగాల కా "పన్నీరూ"

మా నోట్లో అకటి "భగభగ"
మీ నోట్లో సిజర్సు "భుగభుగ"
మా కీ పడిపోయిన గోడలు
మీ కేడంతస్తుల మేడలు

చింపిగుడ్డ సింగారం మాకూ
వొళ్ళంతా బంగారం మీకూ
మేము మండుటెండల్లో మాడుతు
మీరు పండువెన్నెల్లో ఆడుతు

మీ కార్లకు పనికిరాని పైర్లు
మా కాళ్ళను కాపాడే జోళ్లు
మా బ్రతుకిది మళ్ళీమళ్ళీ
మీ బుగ్గన తిరిగే కిళ్ళీ

బాబుగారి పాకీదొడ్లో
పట్టపగలు ఎలక్ట్రిసిటీ
పాకీవాడి పూరిపాకాలో
కార్మబ్బులు కటికచీకటి

మా తోపల అగ్నిజ్వాలలు
మీ లోపల అజీరశూలలు
మీ మోటార్ లేపిన ధూళి
మా నుదుటికి గులాబి పౌడర్

పస్తున్నా మే మిక్కడ
మేస్తున్నారా మీ రక్కడ
ఎందాకా తమకీ డాబులు
క్రిందికి దిగుతారా బాబులు!!

తరంగాలు

తరంగాలు తరంగాలు
స్వర్గంగా తరంగాలు
ప్రపంచాలు ముంచెత్తే
ప్రజాశక్తి తరంగాలు
పొంగి పొంగి వస్తున్నై
పొరలి పొరలి వస్తున్నై.

విలయ సంధ్యాతాండవ వేదికపై
ప్రళయకాల మహానటుడు
ఘల్ ఘల్ ఘల్ ఘల్లని చరణం
కదలించా డల్లదుగో!
విశాల విప్లవ జటాజూటం
విదలించా డల్లదుగో!

జ్యోతిర్మయ స్వాతంత్రోజ్జ్వల
శీతాచల శిఖరాంచలముల
జాతీయస్రోతో వాహిని
ప్రోతలతో దిగివస్తున్నది
అఖండ భరతఖండమంతా
అప్లావిత మొనరిస్తున్నది

అదుగదుగో మహాప్రవాహం
అల్లదుగో మహాప్రవాహం
అదురులేని బెదురులేని
యెదురులేని ప్రజాప్రవాహం
పొంగి పొంగి వస్తున్నది
పొరలి పొరలి వస్తున్నది
రండి రండి తల్లుల్లారా!
రండి రండి బాబుల్లారా!!

మనమంతా జలకణాలమై
ప్రవహిద్దా మీ ప్రవాహంలో
కర్మవీర రక్తకణాలై
కార్మికజన ఘర్మకణాలై
కర్షకగణ బాష్పకణాలై
ప్రవాహంలో ప్రవేశించి
ప్రవహిద్దాం మనమంతా

జన్మభూమి అడుగులపై
ప్రవహిద్దాం మనమంతా
సువర్ణమాలా సమలంకృత
త్రివర్ణ మహాధ్వజాగ్రంలో
నవజ్యోతి సందర్శించే
నవస్ఫూర్తి సంపాదించే
యువభారత తరంగాలు
నవజీవన తరంగాలు

భుగభుగరాజే గుండెల్లో
భగభగమండే మంటల్తో
యుగయుగాల చైతన్యం
జగజగాల వెలిగించే
తరుణ తరుణ తరంగాలు
అరుణారుణ తరంగాలు

ప్రపంచాలు ముంచెత్తే
ప్రజాశక్తి తరంగాలు

పొంగి పొంగి పస్తున్నై
పొరలి పొరలి వస్తున్నై

వొత్తండయ్యా! జయశంఖం;
ఎత్తండమ్మా! జయహారతి—

కావాలి

బీదసాదల నిరుపేద జీవనము
కార్మిక సంఘాల కష్టజీవనము
కర్షక సంతతి కరుణజీవనము
బానిసజాతి నిర్భాగ్యజీవనము
తమచేతి కలములో తనరారునట్లు
తమచేతి కుంచెలో తళుకొత్తునట్లు
ఉడుకునెత్తురు మేన నుప్పొంగునట్లు
కటికగుండెలనైన కరగించునట్లు
రచియించు కవికుమారకులు కావాలి
రంజించు చిత్రకారకులు కావాలి
భావిభారతదేశ భాగ్యమ్ముకొరకు
కావాలి కావాలి కావాలి నేడు

వందేమాతరం

[ఇన్ఫాల్ రణరంగంలో మాతృదేశ స్వాతంత్ర్యంకోసం ఆత్మార్పణంచేసి క్షతగాత్రుడై కొనప్రాణాలతో కొట్టుకొంటూన్న ఆజాద్ హింద్ ఫౌజు సైనికుడి అంతిమ హృదయ స్పందనం.]

అజాద్‌హింద్ విజేతలం
ప్రజారాజ్య విధాతలం

నేతాజీ మాదెవం
స్వాతంత్ర్యం మాజీవం

అమ్మా! భారతమాతా
అహింఫౌజు సైనికుణ్ణి
దేశద్రోహినిగా సం
దేహిస్తావా తల్లీ!!
జపాన్‌వాడి బానిసగా
శంకిసావా తలీ!!

ఇంతలోతు కష్టంలో
యీది యీది నీకోసం
నడిచామే మేమంతా
పిడిచామే బ్రతుకంతా
విడిచామే సుఖశాంతులు

చిట్టిగాంగు నట్టడవులు
చుట్టిచుట్టి పట్టుపట్టి
ఎండల్లో కొండల్లో
తిండిలేక నిద్రలేక
తిరిగి తిరిగి సురిగి సురిగి
రాళ్ళల్లో ముళ్ళల్లో
రాత్రి పగలు నీకోసం
రక్తం చిందించామే

నా కండల్లో వీర్యం
నా గుండెల్లో ధైర్యం

నీకోసం వ్యయంచేసి
నీ కొరకే సమర్పించి
అజాద్‌హింద్ యజ్ఞంలో
ఆహుతియైనావమ్మా !

సర్వస్వం నీకోసం
స్వాహా చేశానమ్మా !

ఆంత్యనమస్కారమైన
ఆచరింపలేనమ్మా !

అంతిమ ప్రార్థనకైనా
గొంతు విప్పలేనమ్మా !

పడిపోయిన నాదేహం
తెగిపోయిన నాచేతులు
ప్రబ్దలయిన నావక్షం
ప్రవహించే నా రక్తం

వేలాడే నా ప్రేగులు
కొట్టుకునే నా గుండెలు
చుట్టుకునే రాబందులు
సాక్ష్యం నా త్యాగానికి

చెవులల్లో మ్రోగుతూంది
'జైహింద్' నినాదం
కళ్ళల్లో మెరుస్తూంది
కన్నతల్లి ప్రాసాదం

నా స్వతంత్ర జయభారతి
నవ్యభవ్య దివ్యాకృతి
స్వప్నంవలె స్వర్గంవలె
కనురెప్పల సందుల్లో
కదలని ఒక బాష్పకణం

నేతాజీ నాదైవం
స్వాతంత్ర్యం నాజీవం

అల్లదుగో లాల్ ఖిల్లా
ఢిల్లీలో పిలుస్తూంది
వస్తున్నా వస్తున్నా
పరుగెత్తుకు వస్తున్నా
జైహింద్ ఢిల్లీచలో !

శైలరా, ఖణ్డన వంగె-చెంగున అనంగుని చాపమువంగె-వంగె
లేంపుధపుండు కాన్కలు గ్రహింపగ ఉన్నమితోర్వ్వకాయుడై [4 పుట

ఏది మరొక్కమాటు హృదయేశ్వర! గుండెలు పుల్కరింపగా
ఊదగదేయి! ఊదగదవోయి!.....[౨౬ పుట]

AUUA103B126

ఉ ద య శ్రీ

ప్రథమ భాగము

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10821

సర్వస్వామ్యములు రచయితవి
పదమూడవ ముద్రణము ౧౦౦౦ ప్రతులు

ప్రతులకు

రామా పబ్లిషర్స్
ప్రొ. రామా బైండింగ్ వర్క్స్
కందులవారి వీధి, విజయవాడ

జనరల్ ప్రింటర్స్
అరండల్ పేట, గుంటూరు.

౧౯౫3

ఇచట శాంతమ్మ నిండార ఈమె చేతి
పైడి క్రొందమ్మ లందుకొన్నాడు హరుడు;
అచట పంతమ్మ నిండార ఆమె చేతి
వాడి కెందమ్మ లందుకొన్నాడు మరుడు.

తియ్యవిల్కాడు వింట సంధించి విడివె
అక్షయమ్మైన సమ్మోహనాశుగమ్మ;
గౌరి కడకంటి చూపుతో కలసిపోయి
గ్రుచ్చుకొనె నది ముక్కంటి గుండెలోన.

స్వర్ణదీ స్వర్ణ కంజ కింజల్కములకు
పసిమి దిద్దెడి గిరికన్య పాణితలము
పట్టుకొని వీడగాలేడు భవుడు; మేను
పులకరింపగ వలపులు తొలకరింప!

ముద్దు లొలికెడి పగడాల మోవిమీద
తళుకు చిరునవ్వు ముత్యాలు తడ్గుకొంప
"స్వామి! యేమిది?" యనుచు లజ్జా వినమ్ర
ముఖి యయి యొకింత వారించె ముగుద మునిని.

అంత మహేశ్వరుండు హృదయమ్మును మెల్లగ నిగ్రహించి, అ
త్యంత తపోవిభంగమున కాగ్రహముంగొని, విఘ్నకారణ
మ్మింతకు నెద్దియంచు గనియెన్ నలుదిక్కులు, కానుపించె నా
పొంతనె పువ్వుటీరమున పూవిలుకాడు సతీసమేతుడై!

తక్షణము శూలి రూక్ష ఫాలేక్షణమున
ఉదయమందెను ప్రళయ మహోగ్ర శిఖలు;
"పాహిపాహి ప్రభో! ప్రభో! పాహి" యనెడి
సురల యార్తధ్వనుల్ మింట సుళ్ళుతిరిగె.

అగ్గిరిశు ఫాలనేత్రంపు టగ్గిలోన
భగ్గుమన్నాడు క్షణములో ప్రసవశరుడు
మంచుగుబ్బలి గుహలలో మారుమ్రోగె
తెటి జవరాలి జాలి కన్నీటిపాట.

* * * * *

ఆ కరుణగానమే—ఆ యనంత విరహ
విశ్వసంగీతమే—పంచమస్వరాన
గానమొనరించినది మన "కాళిదాస
కోకిలమ్మ" "వియోగినీ" కూజితముల.

పుష్పవిలాపము

చేతులారంగ నిన్ను పూజించుకొరకు
కోడి కూయంగనే మేలుకొంటి నేను ;
గంగలో మున్గి ధౌత వల్కలము గట్టి
పూలు గొనితేర నరిగితి పుష్పవనికి.

నే నొక పూలమొక్కకడ నిల్చి, చివాలున కొమ్మవంచి గో
రానెడు నంతలోన విరులన్నియు జాలిగ నోళ్ళువిప్పి "మా
ప్రాణము తీతువా" యనుచు బావురుమన్నవి-క్రుంగిపోతి-నా
మానసమం దెదో తళుకుమన్నది పుష్పవిలాప కావ్యమై!

"తల్లియొడిలోన తలిరాకు తల్పమందు
ఆడుకొను మమ్మలను బుట్టలందు చిదిమి
అమ్ముకొందువె! మోక్షవిత్తమ్ము కొరకు?
హృదయమే లేని నీ పూజలెందుకోయి?

జడమతుల మేము ; జ్ఞానవంతుడవు నీవు ;
బుద్ధి యున్నది ; భావ సమృద్ధి గలదు ;
బండబారెనటోయి నీ గుండెకాయ ?
శివునికై పూయదే నాల్గు చిన్నపూలు ?

ఆయువు గల్గు నాల్గు గడియల్ కనిపెంచిన తీవతల్లి జా
తీయత దిద్ది తీర్తుము—తదీయ కర్మములలోన స్వేచ్ఛమై
నూయల లూగుచున్ మురియుచుందుము-ఆయువు దీరినంతనే
హాయిగ కన్నుమూసెదము—ఆయమ చల్లని కాలి వ్రేళ్లపై.

గాలిని గౌరవింతుము సుగంధము పూసి, సమాశ్రయించు భృం
గాలకు విందు సేసెదము కమ్మనితేనెలు, మిమ్ముబోంట్లు నే
త్రాలకు హాయి గూర్తుము, స్వతంత్రుల మమ్ముల స్వార్థబుద్ధితో
తాళుము-త్రుంపబోవకుము ! తల్లికి బిడ్డకు వేరుసేతువే ?

ఆత్మ సుఖమ్ముకోసమయి అన్యుల గొంతులు కోసితెచ్చు పు
ణ్యాత్ముడ ! నీకు మోక్షమెటు లబ్బును? నెత్తురుచేతిపూజ వి
శ్వాత్ముడు స్వీకరించునె ? చరాచరవర్తి, ప్రభుండు మా పవి
త్రాత్మల నందుకోడె ? నడుమంతరపుం దగులాట మేటికిన్ ?

ఊలుదారాలతో గొంతు కురి బిగించి
గుండెలోనుండి సూదులు గ్రుచ్చి కూర్చి
ముడుచుకొందురు ముచ్చటముడుల మమ్మ
అకట ! దయలేనివారు మీ యాడవారు.

గుండెతడి లేక నూనెలో వండి పిండి
అత్తరులు చేసి మాపేద నెత్తురులను
కంపు దేహాలపై గుమాయింపుకొరకు
పులుముకొందురు హంత ! మీ కొలమువారు.

అక్కట హయిమేయు మహిషాసురు లెందరొ నాల్గు ప్రక్కలన్
ప్రక్కలమీద చల్లుకొని, మా పసిమేనులు పాడుకాళ్ళతో
ద్రొక్కుచు దొర్లి - దొర్లి - మరురో జుదయాననె వాడి వత్తలై
రెక్కలు జారిపోన్ పరిహరింతురు మమ్ముల పెంటదిబ్బపై !

మా వెలలేని ముగ్ధ సుకుమార సుగంధ మరంద మాధురీ
జీవిత మెల్ల మీకయి త్యజించి కృశించి నశించిపోమె; మా
యౌవన మెల్ల కొల్లగొని ఆపయి చీపురుతోడ చిమ్మి మ
మ్మావల పారవోతురుగదా ! నరజాతికి నీతి యున్నదా ?

బుద్ధదేవుని భూమిలో పుట్టినావు
సహజమగు ప్రేమ నీ లోన చచ్చెనేమి ?
అందమును హత్యచేసెడి హంతకుండ !
మైల పడిపోయెనోయి ! నీ మనుజజన్మ.

పూజలేకున్న బాబు నీ పున్నెమాయె !
కోయబోకుము మాపేద కుత్తుకలను;
అకట ! చేసేత మమ్ముల హత్యచేసి
బావుకొనబోవు ఆ మహాభాగ్య మేమి ?"

ఇట్లు ఫుష్పాలు నన్ను చీవాట్లుపెట్టి
నట్లుగాన్—పూలుకోయ చేయూడలేదు;
ఏమితోచక దేవర కెరుకసేయ
వట్టిచేతులతో ఇటు వచ్చినాను.

కుంతీకుమారి

అది రమణీయ పుష్పవన - మావనమం దొకమేడ - మేడపై
నదియొక మారుమూలగది - ఆ గదితల్పులు తీసి మెల్లగా
పదునయిదేండ్ల యీడుగల బాలిక - పోలిక రాచపిల్ల - జం
కొదవెడి కాళ్ళతోడ దిగుచున్నది క్రిందికి మెట్లమీదుగన్!

కన్నియలాగె వాలకము కన్పడుచున్నది - కాదు కాదు - ఆ
చిన్నిగులాబి లేత అరచేతులలో-పసిబిడ్డ డున్నయ
ట్లున్నది— ఏమికావలయునోగద ఆమెకు—అచ్చుగ్రుద్ది న
ట్లున్నవి రూపురేక—లెవరో యనరా దత డామెబిడ్డయే!

దొరలు నానంద బాష్పాలో —పొరలు దుఃఖ
బాష్పములొగాని యవి గుర్తుపట్టలేము;
రాలుచున్నవి ఆమె నేత్రాలనుండి
బాలకుని ముద్దు చెక్కుటద్దాలమీద!

పొత్తులలోని బిడ్డనికి పుట్టియుపుట్టకముండె యెవ్వరో
క్రొత్తవి వజ్రపుం గవచకుండలముల్ గయిచేసినారు! మేల్
పుత్తడి తమ్మిమొగ్గ జిగిబుగ్గల ముద్దులు మూటగట్టు నీ
నెత్తురుకందు నెత్తుకొని నెచ్చలి యెచ్చటికేగుచున్నదో!

గాలితాకున జలతారు మేలిముసుగు
జారె నొక్కింత—అదిగొ చిన్నారిమోము!
పోల్చుకొన్నాములే! కుంతిభోజపుత్రి
స్నిగ్ధ సుకుమారి ఆమె కుంతీకుమారి!!

కడువేగమ్మున చెంగుచెంగున తరంగాల్ పొంగ ఆ తోట వెం
బడి గంగానది పారుచున్నయది బ్రహ్మాండమ్ముగా—అల్లదే
బుడుతన్ చేతులలోన బట్టుకొని యా పూబోడియుంగూడ ని
య్యెడకే వచ్చుచునుండె గద్గదికతో నేమేమొ వాపోవుచున్.

"మునిమంత్రమ్ము నొసంగనేల? ఇడెబో మున్ముందుమార్తాండు ర
మ్మని నే కోరగనేల? కోరితినిబో అతండు రానేల? వ
చ్చెనుబో కన్నియనంచు నెంచక ననున్ జేపట్టగానేల? ప
ట్టెనుబో పట్టినొసంగనేల? అడుగంటెన్ కుంతి సౌభాగ్యముల్.

ఏ యెడ దాచుకొందు నిపు డీ కసిగందును ? కన్న తండ్రి "చీ
చీ" యనకుండునే ? పరిహసింపరె బంధువు ? లాత్మగౌరవ
శ్రీ యిక దక్కునే ? జనులు చేతులుచూపరె ? దైవయోగమున్
ద్రోయగరాదు—ఈ శిశువుతో నెడిగట్టితి లోకనిందకున్.

"ఈ విషాదాశ్రువులతోడ నింక నెంత
కాల మీమేను మోతు ? గంగాభవాని
కలుషహారిణి—ఈ తల్లి కడుపులోన
కలిసిపోయెద నా కన్నకడుపుతోడ"

అనుచు పసివాని రొమ్ములో నదుముకొనుచు
కుంతి దిగినది నదిలోన—అంతలోన
పెట్టె గాబోలు పవన కంపిత తరంగ
మాలికా డోలికల తేలితేలి వచ్చు !

మందసము రాక గనెనేమొ—ముందు కిడిన
యడుగు వెనుకకు బెట్టి దుఃఖాశ్రుపూర్ణ
నయనములలోన ఆశాకణాలు మెరయ
ఆ దెసకె చూచు నామె కన్నార్పకుండ.

దూరదూరాల ప్రాణబంధువు విధాన
అంతకంతకు తనకు దా పగుచునున్న
పెట్టె పొడవును, తన ముద్దు పట్టి పొడవు
చూచి తలయూచు మదినేమి తోచినదియో.

"ఆత్మహత్యయు శిశుహత్య యనక గంగ
పాలు గానున్న యీ దీనురాలిమీద
భువనబంధునకే జాలిపుట్టెనేమొ
పెట్టె నంపించి తెరువు చూపెట్టినాడు"

"ఇట్టులున్నది కాబోలు నీశ్వరేచ్ఛ"
యనుచు విభ్రాంతయై దిక్కు లరసికొనుచు
సగము తడిసిన కొకతో మగువ, పెట్టె
దరికి జని మెల్లమెల్లగా దరికి తెచ్చి—

ఒత్తుగా పూలగుత్తుల నెత్తుపెట్టి
పైచెరగు చింపి మెత్తగా ప్రక్కపరచి—
క్రొత్త నెత్తలిరాకుల గూర్చిపేర్చి—
ఒత్తుకొనకుండ చేతితో నొత్తిచూచి—

ఎట్టకేలకు దడదడ కొట్టుకొనెడి
గుండె బిగబట్టుకొని కళ్ళనిండజూచి—
బాష్పముల సాము దడిసిన ప్రక్కమీద
చిట్టిబాబును బజ్జుండబెట్టె తల్లి.

చిన్ని పెదవుల ముత్యాలు చిందిపడగ
కలకలమటంచు నవ్వునేగాని, కన్న
యమ్మ కష్టము తన యదృష్టమ్ము కూడ
నెరుగ డింతయు నా యమాయికపుబిడ్డ.

చెదరు హృదయము రాయి చేసికొని పెట్టె
నలలలో ప్రోయబోవును—వలపు నిలుప
లేక - చెయిరాక - సుతు కౌగలించి వెక్కి
వెక్కియేడ్చును—కన్నీరు గ్రుక్కుకొనుచు—

"భోగభాగ్యాలతో తులదూగుచున్న
కుంతిభోజుని గారాబు కూతురునయి
కన్న నలుసుకు ఒక పట్టె డన్నమైన
పెట్టుకో నోచనైతి పాపిష్ఠిదాన.

××

నన్నతిపేర్మిమై గనెడి నా తల్లిదండ్రుల ప్రేమ యర్థమౌ
చున్నది - నేడు—బిడ్డ నిట నొంటరిగా విడిపోవ కాళ్లు రా
కున్నవి - యేమి సేతు కనియున్ గనలేని యభాగ్యురాల నే
నన్నివిధాల - కన్నకడుపన్నది కాంతల కింత తీపియే!

పెట్టియలోన నొత్తిగిలబెట్టి నినున్ నడిగంగలోనికిన్
నెట్టుచునుంటి తండ్రి! యిక నీకును నాకు ఋణంబుతీరె; మీ
దెట్టుల నున్నదో మన యదృష్టము! ఘోరము చేసినాను నా
పుట్టుక మాసిపోను! నినుబోలిన రత్నము నాకు దక్కునే!

"పున్నమ చందమామ" సరిపోయెడి నీ వరహాలమోము నే
నెన్నటికైన చూతునె! మరే! దురదృష్టము గప్పికొన్న నా
కన్నుల కంతభాగ్యమును కల్గునె? ఏ యమయైన ఇంత నీ
కన్నము పెట్టి అయువిడి నప్పటి మాటగదోయి నాయనా!

పాలబుగ్గల చిక్కదనాల తండ్రి!
వాలుగన్నుల చక్కదనాల తండ్రి!
మేలి నీలి ముంగురుల వరాల తండ్రి!
కాలు చెయి రాని తండ్రి నా కన్నతండ్రి!

స్వేచ్ఛాపుష్పాలు

శాంతిపూర్ణ సత్యాగ్రహ సమరమందు
జీవితమ్ములన ర్పణసేయునట్టి
ధన్యమూర్తులు నడచెడి దారులందు
కాపురముసేయగా కోర్కె గలదు మాకు

దేశదాస్య విముక్తికై దీక్షనూని
బందిఖానాల బ్రతుకులు బలియొనర్చు
త్యాగమూర్తుల పాదపరాగ మొడల
పులుముకొన నెంతయో కాంక్షగలదు మాకు.

కట్టుకొన్న గుడ్డ, త్రాగంగ గంజి లేక
గుడిసెలందు పేరాకట కుములుచున్న
కష్టజీవుల నిట్టూర్పు కాకలందు
కమలిపోవగ కొరిక గలదు మాకు.

విజయ ఘంటాధ్వనులు వినువీథి నింద
ప్రజలు సాగింప జాతీయ పథము వెంట
కదలు స్వాతంత్ర్యరథము చక్రాలక్రింద
నలిగిపోవ సముత్క్రాంత గలదు మాకు.

దాస్యబంధ విముక్త స్వతంత్ర భరత
మాతృకంఠాన ఒక పుష్పమాల యగుచు
తల్లి యానందబాష్పాల తడిసి తడిసి
పులకరింపగ అభిలాష గలదు మాకు.

ఒక ప్రశాంత ప్రభాతాన ఒక్క మంద
మలయ మారుత వీచిలో పులకరించి
మెల్లగా తల్లి చల్లని కాళ్ళపైన
రాలి కను మూసికొనుటె సార్థకతమాకు—

మాతృశ్రీ

అభ్రంకషంబౌ హిమాలయం బే తల్లి
మౌళి జుట్టిన మల్లెపూలచెండు
గోదావరీ కృష్ణ లే దేవి కటిసీమ
ప్రేలాడు ఆణిముత్యాల సరులు
ఆంధ్ర సముద్ర మే యమ్మ పాదాలపై
జీరాడు పట్టు కుచ్చెల చెరంగు
నలుబదికోట్ల వీరులు భారతీయులే
కల్యాణి చల్లని కడుపుపంట

ఆమె బ్రహ్మర్షిజాత కల్యాణగీత
ధర్మసముపేత - వేదమంత్రపూత
విశ్వ విఖ్యాత సుశ్రీల వెలయుగాత
పరమకరుణాసమేత మా భరతమాత!

నమస్తే

ఎలుక గుట్టముమీద నీరేడు భువనాలు
పరువెత్తి వచ్చిన పందెకాడు
ముల్లోకముల నేలు ముక్కంటి యింటిలో
పెత్తన మ్మొనరించు పెద్దకొడుకు
"నల్లమామా" యంచు నారాయణుని పరి
యాచకాలాడు మేనలుకుఱి
వడకు గుబ్బలి రాచవారిబిడ్డ భవాని
నూరేండ్లు నోచిన నోముపంట

అమరులం దగ్రతాంబూల మందుమేటి
ఆరుమోముల జగజెట్టి అన్నగారు
విఘ్నదేవుడు వాహ్యాళి వెడలివచ్చె
ఆంధ్ర విద్యార్థి ! లెమ్ము జోహారు లిడగ ! !

తిలకమ్ముగా దిద్ది తీర్చిన పూప జా
బిలి రేక లేత వెన్నెలలు గాయ
చిరుబొజ్జ జీరాడు చికిలి కుచ్చెల చెంగు
మురిపెంపు పాదాల ముద్దుగొనగ
జలతారు పూలకుచ్చుల వల్లెవాటుతో
క్రాచు జందెములు దోబూచులాడ
కొలుచు ముప్పదిమూడు కోట్ల దేవతలపై
చల్లని చూపులు వెల్లివిరియ

గౌరికొమరుడు కొలువు సింగారమయ్యె
జాగుచేసినచో లేచి సాగునేమొ
తమ్ముడా ! రమ్ము స్వామి పాదములు బట్టి
చెల్లెలా ! తెమ్ము పువ్వుల పళ్ళారమ్ము.

కొలుచు వారలకు ముంగొంగు బంగారమ్ము
పిలుచు వారల కెల్ల ప్రియసఖుండు
సేవించువారికి చేతి చింతామణి
భావించు వారికి పట్టుకొమ్మ

"దాసోహ" మనువారి దగ్గర చుట్టమ్ము
దొసి లొగ్గినవారి తోడునీడ
ఆశ్రయించిన వారి కానంద మందార
మర్థించు వారల కమృతలహరి
జాలిపేగుల వాడు—లోకాల కాది
దేవుడే మన పార్వతీదేవికొడుకు!!
చిట్టెలుకనెక్కి; నేడు విచ్చేసినాడు
అక్కరో! అర్ఘ్యపాత్ర మి ట్లందుకొనవె.

లడ్డూ జిలేబి హల్వాలె యక్కరలేదు
బియ్యపుండ్రాళ్ళకే చెయ్యి చాచు
వలిపంపు పట్టు దువ్వలువలె పనిలేదు
పసుపు గోచీకె సంబ్రాలుపడును
ముడుపు మూటల పెట్టుబడి పట్టుదల లేదు
పొట్టిగుంజిళ్ళకే పొంగిపోవు
కల్క తురాయిలకై తగాదాలేదు
గరిక పూజకె తలకాయ నొగ్గు

పంచకల్యాణికై యల్ల పాన్పు లేదు
ఎలుకతత్తడికే బుజా లెగురవైచు
పంచభక్ష్య ఫలాహార పంచలేచు
పచ్చి వడపప్పె తిను వట్టి పిచ్చితండ్రి.

కుడుము లర్పించు పిల్లభక్తులకు నెల్ల
యిడుమలం దించి కలుము లందించు చేయి;
పార్వతీబాయి ముద్దులబ్బాయి చేయి
తెనుగు బిడ్డల భాగ్యాలు దిద్దుగాక!

ఉదయశ్రీ

ద్వితీయభాగము

జంధ్యాల పాపయ్య శాస్త్రి
"కరుణశ్రీ"

కరుణశ్రీ కావ్యమాల
గుంటూరు

సర్వస్వామ్యములు
రచయితవి

ఆరవ ముద్రణము
౧౦౦౦ ప్రతులు
౧౯౫౨

ప్రతులకు:
రామా పబ్లిషర్సు
ప్రొ॥ రామా బైండింగ్‌వర్క్సు
కందులవారివీధి, విజయవాడ

జనరల్ ప్రింటర్సు, గుంటూరు

అరుణరేఖలు

'ఉదయశ్రీ - విజయశ్రీ - కరుణశ్రీ - ఈ మూడింట్లో మీ అభిమానకావ్యంఏది?' ఈవిధంగాచాలామందిమిత్రులు నన్ను ప్రశ్నిస్తూవుంటారు. ఈ ప్రశ్నకు సమాధానం చెప్పటం కొంచెం కష్టమే. ఎందువల్లంటే కవికి తనకావ్యాల్లో దేనిమీదా తక్కువ ప్రీతి వుండదు.

ఐనా యిందుకు నా ప్రత్యుత్తర మిది :—

ఉదయశ్రీ నా హృదయం -

విజయశ్రీ నా శిరస్సు -

కరుణశ్రీ నా జీవితం —

ఉదయశ్రీ ప్రథమభాగం రసజ్ఞలోకానికి అందించి ఎన్నో సంవత్సరాలయింది. అయినా ప్రతి సంవత్సరమూ పునర్ముద్రణం తప్పడంలేదు. సహృదయులైన పాఠక లోకానికి నా నమస్సులు.

ఇప్పుడు మీ చేతుల్లో వున్నది 'ఉదయశ్రీ' రెండవ భాగం మళ్ళీ 'ఉదయశ్రీ' ఏమిటని మీకు ఆశ్చర్యంగానే వుంటుంది. నవోదయాన్ని నవచైతన్యాన్ని ప్రసారితం చేసే 'ఉదయశ్రీ'కి క్రొత్త పాత లేమిటి? అది నిత్యనూతనం - నిరంతర రాగరంజితం —

ఈ 'ఉదయశ్రీ' రెండవభాగములోని కిరణాలు పూర్వం కన్నా కవోష్ణాలు - సునిశితాలు - సముజ్వలాలు—

ఇందులోని 'ధర్మపరశు' 'పురుషోత్తముడు' అనే ఖండికల విషయంలో నా భావన వేరు. అనుశ్రుతంగా వచ్చే 'జనశ్రుతి'కి ఒక 'ఉపశ్రుతి'ని మేళవించాను. ఉచితజ్ఞులైన రసజ్ఞులు సవిమర్శకంగా పరామర్శిస్తారని అర్థిస్తున్నాను.

ఈ కావ్యంలో వాడిన 'హిందూ' 'హైందవ' శబ్దాలు సంకుచిత మతవాచకాలు కావు. అవి విశాలహిందూజాతికీ అఖండభారతావనికీ సూచకాలు.

ఈ కావ్యనిర్మాణంలో నన్నయభట్టుకు నారాయణభట్టు లాగా నాకు చేదోడు వాదోడుగానున్న అభ్యుదయ కవి మిత్రులు శ్రీ "ధనకుధరం వెంకటాచార్య"కు నా అభివందనాలు.

ముద్దుగా - ముచ్చటగా — ముద్రించియిచ్చిన ప్రియ మిత్రులు 'జనరల్ ప్రింటర్సు' వారికి నా ధన్యవాదాలు.

ఆదరంతో - అభిమానంతో - అనురాగంతో - నారచనలు అందుకుంటూవున్న ఆంధ్రపాఠకలోకానికి నా కృతజ్ఞతా పూర్వక నమోవాకాలు.

మీ

"కరుణశ్రీ"

అంకితము

శ్రీ చేబ్రోలు వెంకటసుబ్బయ్య
అన్నగారికి

అన్నవు నీవు చిన్నతనమందు ననుం గొనిపోయి ప్రేమతో
నన్నము వెట్టి దేశికుల యంతిక మందు ప్రసన్న శబ్ద సం
పన్ననిగా నొనర్చిన అపార కృపాబ్ధి! మదీయ మానసో
త్పన్నము లీ రసార్ద్రకవితాకమలాంజలులన్ గ్రహింపుమా!

నమోవాకాలు

నా గురుదేవులు

శ్రీ కుప్పా శ్రీ ఆంజనేయశాస్త్రిగారికీ
శ్రీ భమిడిపాటి వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రిగారికీ
శ్రీ ఆచార్య శివశంకరస్వామివారికీ

కిరణాలు

స్వతంత్రభారతి	౯
అరుణహస్తము	౧౧
మహాత్ముడు	౧౨
నేతాజీ	౧౩
ఆగష్టు విప్లవము	౧౭
కాంగ్రెసురథము	౧౯
భగత్‌సింగు	౨౦
అల్లూరి సీతారామరాజు	౨౧
తెలుగువెలుగు	౨౪
పురుషోత్తముడు	౨౫
కళ్యాణగీతి	౩౨
వేమనయోగి	౩౩
పాకీపిల్ల	౩౭
ముందడుగు	౪౧
ధర్మపరశు	౪౨
మా గాంధితాత	౪౯
శాంతిదూత	౫౦

పూజాపుష్పాలు	౫౨
రాష్ట్రసిద్ధి	౫౩
భారతభాగ్యదేవత	౫౬
హత్య	౫౭
విషక్షణము	౫౮
దుర్దినము	౫౯
పిడుగుపాటు	౬౦
తీరనిలోటు	౬౧
మౌనలేఖిని	౬౨
ధన్యజీవి	౬౩
బాలబాపూజీ	౬౪
మహాప్రస్థానము	౬౫
దివ్యమూర్తి	౬౮
స్వర్గీయ బాపు	౬౯
బాష్పాంజలి	౭౦
పురోగమనము	౭౧
స్వచ్ఛందజాతి	౭౨

స్వతంత్రభారతి

'గణగణ' మ్రోగెరా విజయ ఘంటలు భారతమాత మందిరాం
గణమున— ద్వారబంధముల గట్టిరి చిత్ర విచిత్ర రత్న తో
రణ తతి— వీథివీథుల విరాజిల్లుచున్న వవే త్రివర్ణ కే
తనములు-మేలుకాంచె పరతంత్ర పరాఙ్ముఖ సుప్తకంతముల్.

కంటికి కజ్జలమ్మ నిడి, ఖద్దరు చీర ధరించి, నేడు పే
రంటము పిల్చుచున్నది స్వరాజ్యవధూమణి ప్రక్కయింటి వా
ల్గంటుల—కర్ణపేయములుగా ప్రవహించె 'స్వతంత్ర భారతీ'
మంటపమందు శాంత సుకుమార మనోహర గాన వాహినుల్ !!

'పాటాగొట్టి' పరప్రభుత్వమునకుఁ, బ్రహ్మాండమౌ శాంతి పో
రాటంబుఁ నడిపించినాడు మన 'వార్ధా యోగి'—ఆంగ్లప్రభుల్
మూటల్ ముల్లెలు నెత్తి కెత్తుకొని నిర్మోహాత్ములై సంద్రముల్
దాటంజొచ్చిరి—నవ్వుకొన్నవి స్వతంత్ర స్వర్ణ సోపానముల్ !!

'నేతాజీ' ప్రతిభా ప్రతాపములు, 'గాంధీతాత' సత్యాగ్రహ
జ్యోతిర్దీప్తులు 'దేశభక్తుల' అఖండోత్సాహముల్. విశ్వ వి
ఖ్యాతంబైన 'అగష్టువిప్లవ' మహా గాధల్, సమైక్యమ్ములై
స్వాతంత్ర్య ధ్వజ మెత్తె భారత మహా సౌధాగ్ర భాగమ్ములఁ !!!

లాఠీ పోటులు పూలచెండ్లు, చెరసాలల్ పెండ్లివా రిండ్లు, ఏ
కాఠిన్యం బయినఁ సుఖానుభవమే; "గాంధీ కళాశాల"లో
పాఠంబుల్ పఠియించు శిష్యులకు—తద్ బ్రహ్మాస్త్రసంధానమే
పీఠంబుల్ గదలించి సీమలకు బంపెఁ శ్వేత సమ్రాట్టులఁ !!!

ప్రస్థానించిరి త్యాగమూర్తులు పవిత్రంబైన "శ్రీకృష్ణ జ
న్మస్థానంబున" కెందరో—నిహతులైనా రెందరో శౌర్య ధై
ర్యస్థైర్యంబులు చూపి విప్లవ సమిద్రంగమ్ములఁ—వారి సు
ప్తిస్థి శ్రేణికలే పునాదులట ! మా స్వారాజ్య సౌధాలకుఁ !!

సీదేనోయి ! సమస్త భారతము, తండ్రీ ! ఇంక నీ గడ్డ పై
లేదోయీ ! అధికార మెవ్వరికి, పాలింపంగదోయీ ! ప్రపం
చాదర్శంబుగ సర్వమానవ సమాహ్లాదంబు సంధిల్ల నీ
వైదుష్య ప్రతిభా విశేషములు విశ్వ మ్మెల్ల కీర్తింపగఁ !!!

అరుణహస్తము

ఆద్దమరేయి నా సదనమందు పదం బిడి—పట్టు పాన్పుపై
నిద్దురపోవు నన్ను నవనీత కరమ్మున తట్టిలేపి—నీ
ముద్దుల కళ్ళతో భువన మోహన రేఖలు నా ముఖమ్ముపై
దిద్దుచునున్న సౌహృదమయీ! వచియింపుము నీ వెవర్తెవో?

ఎవ్వతె వీవు? మంగళమయీ! మెలమెల్లగ—కున్కిపోవు నా
దివ్వియ పెద్దచేసి నవ దీప్తులు నింపితి వింటినిండ—నీ
నవ్వు తరంగ మాలల వినంబడు 'విశ్వరహస్య' నిస్వనా
లెవ్వియొ—భాగ్యముల్ పరువులెత్తెడు నీ కడకంటిచూపులకా!!

చెక్కుల పాటల ప్రభలు చిమ్మ, దయా పరిపూర్ణ దృక్కులన్
చిక్కని ప్రేమరాగములు చింద, నవారుణ హస్త మెత్తి ఆ
దిక్కుకు చూపినావు! గురుతించితి నీ యనుశాసనంబు నో
చక్కని తల్లి! నా 'కరుణ సాహితి' కింక నవోదయంబటే!!

మహాత్ముడు

నలువదికోట్ల తమ్ముల జీవితమ్ముల
కాయన మాట 'వేదాక్షరంబు'
భీరులనే కర్మవీరుల గావించు
ఆయన పిలుపు 'శంఖారవంబు'
సత్యంబు శాంత్యహింసలకు స్వాగత మిచ్చె
ఆయన బ్రతుకు 'మహాప్రయోగ'
కొల్లాయితో పిచ్చిపుల్లాయి వలె నుండు
ఆయన దీక్ష 'లోకైకరక్ష'
అత డొక 'పవిత్ర ధర్మ దేవాలయంబు'
అత డొక 'విచిత్ర విశ్వ విద్యాలయంబు'
ఆ మహాశక్తి 'అంత ఇం'తంచు తూచ
జాల మత డొక పెద్ద 'హిమాలయంబు'.

నేతాజీ

నడిపించినావు! సైన్యములు వేలకువేలు
స్వాతంత్ర్య భారత సమరమునకు -
రుధిరపించినావు! చంచచ్చంద్రహాసంబు
తెల్లవారల గుండె తల్లడిల్ల -
విడిపించినావు! జీవిత మెల్ల బలిచేసి
భరతపుత్రుల దాస్యబంధనములు -
తుడిపించినావు! నీ యుషుకు నెత్తుతోడ
పారతంత్ర్య కళంక పంకరేఖ -

బాపుజీకి—పటేలుకు—పనికిరాక
కరగి—కడలంటి—ఒక 'తరంగమవు' ఒక 'మ
హా ప్రవాహమ్మ'వై—తల్లి యడుగులంట
పారలి ప్రవహించితివి సెబాసుర! సుబాసు!

అల్లల్లాడిన వాంగ్లశాసకుల రాజ్యస్తంభముల్ నీ 'చలో
ఢిల్లీ' యన్న మహానినాదమునకున్—డీకొట్టె నీ శక్తి 'లాల్
ఖిల్లా' లోని నిరంకుశత్వ పశుశక్తిన్—దేవతా హస్తముల్
చల్లెన్ నీ రణభేరిపై నవయుగ స్వాతంత్ర్య పుష్పాంజలుల్ !!!

'ఆజాద్ హిందు' మహాప్రభుత్వమున కధ్యక్షుండవై ఏ మహా
రాజుల్ గాంచని కీర్తి గాంచి, పరిపూర్ణ స్వేచ్ఛకై జీవితం
బాజన్మాంత మఖండ యజ్ఞమున 'స్వాహా'చేసి మా పూజ్య 'నే
తాజీ' వై దిశలన్ వెలార్చితివి స్వాతంత్ర్యప్రభాతప్రభల్ !!

హిందూ ముస్లిము లేక కంఠమున 'జైహిం' దంచు నీ బాపుటా
క్రిందన్ నిల్చి పురోగమించిరబె కేల్ కేల్ రాయుచున్, నేడిటుల్
హిందూస్థానము చీలిపోదుగద నీవే యున్నచో—నెత్తురుల్
చిందంబోవుగదా జగజ్జనని సుస్నేహార్ద్ర వక్షమ్ముపై !

'దేశ దోహి' యటంచు నిన్నుగని సందేహించెనా నీ మహో
ద్దేశంబున్ గ్రహియింపజాలని పరాధీన ప్రజాబుద్ధి—నీ
'యాశాజ్యోతి' స్వతంత్రభారతము నే డానందబాష్పాలతో
నీ శౌర్యోద్ధతి కంజలించినది తండ్రీ ! తప్పు మన్నింపరా !!

ంతికి క్రాంతి నేరిపి, ప్రజాహృదయాబ్జములఁ సువర్ణ సం
క్రాంతులు జాలువారిచి, జగమ్ములు వేడివెలుం గొసంగు 'భా
స్వంతుడ' వీవు—తావక యశస్సులు భారతమాత మౌళిపై
దొంతరమల్లె లైనవి గదోయి! ప్రఫుల్ల పరీమళమ్ములతో !

నీ వీరత్వము, నీ దృఢవ్రతము, నీ నేతృత్వమున్, నీ ప్రజా
సేవౌత్కృంత్యము, ని పురోగమన వైచిత్ర్యంబు, నీ సాహస
శ్రీవాల్లభ్యము గాంచి పొంగి పులకిం చెఁ విశ్వ విశ్వంభరా
భావోద్యానము—నీ శుభోదయము సౌభాగ్యమ్మురా జాతికిఁ !!

మ్ముల నిద్రలేపి, చిరదాస్య తమస్సులు బాపి, వెల్లుఁ
మ్ము పథమ్ము జూప దయచేసిన దివ్య 'సువర్ణ సుప్రభా
మ్మువు' నీవు—ని జయ పతాకము నిడల నిల్చినాము భా
వమ్ముల జాతి వర్ణ మత వర్గ విభేదము మాని, యెల్లసుఁ !!

'దాసోహ'మ్మని పశ్చిమప్రభుల పాదమ్ముల్ తలం దాల్చినౌ
దాసీన్యంబు సహింపజాలని పవిత్రక్షాత్ర కర్తవ్య ది
క్షా సంరంభము పొంగి వెల్లువలు కాగా—తన్మహా విప్లవో
ల్లాసంబుఁ జనముల్ 'సుభా'షనుచు బిల్వంజొచ్చి రుత్కంఠమై.

'జైహిం'దన్న మహానినాదము ప్రజాస్వాతంత్ర్య మంత్రమ్ముగా
వ్యాహరింతురు భారతీయు లికముం దాచంద్రతారార్కముగ -
మా హృత్పద్మ వనాంతరాంతర గళ న్మారందధారా పరీ
వాహంబుల్ పయనించు తావక మహత్వశ్రీపద స్పర్శకుగ !!

సింగారమ్ములు చిందు మంగళ సుధాశ్రీకమ్ములౌ నీ కనుల్
అంగారమ్ములు చిమ్మె స్వార్థపరతాహంకారశీర్షాలపై ;
బంగాళ మ్మది నీ మహోదయమునగ భావి ప్రపంచమ్ములో
బంగారమ్ములు పూయురా ! విజయ శోభా వైభవోపేతమై !!

'పొంగెడు గుండెలో పారలిపోయెడు క్రాంతి కవోష్ణ రక్తమే
చెంగలువల్ గులాబులుగ చేసెను తల్లికి పాదపూజ మా
బంగరు 'బోసుబా' బనుచు భారతభాగ్యవిధాత గాంధి క
న్నుంగవ నీరుపెట్టెను అనుంగు సహోదరునిగ దలంచుచుగ.

నీ తేజోమహిమంబు మా హృదయమందే కాదు—విశ్వ ప్రజా
చేతోవీథుల కాంతరేఖలు వెలార్చెగ—ఖండ ఖండాంతర
ఖ్యాతంబుల్ భవదీయ పౌరుషయశోగాథల్ లిఖింపంబడుగ
స్వాతంత్ర్యోజ్వల 'వీరభారతకృతిన్' సౌవర్ణవర్ణాలతో.

అగష్టు విప్లవము

అది యొక విశ్వ విప్లవ మహాశివరాత్రి - పరాజిత ప్రజా
హృదయము పొంగులెత్తి ప్రవహించిన వెచ్చని వేళ యద్ది - అ
య్యది పరదాస్య శృంఖములందు కృశించెడి భారతాంబ క
భ్యుదయముహూర్త మట్టిటుల నూగెను నాడు ప్రభుత్వసౌధముల్

ఆయ్యది తమ్మి మొగ్గరమునం దభిమన్యుడు రాజరాజు పై
కయ్య మొనర్ప క్రోధమున ఖడ్గము దూసిన క్రాంతిలగ్నమే !
అయ్యది వీరభారత మహత్తరశక్తి పరప్రభుత్వముఁ
వెయ్యిముఖాలతో కలచివేసిన విశ్వవిహార యాత్రయే !!

పారావారమునే దురాగ్రహముతో బంధింప నుంకించిరా
కారాగారములోన—విప్లవ తరంగాల్ పొంగి మిన్నంటి తద్
ద్వారమ్ముల్ పడగూల్చి బంధములు బ్రద్దల్ సేసి స్వేచ్ఛాఝరీ
పారంపర్యము నింపునం చెరుగరో పాశ్చాత్యభూమింజయుల్ !!

లేచిపోయినవి పోలీసుల టోపీలు
వందలుమేలు రాంబందులట్లు
కాలిపోయినవి సర్కారు కచ్చేరీలు
ఖరదూషణాదుల కాష్ఠమట్లు
తెగిపోయినవి తంతితీగెలు భారతీ
యుల పారతంత్ర్య శృంఖలములట్లు
తరలిపోయినవి క్రిందకు రైలు పట్టాలు
పాశ్చాత్యరాజ్య సౌభాగ్యమట్లు
ఒకటి యనుటేమి నాటి మహోద్యమమున
రేగిపోయిన ప్రజల యుద్రేకమునకు
అలకలోలమై దదరిలిపోయె
తెల్లనౌరల ప్రభుత్వ మందిరము లెల్ల.

భారతవీర విప్లవ విపంచిక భావిచరిత్రకారు డే
తీరున మేళవించునొగదే! యువయోధ్దల వేడి రక్తపుం
జారలు చూచి యశ్రువులు జారవొ కన్నుల, వేడివేడి ని
ట్టూరుపు లెట్టు లాపుకొనునో! ఎటులన్ స్వరమున్ బెకల్చునో!!

కాంగ్రెసురథము

ధన్యజీవనుడు " దాదాభాయినౌరోజి "
ఘనకీర్తి " బాలగంగాధరుండు "
తనయంత కొమరుని గనిన "మోతీలాలు"
ప్రాజ్ఞుండు " మాళవ్యపండితుండు "
సౌజన్యవారాశి " రాజేంద్రబాబు " సు
ధీమాన్యు "డబ్బుల్ కలామజాదు"
ఉత్తేజితమనస్వి " చిత్తరంజనదాసు "
శౌర్యవార్ధి " సుబాసు చంద్రబోసు"
"అనిబిసెంటు" "బాపూజి" "జవ్‌హరు" "పటేలు"
"కృపలనీ" ఎక్కినట్టి కాంగ్రెసు రథమ్ము
నీ వధిష్ఠించితివి నేడు, నేర్పుమెరయ
నడపి పట్టాభి! ప్రజల మన్ననలు గొనుము !!

భగత్ సింగ్

చెంగున దూకెరా కుపిత సింహ కిశోరముభంగి మా 'భగత్
సింగు' బ్రిటిష్ మహాగజము శీర్షముపై—నవ భారతమ్ములో
పొంగులువారె విప్లవసముద్రము కట్టలుదాటి—ఎత్తెరా
మంగళహారతుల్ భరతమాతకు తద్రుధిరాక్షతాంశువుల్ !!

నిన్నురిదీసి మా యెడవ నిప్పు రగిల్చిరి కూటనీతి సం
పన్నులు శ్వేతజాతి పరిపాలకు ; లీ హృదయాగ్నికీల లిం
కెన్నియుగాలకైన శమియించునె ! నీ స్మృతు లంకితమ్ములై
యున్నవి మా దృగంతముల నొక్కొక వెచ్చని బాష్ప బిందువై !!

బాంబులు ప్రేలెరా బ్రిటిషు బాబుల గుండెలలో భవచ్ఛరి
త్రంబు స్మరించు మాత్రనె ; స్వతంత్ర పథాన పురోగమించు నీ
వెంబడి పర్వులెత్తినవి విప్లవశక్తులు ; నీ కవోష్ణ ర
క్తంబుచు మా లలాట ఫలకమ్ములపై తిలకమ్ములయ్యెరా !!

అల్లూరి సీతారామరాజు

పాశవశక్తితో ప్రజలపై బడు నీచ నిరంకుశత్వముల్
నాశమొనర్ప దీక్షగొనినావటె! భారతభూమి విప్లవా
వేశము పొంగులెత్త ప్రభవించిన రోచిరుదాత్తవీచికా
రాశివటే! తెలుంగు కజరామరణంబులు నీ చరిత్రముల్ !!

క్షత్రము రూపుగైకొనిన సాహసికుల్ నిను గాంచి భారత
క్షేత్రమునందు పొంగి పులకించిన దోయి త్రిలింగజాతి; సు
క్షత్రియవీర! నీ విజయశంఖము బ్రద్దలుసేసె శాత్రవ
శ్రోత్రములన్; భవత్పదము సోకుట మన్యము ధన్యమయ్యెరా !!

రాచరికంపు రక్కసి కరమ్ములు సాచి ఆమాయిక ప్రజల్
దోచు పరప్రభుత్వమును దోచిన రాజుల చిన్నవాడ! వీ
రోచితమైన తావక మహోద్యమ మాంధ్ర పురా పరాక్రమ
శ్రీచరణమ్ములందు విరజిమ్మె నవారుణ విప్లవాంజలుల్ !!

గాము దొరలిర్వు రంగరక్షకులు గాగ
విండ్లు గొని భిల్లసైన్యాలు వెంబడింప
ధర్మకౌక్షేయకమ్ము హస్తమున దాల్చి
దుమికితివి తల్లి దాస్య బంధములు ద్రెంప !!

దోపిడీల్ సేయు 'దొంగల దొర' వటంచు
ప్రేలుకొనుగాక తెల్లమొగాలు నిన్ను
దేనిపై దోపిడీ చేసితివి ? దురాగ్ర
హమ్ముపైన—నిరంకుశత్వమ్ముపైన—

జీవితేశ్వరు నిన్ను దర్శింపలేక
ప్రణయవతి ప్రాణమే సమర్పణమొనర్చె ;
ఆమెతోడ సమైక్యమ్మునంది 'రామ
రాజు' వెల్ల 'సీతారామరాజు' వైతి !

పౌరుషము, పట్టుదల, దేశభక్తి, ధైర్య
సాహసమ్ము లనన్యాదృశములుగాగ
తెలుగు గుండెలు వెలిగించితివి, స్వతంత్ర
యజ్ఞమున నిండుబ్రతుకు 'స్వాహా' యొనర్చి !!

దోసిలియొగ్గి ప్రార్థనలతో నిను దొడ్కొనిపోయిరంట పో
లీసులు - దేవదేవునివలెఁ పరిచర్య లొనర్చిరంట, నీ
దాసుల మంచు తావక పదమ్ముల సన్నిధి నాయుధమ్ములఁ
రాసులు పోసిరంట, బళిరా ! భవదీయ మహాప్రభావముల్ !!

కళవళమందె నీ 'మిరపకాయ టపా' కు ప్రభుత్వ మిల్టరీ
దళములు ; నీ విజృంభణకు తల్లడిలెఁ పశుశక్తి; సర్వదా
తళతళలాడు నీ సుచరితమ్ములు భారతభారతీ మహో
జ్జ్వల మకుటాగ్రమందు విలసద్రుచి రంజిత రత్నపుంజమై !!

తెలుగు వెలుగులు

నాగార్జునాద్రి నున్నని పాలరాలపై
శ్రీలు చిందించె మా శిల్పబాల
విద్యానగర మంజులోద్యాన వీథుల
నవ్యతల్ నెరపె మా కావ్యకన్య
త్యాగరాయల ప్రేమరాగ డోలికలలో
కమ్మగా నూగె మా గానలక్ష్మి
ఏకశిలాపురీ ప్రాకార శిఖరాల
విహరించె మా వీర విజయరాజ్ఞి

దిక్కు దిక్కుల కీర్తి చంద్రికలు నింపి
వెలుగులు వెలార్చుకొనియె మా తెలుగుతల్లి
నా పుర వైభవానంద నందనమున
నవ్వుకొన్నవి నవ వసంతమ్ము లెన్నో !!

పురుషోత్తముడు

[భారతదేశ చరిత్ర భారతీయులే వ్రాయక పోవడం మన దురదృష్టం. మొదటనుంచీ మన వారికి పరబ్రహ్మ మీదే గాని భౌతిక ప్రపంచం మీద విశేషాభిమానం లేకపోవడమే దీనికి కారణ మనుకుంటాను.

ప్రపంచ విజేతగా నుప్రతిష్ఠితుడౌదామన్న కాంక్షతో పరోగమించిన గ్రీకు దేశాధిపతి అలెగ్జాండరు భారత భూమిలో పురుషోత్తమునితో ప్రతిఘటించి పరభూతుడై పరాజితుడై తిరోగమించాడు.

ఈ యథార్థాన్ని కప్పిపుచ్చి స్వార్థపరులైన గ్రీకు చరిత్రకారులు తమ గ్రంథాల్లో అలెగ్జాండరును విజేతగానూ పురుషోత్తముని పరాజితుని గానూ చిత్రించారు. ఆంగ్ల చరిత్రకారులు కూడా వీరికి తాళం వేస్తూ ఆ అభిప్రాయాన్నే మనకు అందించారు.

విమర్శనాదృష్టిలేని మన చరిత్రాధ్యాపకులు
అలెగ్జాండరు దండయాత్రదగ్గరనుంచి ఆగష్టు
విప్లవందాకా ఈఅసత్యఅనర్థకబీజాల్నే మన
విద్యార్థుల హృదయక్షేత్రాల్లో నాటారు.]

క్షత్రతేజస్సు భారతక్షేత్ర మెల్ల
కాంతులీనిన స్వర్ణ సంక్రాంతులవ్వి;
భరతపుత్రుల కీర్తి సంపదల పంట
గాదెలకు పోసికొన్న యుగాదులవ్వి !!

హైందవ పతాక లాకాశమందు కెంపు
లారవోసిన యరుణోదయమ్ము లవ్వి;
భారతసవిత్రి సౌభాగ్య భాగ్య రేఖ
నవ్వి నాట్యాలుసేయు దినమ్ము లవ్వి !!

నాడు పాంచాల మేలుచున్నా, డపార
శౌర్యమూర్తి, దిగంత విశ్రాంత కీర్తి;
మత్త మాతంగయూథ సంపత్తి వెలయ
నుత్తమగుణోన్నతుడు పురుషోత్తముండు.

ఆ పురుషోత్తమ ప్రభు మహత్తర చిత్తము ధైర్యలక్ష్మికిఁ
గాపుర మయ్యె, వాని కడకన్నులు ప్రాక్తన భాగ్య రాశికిఁ
దీపిక లయ్యె, దిగ్విజయ దేవికి తత్ ప్రతిభా ప్రతాపముల్
నూపుర యుగ్మ మయ్యె, సుమనోజ్ఞము లాతని భారతీయతల్ !!

"రంగులు చిందు సుందర కరమ్ములతో నవ మోహనాంగులై
యంగడి రాశిపోసుకొని యమ్ముదురంట మణుల్ సతీమణుల్ ;
బంగరు కొండలుఁ, రజిత పర్వతముల్, గలవంట భారత
ప్రాంగణ మం" దటంచు బహు భంగుల చారులు విన్నవించినన్

గండరగండడై భరతఖండము నెల్ల జయించు కాంక్ష, ను
ద్దండ తురంగ సైన్య సముదాత్త జయాభ్యుదయుం, డఖండ దో
ర్దండ పరిస్ఫుర ద్యవనరాజ్య రమా రమణీయు డ 'య్యలె
గ్గాండరు'వచ్చె భూవిభులు కాన్కలతో నెదురేగుదేరగన్.

వచ్చుచునున్న ఆ య్యవన వాహిని కడ్డమువచ్చి స్వాగతం
బిచ్చెను వీర భారత నరేంద్రుడు క్షాత్రకులోచితంబుగఁ ;
రెచ్చి పరాక్రమించి యెదిరించి రణం బొనరించినారు గో
ర్వెచ్చని రక్తధారలు స్రవింపగ గ్రీకులు భారతీయులున్.

అక్షీణ ప్రతిభా బలాఢ్యము, రణవ్యాపార పారీణమౌ
లక్షా యిర్వదివేల సైన్యము జయోల్లాసంబునం దోడురా
దక్షత్వమ్మున బోరు గ్రీకుప్రభువుం దర్శించి జీలంనదీ
వక్షం బెంతయు తల్లడిల్లె భవితవ్యం బెంత సందిగ్ధమో !

తమ తుండమ్ములజుట్టుచుక, ధరణిమీదగొట్టుచుక, శత్రుసై
న్యములక ధ్వంస మొనర్చె భారతమహేంద్రస్వామి మత్తేభయూ
థము, పాంచాల యశోధురంధర సముద్యద్యుద్ధభేరీ నినా
దము లాక్రాంతదిగంతరాళములు బ్రద్దల్ సేసె బ్రహ్మాండమున్.

భరత వీరసైనికుల బాణ పరంపర గ్రీకు రక్తపుం
ధారల స్నానమాడినవి, తల్లడమంది చమూ సమూహ'ముల్
పారె, హఠాత్తుగా యవనభాగ్యవిధాత తురంగ మంతలో
ధారుణి గూలె, ఆర్యవసుధాపతి బల్లెపు బాకు పోటునన్.

ఆశనిరాశయై—వివశుడై వశుడయ్యె—నఖండ సంగరా
వేశము దక్కి గ్రీకు పృథివీపతి, భారత చక్రవర్తికిన్ ;
దేశ జిగీషమై అరుగుదెంచి పరాజితు డైన శౌర్య వా
రాశి సికిందరుం గని దరస్మితుడై పురుషోత్తముం డనెన్—

'శూర శిరోమణీ! రిపునిషూదన! విశ్వ జిగీషమై యసా
ధారణులైన గ్రీకు సరదారులతో చనుదెంచినారు, మా
భారతభూమిలో మెరకపట్టి భవజ్జగదేక జైత్ర యా
త్రా రథ మాగిపోయెను—కదల్చగలే రడుగైన ముందుకున్!

హిందూ గ్రీకులు వియ్యమందుకొని సాహిత్యమ్ము విజ్ఞానమున్
సౌందర్యమ్మును పంచిపెట్టినవి విశ్వమ్మెల్ల; స్వార్థమ్ముతో
హిందూస్థానము గెల్వవచ్చితిరి మీ రీనాడు, మా ముంగిటన్
బందీలైతిరి—మారిపోయినవి మీ మా పూర్వ బాంధవ్యముల్!

లక్ష సువర్ణ ఖండములు లంచ మొసంగి, రహస్యవైఖరిన్
తక్షశిలాధినాథుని మనస్సును మారిచి నేర్పుగా భవ—
త్పక్షము త్రిప్పుకొంటిరె—ప్రపంచవిజేతల రాజనీతికిన్
లక్షణ మిట్టిదా—విజయలాలస యింతటి గ్రుడ్డిదయ్యెనా!

పట్టపగల్ నదిం గడవ ప్రౌఢిమ చాలకగాదె గ్రీకు స
మ్రాట్టులు అర్ధరాత్రి అపమార్గమునం బడిపోయినారుఁ మీ
పటుదలల్ విదేశములపె బడి దోచుటయా! చరిత్రలో
నిట్టి విచిత్రముల్ వినిచెనే భరతావని యెన్నడేనియున్?

ఆ రజనీ హృదిన్ రణ రహస్యము లెట్టి విచిత్ర వేషముల్
మారుచుకొన్నవో గగనమండలమే యెరుగున్—ఘనాఘనా
సార మెరుంగు - నంధతమసం బెరుగుఁ - ఎరుగుఁ నదీ పయఃపూరము—నాటి ప్రొద్దుపొడుపుల్ భరతోర్వికి సుప్రభాతముల్.

భారతభూమిలో పిరికిపందకు స్థానములేదు, లేదు మా
పౌరుష వాణికిఁ శిథిలభావము, శత్రువు యోగ్యుడైనచో
గౌరవమిచ్చి గౌరవము గైకొనుపద్ధతి మాది, తెల్పు డే
తీరున నేడు మిమ్ము గురితింపుమటందురొ' యంచుబల్కినన్.

'వీరులు మీరు, నేను నొక వీరుడ, వీరు మరొక్క వీరు డే
తీరున గౌరవించునొ అదే క్రియ గాంచు' డటుంచు ధీర గం
భీర గళమ్ముతో పలికి మిన్నక నిల్చిన 'గ్రీకు రాజ కం
ఠీరవు' గాంచి ముచ్చటపడెఁ పురుషోత్తమ చక్రవర్తియున్.

బంధ విముక్తు జేసి ప్రియ భావముతో యవనేశునిన్ సుహృ
త్సంధి నియుక్తు జేసె నృపసత్తము డా పురుషోత్తముం; డిటుల్
సంధిలె మైత్రి నాగరక జాతులు రెంటికి; నిట్లు గ్రీకు గ
ర్వాంధ తమస్సు లారుపదియైనవి భారత భానుదీప్తికిన్.

గ్రీకు చరిత్రకారులు లిఖించిన స్వాతిశయార్థగాథలే
గైకొని ఆంగ్ల పండితులు కట్టు కథల్ రచియింప, వానికే
తోకలు చేర్చి గ్రంథముల దూర్చిరి బానిస భారతీయ చా
ర్వాకులు—సత్య సూక్తి నడువం డొకడున్ సవిమర్శకమ్ముగన్.

భండన పాండితిం గని, ప్రపంచము గెల్వదలంచు గ్రీకు మా
ర్తాండుడు నేటి కొక్క భరతక్షితిపాలున కోడె నన్న బ్ర
హ్మాండము మున్గిపోయినటులై కథ నడ్డము ద్రిప్పినా 'రతె
గ్జాండరు' జేతయా? విజితుడా 'పురుషోత్తము' డింత మోసమా ?

ప్రాకట శౌర్య ధైర్య పరిపాలకులు, వీరరస ప్రతీకులౌ,
గ్రీకులు కాండిశీకు లయి కేల్గవ మోడ్చిరి వీర భారత
శ్రీ' కను దుర్యశమ్ము తమ శీర్ష్యముపై బడకుండ చల్లగా
లోకము కన్నుగప్పి—రెటులో మసిపూసిరి వాస్తవమ్ముపై !!

కల్యాణగీతి

శ్రీకరమ్ములు పతికి నాహ్లాదకలోల
శివ జటాజూట గాంగేయ శీకరములు!
రంజితమ్ములు సతికి శర్వాణి చరణ
కంజ మంజుల మంజీర శింజితములు!!

వేమనయోగి

యోగిరాజువొ కవిరాజువో వచింపు!
ఆ యతిగణాలు ప్రియమొ ఈ యతిగణాలొ?
భూతియో గీతియో ప్రీతి? చేతిలోని
దాత్మబోధామృతమొ కవితామృతమ్మొ!!

తళుకు లీనెడు చెక్కుటద్దాలమీద
జారిపోలేదు కోరమీసాల సొగసు;
తరగనేలేదు మంజులాధరములోని
రక్తిమ మ్మింతలోన విరక్తి యేమి?

పాలుగారెడు నీ ఫాల ఫలకమందు
చెరగిపోలేదు రాజ్యలక్ష్మి పదాలు;
పసిడి మేడలు విడనాడి పల్లెటూళ్ళ
వైపునకు సాగిన విదేమి నీ పదాలు?

"కవియో! యోగియో! తత్వదర్శకుడొ! సాక్షాద్దక్షిణామూర్తియై
శివుడే వచ్చెనొ కొండవీటి కిటులఁ శిష్యాళితో" నంచు ని
న్నవలోకింపగ పల్లెపట్టు ప్రజ లంతా వచ్చుచున్నారు—నీ
వెవరయ్యా? తెలుగుం బొలాలపయి విన్పించెఁ భవద్గీతికల్!

గోచీపెట్టెను పెట్టలేదనుటకుఁ కొట్లాట—తిక్కన్నకుఁ
ప్రాచీనుం డని, కాదు తిమ్మనకు నర్వాచీనుడం చేదియో
పేచీ—యీ సిగపట్ల గోత్రముల కబ్బే నేను పోలేను—నీ
వాచామాధురి నీ నిరర్గళ కవిత్వ స్ఫూర్తి గీర్తించెదఁ.

తెలుగుదనమ్ము ఆటవెలదిఁ జతగూర్చు కవిత్వతత్వ వే
త్తల తలమానికంబవట! తావక నిర్భయ నీతి దీపికల్
వెలుగులు జిమ్మె జానపద వీథుల; మా తెలుగమ్మ గుమ్మముల్
కళకళలాడె నీ కృతులు గట్టిన పచ్చని తోరణాలతో!

అభిరామాకృతులైన నీ కృతులు నవ్యత్వాభిరామమ్ములై
ప్రభుతం గన్నవి యావదాంధ్రజన హృత్పద్మమ్ములఁ, భాను స
న్నిభ! యుష్మ త్కవితారుణప్రభలు నిండెఁ గేహగేహాల, మా
యభివాదమ్ములు గొమ్ము పేమనకవీంద్రా! కర్మయోగీశ్వరా!

తీయు తీయని నీతి జాతీయములను
తెలుగుబిడ్డల నోటి కందించినావు;
కాగుడింతాలలో డిప్పకాయ గూడ
అప్పగించును నీ 'ఉప్పుకప్పురంబు'

పొట్టి చొక్కాలతో నింత బొట్టెలమయి
వీధిబడి కేగు తొలి సంజ వేళలందు
ఆటవిడుపులనాడు మా ఆయ్యవారు
చెప్పినారయ్య! మాకు నీ 'చిత్తశుద్ధి'

గొడ్లమేపుకొనే కుట్టికుంక మొదలు
శ్రుతులు వ్రేలాడు వృద్ధపండితుని వరకు
వేమనకవింద్ర! నీ గీతి విననివాడు
కానరా డివ్వటికి తెల్లుగడ్డమీద.

నీతి కేతనంబు నీ చేత ధరియించి
చెడుగుమీద దాడి చేసినావు;
నీదు మకుటశోభ నిండెను సర్వత్ర
విశ్వమందు నీవు శాశ్వతుడవు!

సంఘసంస్కర్తవై దురాచార విష వి
దగ్ధ జగతికి నూత్న చైతన్య మొసగి
త్రోవ చూపించినావు ముందునకు నీవు -
మంచి మొనగాడవయ్యా! వేమన కవీంద్ర!

నీ మనోహర మకుట సన్నికటమందు
వెలుగుబాటలు గన్నారు తెలుగువారు ;
వెలయుచున్నారు సాహితీ వీథులందు
వెందరో "పిల్ల వేమన్న" లిప్పుడిపుడు.

పాకీపిల్ల

[ఉదయం నుమారు ఏడుగంట లవుతుంది. బజారున వస్తూం దొక పాకీపిల్ల. చేతులో చీపురుకట్ట-చంకన చింపిరితట్ట, బాలభానుడు తన లేత కరాల్తో ఆమెను లాలిస్తున్నాడు. భగవతి వసుంధర అడు గడుగునకూ ఆమె చిన్ని పాదాల్ని ముద్దు పెట్టుకుంటున్నది.]

తన సుఖమువీడి తోడి సోదరుల సౌఖ్య
మునకె జీవిత సర్వస్వమును వ్యయించి,
ఏవ మెరుగని నీ యమాయకపు ప్రేమ
లోతెరుగజాల దీ స్వార్థ లుబ్ధ జగతి.

నీ పవిత్రప్రకృతి స్వదేశోపకృతికి
త్రోవ చూపించెలే మహాత్ములకు గూడ
భరతజనయిత్రి ప్రేమంపు పసిడిముద్దు
తొలుతొలుత నీవె అందుకొందువు గదమ్మ!

చీపురు నొక్క చేత ఒక చేతను చింపిరి గంప బూని యా
పాపపు గుప్ప లూడ్చెదవు బాలిక! చీదర లేదె సుంత? నీ
యోపిక చూచి మెచ్చి తలయూచు జగత్పిత కన్నుగొల్కులన్
తేపకు తేపకుఁ బయలుదేరు నవే నులివెచ్చ బాష్పముల్ !!

ఆకల్పాంతము నీ పవిత్ర దినచర్యల్ నిత్యనిర్ణిద్ర వి
శ్వైకప్రేమ మహాగమమ్మునకు 'తూచా' పోని వ్యాఖ్యానముల్ ;
పాకీదానిగ అడిపోసుకొను ఈ పాపిష్ఠిలోకమ్ము నీ
బాకీ తీర్చుకొనంగలేదు జగదంబా! జన్మజన్మాలకుఁ.

కుక్షిస్థ మ్మగు కుళ్లెరుంగడు—కృశాంగుం డీడ్వలే కీడ్వగా
రిక్షాలో జనుచున్న ఆ పశువు దారిన్ తొల్గిపోవంచు ని
ర్ణాక్షేపించును పండుకోతివలె మో మంతా కనులీ చేసి—వీ
మో క్షోభించును కొంప మున్గి నటు లబ్బో! ఎంత బిబ్బోకమో!

ఈ గతి నేహ్య మెల్ల సహియించి యుగమ్ములనుండి చేయు నీ
త్యాగము గుర్తెరుంగదుగదా! నెలకిచ్చెడి రెండణాలకే
యాగము సేయు లోకము, యథార్థముగా తమ సేవకోసమే
భాగవతమ్ములోని భగవంతుడు నిన్ను సృజించినట్లుగన్.

చెల్లి! నీ బీద మోము దర్శించినంత
విసము గుఱిపించు నేమి రక్కసి జగమ్ము!
మానవత్వమ్మునే యవమానపరచు
పసరముల సంత యిది దయారసము సున్న.

ఒక్కరో జీవు వీథుల నూడ్వకున్న
తేలిపోవును మా పట్టణాల సొగసు!
బయటపడునమ్మ! బాబుల బ్రతుకులెల్ల
ఒక ఋణ మ్మీవు గంప క్రిందకును దింప.

పావనమ్మైన నీ ప్రజాసేవకొరకు
త్యాగమయమైన నీ జీవితమ్ముకొరకు
కార్చలే దొక్క కరుణాశ్రుకణముకూడ—
జార్చలే దొక్క వేడి నిట్టూర్పుకూడ—

ఈక్కు పాదాలతో నిన్ను ద్రొక్కు—'దున్న
పోతు సంఘమ్ము'పై సానుభూతి చాలు;
కడుపు గడవంగ చాల మార్గములు గలవు
బైటబడుమమ్మ! యీ మూగ బ్రతుకునుండి.

'పాకీపిల్ల' వటంచు నిన్ను నిరసింపంజూతు రమ్మా ! స్వయం
పాకస్వాములు కొంతమంది, ఇది యే పాపంబొ! మూన్నాళ్లలో
నే కన్నుల్ తలకెక్కి వెన్క గన రీ నిర్భాగ్యదా మోదరుల్
పాకీదేగద మాకు మా జనని బాల్యమ్మందు సంజీవనీ!

మాతృస్థానము నందుకొన్నయది యుష్మన్మూర్తి లోకాన, ఊ
హాతీత ప్రణయాధిదేవతకు పుణ్యక్షేత్రమే యయ్యె నీ
చేతోవీథి, పరార్థచింత నుపదేశించున్ భవద్వృత్తి, ప్ర
ఖ్యాతంబైనది నీ ప్రవృత్తి ఇవిగోనమ్మా ! నమోవాకముల్.

ముందడుగు

కైసేసినారు! నీ కవికుమారులు శార
దాదేవి మెత్తమెత్తని పదాలు
చిందించినారు! నీ శిల్పకారులు కళా
కళ్యాణి కడకంట కాంతిలహరి
వ్రాయించినారు! నీ వైజ్ఞానికులు పృథ
ములచేత మనసులోపలి నిజంబు
కరగించినారు! నీ గాయకాగ్రణులు గుం
డెలు లేని మొండిబండలను కదిపి
అభ్యుదయ మార్గమందు ముందడుగువేసి
జతన మొనరింపుమోయి! భారతకుమార!
చేత జాతీయ కేతనశ్రీ తలిర్ప
వెలగగలవోయి! విజ్ఞానవీథులందు.

ధర్మపరశు

[జమదగ్ని శాంతమూర్తి తపస్సంపన్నుడు. మహాబుషి. మునిపల్లెలో భార్యా పుత్రులతో కాపురం. పర్ణశాల పంచమందు వున్న ఆవు ఒక్కటే ఆయన సర్వస్వం. ఒకరోజు వేటకు వచ్చి ఆకలితో నకనకలాడే రాజుకూ పరివారానికీ ఆతిథ్య మిచ్చాడు ముని.

పిలిచి పిండివంటలతో విందు చేసినందుకు ప్రతిఫలంగా ముని హోమధేనువు మీద కన్ను పడింది కార్తవీర్యుడికి. ఆ దురాక్రమణకు అంగీకరింపలేదు తపస్వి. రాజుగారి కోపం వచ్చింది. నిరంకుశత్వం కేయికరాలు చాచుకొని ముందుకు నడిచింది.

హింస అహింసమీద కత్తి దూసింది. అధర్మం ధర్మం మీద దాడి చేసింది. పశుబలం ఆత్మబలాన్ని పరాభవించింది. బలవంతంగా ప్రజాధనం ప్రభుత్వ భవనంలో బందీ అయింది.

గోమాత ఘోషవిని అహింస కన్నులు తెరిచింది. ధర్మపరశువు పైకి లేచింది. ఆత్మబలం విజయయాత్ర

సాగించింది. ఆధర్మమూ దాన్ని సమర్థించిన శక్తులూ పటాపంచలయినై. వేయిచేతులు తెగిపడినై. నిరంకుశత్వం నిర్మూలమయింది. ధర్మంజయించింది. ఇదీ పరశురామునిపై నా భావన. ఇదే నా 'ధర్మపరశు' కావ్య నిర్వచనం.]

బ్రహ్మవర్చస్సు చిందు నీ ఫాలతలము
క్షాత్ర తేజస్సు జిమ్ము నీ నేత్రయుగళి
భార్గవా! నీవు క్షత్రియబ్రాహ్మణుడవొ!
బ్రాహ్మణక్షత్రియుడవొ! విభ్రాంతిగలిగె.

అలిక ఫలకమ్మొపయి రక్తతిలకమేమి?
క్రాంతిసంక్రాంత మగు పురోగమన మేమి?
గండ్రగొడ్డలితో భుజాస్కంధమేమి?
విశ్వభీకరమైన ఈ వేషమేమి?

ఎవడురా వాడు! కదిసి కవ్వించినాడు
మరచి నిదురించు వీరకేసరిని తట్టి—
ఎవడురా వాడు! తలదూర్చ నెంచినాడు
అరిభయంకర మృత్యుగహ్వరములోన.

ఎక్కడకీ ప్రయాణము మునీంద్రకుమారక? జింకచర్మ మే
దిక్కున పారవైచితి? విదేమి కనుంగవ చింతనిప్పులన్
గ్రక్కుచునున్న? దుద్ధృత కరమ్మున నూగెడి ఆ కుఠారమే
మ్రుక్కడి దానవాధముల మూపుల దూకగ నుత్సహించెరా?

నడుముబిగించి వల్కలమునన్, జడలఁ సిగజుట్టి, కన్నెమల్
ముడివడ, వీరరక్త మిడి మోమున, విప్లవ గర్జకుం దిశల్
తడబడ, కాలరుద్రుని విధాన కుఠారము చేత బట్టి నీ
వడుగిడ దద్దరిల్లినదిరా! పృథివీతల మొక్కపెట్టునన్.

సత్యతపోధనుండవె! ప్రశాంతుడవే! జమదగ్నిరేణుకా
పత్యమవే! మహేశ్వరుని భక్తుడవే! మరి బ్రాహ్మణుండవే!
జాత్యనురూప ధర్మగుణ సంపద నెంచక రౌద్రమూర్తివై!
హత్యల కిట్లు పాల్పడితివా! మతిపోయినదా భృగూద్వహా!

నే నొక సార్వభౌముడ ననే మదమే తలకెక్కెనో! తనుల్
గానడు కార్తవీర్య డధికారము మౌనిజనమ్ము మీదనా!
ధేనువు నీయకున్న గురువుదేవునిపై పగబట్టి ద్వేష రో
షానల దుర్విదగ్ధుడు దురాక్రమణంబున కుద్యమించునా!

ఇంటికి పిల్చి స్వాగతము నిచ్చి ప్రియంబున విందుసేయుటే
కంటక మయ్యెనా ప్రభువుగారికి—ఆశ్రమ హోమధేనువున్
గెంటుకపోయె క్రౌర్యము చిగిర్చిన వేయికరాలు సాచి—ఈ
కొంపెతనమ్మ్మ రక్తబలి గోరదె హైహయరాజవంశమున్ !!

మాలిమిచేసి ఎంత బ్రతిమాలిన గోవు నొసంగనట్టి గూం
డాలకు బుద్ధిసెప్పెడు కుఠారముధాటికి నిల్వలేక గ
గ్గోలయిపోయి రాజుకొడుకుల్ కనుచాటుగ ఆశ్రమంబులో
కాలిడి నీవు లేని తఱి కంతముకోసిరటే తపోధనుఁ !

'పఱ పఱ గొంతుకోసిరి కృపారహితాత్ములు గోలపెట్టి బి
ట్టఱచెడి నన్ను లెక్కగొనరైరి రవంతయు రామ రామ !' యం
చిరువదియొక్కమారు జనయిత్రి యురస్థలి బాదుకొన్నదా !
తరమిసదా ! నినుఁ రుధిరధారల తండ్రి ఋణమ్ము దీర్పగఁ !

గడగడలాడె రాచతలకాయల స్వర్గపుమెట్లు గట్టుక
ట్టిడి జగజెట్టి ! నీ బొమముడిఁ గని దైవతరాజు కాళ్ళు—త
ల్లడపడి సంభ్రమించి రుడురాడ్ దినరాజులు—రాతగులుదీయుల్
'దడదడ' కొట్టుకొన్నవిగదా గిరిరాజునకుఁ బరంతపా !

V. R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

ఎయ్యెడ నేర్చుకొంటివి మునీ! గడిదేరిన రాచవారితో
కయ్యము సేయునేర్పు? మొనగాడవు! కోసితి వూచకోత—అ
క్కయ్యము లయ్యె నీ విజయగాథలు భావి చరిత్రలోన, మా
యయ్య! అనుగ్రహించి ఇకనైనను గొడ్డలి క్రిందపెట్టుమా!

చిన్నతనంబునన్ శివుని శిష్యుడవై రజితాద్రిమీద గై
కొన్న మహాప్రయాసమునకున్ ఫలితార్థ మిదేనటోయి! ఏ
మన్న నికేమియున్నది మహాబలికాండ సమాప్తమయ్యె - ఇం
కెన్ని యుగాల కీ రుధిర మెండునొ భారతభూమి గుండెపై!

దర్పమెలర్ప వైరి వసుధాపతులన్ వధియించి తండ్రికిన్
దర్పణ మాచరించితివె తద్రుధిరమ్ముల, భూమిభారమున్
దీర్పగ జన్మమెత్తితివి; దేశము కంటకశూన్యమయ్యె; రా
మార్పణమయ్యె క్షుద్రములు స్వార్థపరత్వ నిరంకుశత్వముల్!

మే మిక చూడలేము—విరమింపుము వీరవిహారయాత్ర నో
స్వామి! భవత్కుఠారము కసాయిదుకాణము చేసివైచె నీ
భూమి సమస్తమున్, చెదిరిపోవుచునుండె కనుల్, ప్రచండ తే
జో మహనీయమూర్తి! దయచూడుము! వీడు ముదగ్రరూపమున్!

బ్రద్ధలైనవి శత్రుపక్ష వక్షఃకవా
టములు నీ గండ్రగొడ్డలికి దాకి
పారలిపారినవి. నెత్తురుటేళ్ళు వీర వి
స్ఫూర్తి నీ కంటి కెంపును గ్రహించి
దిమ్మెక్కినవి అష్టదిగ్గజమ్ములు శ్రవ
ణములు నీ సింహవాదముల కులికి
అల్లాడిపోయిన వాదిశేషుని వేయి
తలలు నీ కాలి తాపులకు నోర్చి
ఎంత సాహసమో ! ఎవ్వ రెంచగలరు -
ఎట్టి స్థైర్యమో ! ఎవ్వ రూహించిగలరు -
నీవు పరశువు చేబూని నిల్చినంత
అడలిపోయినదోయి ! బ్రహ్మాండమెల్ల.

గొడ్డలి పూని భూపతుల కుత్తుకలక్ తెగవేసి రక్తపుం
గడ్డయొనర్చి తీ భరతఖండము భార్గవరామ !- ఎట్టు లో
బడ్డదిరా నవోత్పలమువంటిది నీహృది ? సత్యశౌచముల్
గొడ్డరిపోయెనే ! చెరుపుకొందువె ! మౌనికులప్రతిష్ఠలక్ !

ఒక్క మునియేమి ఇరువదియొక్కమారు
దర్పధనులగు నృపుల విదల్చుటేమి!
ఏ మహాశక్తియో పొంగులెత్తి పొరలి
ఱెక్కలల్లార్చె గాక వేరొక్కడగునె!

'గోవు కొట్లాట' కా దిది-దైవబలము
దానవబలమ్ముపై జయధ్వజము నెత్తె—
ఇది ప్రతిక్రియకాదు దుర్మదనిరంకు
శ ప్రభుత్వమ్ముపై ప్రజాశక్తి గెలుపు—
ఎవ్వ రేమనుకొన్న నీకేమి? దైవ
శక్తి నీయందు కలదు దీక్షాతపస్వి!
కడుగుకొనుమయ్య! రక్తపంకమ్ము తొలగ
నర్మదాతీర్థమందు నీ 'ధర్మపరశు'

'తల్లిని జంపె' నంచు అయథార్థ కథానికలఁ చరిత్రలో
నల్లిరి గాని, నమ్ముదుగదా మది-దుస్సహ దుష్టశక్తులన్
త్రుళ్ళడగింప ముందునకు దూకు భవాదృశ సత్యవీర్య శౌ
ర్యోల్లసితప్రభావు లెటు లోర్తు రకారణమాతృహత్యకుఁ!

మా గాంధీతాత

అడుగువెట్టినచాలు అవనీంద్ర రత్నకిం
జిత కిరీటములు హారతు లొసంగు!
బయలుదేరినచాలు జయజయ ధ్వనులతో
గ్రామాలు గ్రామాలు కదలివచ్చు!
కొంగుబట్టిన చాలు కోటానుకోట్ల హా
స్తములు బంగారు వర్షములు గురియు!
పెదవి యొకింత విప్పినచాలు లక్షల
కొలది తలల్ వచ్చి కొలువుతీర్చు!
నవ్వినంజాలు పతిత మానవ సమాజ
మానసమ్ములు దేదీప్యమానములగు!
పట్టుపట్టిన చాలు సమ్రాట్టులైన
తలలు వంతురు మా గాంధితాత ముందు!!!

శాంతిదూత

ఆచ్చపు దాస్య శృంఖలములందు దగుల్కొని శౌర్యధైర్యముల్
చచ్చి కృశించు ఈ భరతజాతికి నూతనశక్తిదాతవై
వచ్చినయట్టి సూర్యభగవానుడ వీవు త్వదాగమమ్మునఁ
విచ్చెనులెమ్ము మా నయనవీథుల గ్రమ్మిన కారుచీకటుల్ !

పవలుఁ రాత్రులు నెత్రుచేళ్లు ప్రవహింపఁ పాపభూయిష్ఠమౌ
నవకాళీ నరకమ్ములో చరణవిన్యాసమ్ము గావించి నా
దవు నీ శాంతిమయూస్యకాంతి గని గూండా లందరుఁ విశ్వ మా
నవ సౌభ్రాత్ర విధాత ముందు శరసన్యాసమ్ము గావింపగఁ !

నెత్తురు త్రావు రక్కసులె నీ చరణాలకడఁ వినమ్రులై
కత్తులు బల్లెముల్ గదలు కట్టలు బాకులునుం దుపాకు లిం
తెత్తున రాశిపోసి భజియించిరటే భవదంఘ్రి, మారణో
న్మత్తుల మత్తు దింపగల మంత్రము లెచ్చట నేర్చుకొంటివో ?

కండల్ నిల్వ్యాన చీల్చి సోదరుల రక్త మ్మాను నక్తంచరుల్
గూండామూకలు పిల్లికూనలవలెఁ కూర్చుండినారంట నీ
జెండా నీడలలో, సుధా మధుర వాక్ క్షీరమ్ములం ద్రాపి యీ
గండాగొండి శిఖండులం దనుపు నీ కారుణ్య మేపాటిదో !!

జవహరు డల్లదే విజయశంఖము నొత్తుచునుండె కేల గాం
డివము ధరించి; ఘంటలు ఘణిల్లున మ్రోగెను వీరభారతీ
భవనము ముందు, పగ్గములు బట్టి ప్రజారథ మింక నాజవం
జవముగ త్రోలుమా ! విజయసారథివై విజయమ్ము సేయుమా !

దురహంకారులు స్వార్థదూషితమతుల్ దుశ్శాసనుల్ దుష్క్రియా
పరు లున్మత్తమహాపిశాచములు పైపై దూకి బాధించు నీ
భరతక్షోణికి దిక్కు వేరెవరు నీ ప్రాపాండు దక్కన్, స్వరా
జ్యరథ మ్మొక్కి ప్రజాతతిన్ నడుపుమయ్యా ! కర్మవీరాగ్రణీ !!

'గుప్పెడు ప్రాణముల్ ప్రజలకోసమ యర్పణసేతు హింసయే
తప్పనినా' డటంచు బహుథా ప్రవచించిన నీ ప్రతిష్ఠకై
ముప్పదిమూడుకోట్ల శిరముల్ ప్రణమిల్లెనుగాక గుండెపై
నిప్పులకుంపటుల్ నిలుపనేర్తురికెన్నిదినాలు హైందవుల్ ?

పూజాపుష్పాలు

[బాపూజీ మదరాసు వచ్చినసందర్భములో]

అన్ని గుణంబులందున 'మహాత్ముడవే!' 'యుగపూరుషుండవే!'
యొన్ని విధాల చూచిన—యిదే యనుమానము మాకు—తెల్గువా
డన్నది గిట్టదేమి? ఇది ఆంధ్రుల పాపమొ—చందమామలో
చిన్న కళంకముండుట విచిత్రము కాదుగదా! మహారధీ!

తిరుపతికొండదాక తమదేనట! చెన్నపురిక్ర గ్రసింపగా
వరదలు వాగులై యరవవారల నెత్తురు పారునంట! యీ
మొరగులు మాని న్యాయపథముక్కగొను డంచును గూడకట్టు సో
దరుల కొకింత చెప్పవుగదా గడబట్టిన పెద్దవాడవై!!

రాజాజీ మొదలైన పెద్దలకు మా రాష్ట్రమ్ము పేరెత్తినక్
బేజారెత్తును గుండె, పెద్ద ప్రళయంబే తెల్గు బాజారులో
బూజా మ్రోగిన రెడ్డియార్లు, కిక మా భాగ్యమ్ము లెట్లున్నవో
'పూజాపుష్పము'లివ్వి యందుకొని బాపూజీ! ప్రసాదింపవే!!!

రాష్ట్రసిద్ధి

మీలో మీరు సవాలుకొట్టుకొని స్వామీ ! 'ఆంధ్రరాష్ట్రమ్ము' బం
గాళాఖాతములోన ద్రోసితిరి - పైగా తెల్గువా రన్నచో
వేళాకోళము లయ్యె నల్లురకు—ఈ వేదాంతభాష్యాలతో
కాలక్షేపము చాలు, నింక దిగుడీ కర్తవ్యరంగమ్మునఁ !!

తోచీతోచని తోడి సోదరు లదేదో కోరుచున్నట్లుగా
చూచీచూడరు నేడు నాయక వతంసుల్, చీటికిఁ మాటికిఁ
పేచీవేతురు, రాష్ట్రవాంఛయును తప్పి యయ్యె మా వారికిఁ-
చీ చీ ! ఎంతటి శోచనీయ దశ వచ్చెఁ నేటి కాంధ్రోర్వికిఁ ?

అరవల మూతినాకి, 'అహహా' యని తోకలు త్రిప్పి, నేలపై
దొరలుచు, సందుచూచుకొని దూరుచు, చీకటి సందుగొందులఁ
దిరిగెడు గ్రామసింహముల తీరున నాయకులుండ, తెల్గు సో
దరుల యదృష్టమందు గలదా అభివృద్ధియు రాష్ట్రసిద్ధియుఁ.

కాంతికి కళ్ళు మూసికొని, గాఢ తమోమయ ఘోర కాననా
భ్యంతరమందు ద్రిమ్మరు దివాంధములై యభిమానశూన్యులై
వంతలుపాడు మా తెలుగువారికి లక్షయుగాలకైన గ
త్యంతర మున్నదే? పరుల దాస్యము జాతికి ఖ్యాతిగూర్చునే?

కలయో - వైష్ణవమాయయో - యితర సంకల్పార్థమో-ఏదియో!
తలపంజాలము భారతావని స్వతంత్రంబయ్యె, మా తల్లి శృం
ఖలముల్ ఖల్లున నేలపై తెగిపడెఁ, గానీ - స్వరాష్ట్రమ్ముకై
తెలుగుంబిడ్డలొకింత నోచుకొనలేదే ఎంత దౌర్భాగ్యమో!!

ముంగల గానుపించి, పది మూరల దూరము పోయి, అంతలో,
చెంగట కేగుదెంచి, చెయి జిక్కి, విచిత్రముగా నదృశ్యమై,
'బంగరులేడి' వోలె గనుపట్టుచున్నది రాష్ట్రసిద్ధి - త్రై
లింగమహారథమ్ము' కదలింపుడు భారత రాజవీథులన్!!

'రంగా' దక్షత 'టంగుటూరి' యసిధారా దీక్ష 'పట్టాభి' మం
త్రాంగ ప్రౌఢిమ-యీ త్రయమ్మును సమైక్యంబై విజృంభించిన
సాంగోపాంగ సమృద్ధమై మనకు రాష్ట్రం బబ్బదా - పండవా
బంగారంబులు - పండవా తెలుగుశోభల్ - దశదేశమ్ములన్ -

మన పుణ్య వాహినీ మధురాంబు పూరంబు
జలధి గర్భమ్ములో గలిపివైచి—
మన భాసమా నాసమాన శేముషి, వృథా
వాదోపవాదాల వ్యయము సేసి—
మన స్వజాతీయాభిమాన సౌభ్రాత్రమ్ము
పదవుల కోసమై బలి యొనర్చి—
మన విశాలాంధ్ర నిర్మాణ దీక్ష స్ఫూర్తి
తమిళ హస్తాలలో ధారవోసి—
మన పురా శౌర్య ధైర్య సంపదలు వర్ణ
మత విభేద పిశాచి కాహుతి యొనర్చి—
తెలుగు గడ్డకు తలవంపు తెచ్చినాము
మేలుకొను ! డింక మన రాష్ట్ర మేలుకొనుడు !!

భారతభాగ్యదేవత

కత్తి కదల్పలేదు—విశిఖాలు విదల్పనులేదు—గాండివం
బెత్తనులేదు—ఏ క్రియ జయించితివో నరమాంస పారణో
న్మత్తుల? నీ ప్రభావము లమానుషముల్ భవదీయ శాంతి సం
పత్తికి దోసిలొగ్గెను ప్రపంచము భారతభాగ్యదేవతా!

పుటలా డెబ్బదియెన్మిదేగినవి బాపూజీ వయఃకావ్య సం
పుటిలో, పై పుట త్రిప్పులోపలనె మా పున్నెమ్ము మిన్నంది ప్ర
స్ఫుట భంగిక వినిపించె నేటి కిట సంపూర్ణ స్వతంత్ర ప్రజా
పటలీ వీరవిహార విశ్వ విజయ ప్రస్థాన భేరీ ధ్వనుల్!!

'యుగపురుషుండ'వంచు'పురుషోత్తమమూర్తి'వటంచు'మూర్తిమ
జ్జగదనురాగ శాంతిమయ సాత్వికశక్తి' వటంచు వేనవేల్
మొగముల ప్రస్తుతించెను ప్రమోదముతో జగమెల్ల నిన్ను ఏ
మగుదురు నీకు? తొల్లిటి మహమ్మదు క్రీస్తును బుద్ధదేవుడుకా!

హత్య

హంత ! ఇదేమి ? నీదు ప్రణయాంకతటమ్మున నిద్రపుచ్చి నీ
వింతటి వాడికత్తి నిటు లేటికి గ్రుచ్చితివోయి నిర్దయ
స్వాంతుడ ! నాదు పేద హృదయమ్మున, చేయి కదల్పబోకు-ప్రా
ణాంతకమైన యీ నరక యాతన గుండెలు మోయలేవురా !!

విషక్షణము

ఊయ్యాలలో నూగుచున్న ముద్దుల బిడ్డ
లేచి కెవ్వున కేకవైచెనేమి?
పాకలో లేగకు పాలిచ్చు గోవు 'అం
భా' యంచు గొంతెత్తి యరచెనేమి?
జల జల ప్రవహించు జమున నిస్తబ్ధయై
నిలిచి కన్నుల నీరు నింపునేమి?
చకచక పొలము దున్నుకొని పోయెడి రైతు
నాగలి ముందుకు సాగదేమి?
కోటలో ఆరుగంటలు కొట్టబోవు
వాని హస్తాలు గడగడ వణకునేమి?
ఏ మహాత్ముని గుండెపై కెక్కి చనెనో
కాలపురుషుని రథరథాంగములు నేడు!!

దుర్దినము

కనుపింప దిదియేమి ? కనక కాంతులు చిందు
సత్యావతార ప్రశాంతమూర్తి—
వినుపింప దిదియేమి ? వీనులవిందుగా
'రఘుపతి రాఘవ రామ భజన'
కళదప్పెనేమి ? ఏ కాలమ్ము కళకళ
లాడుచునుండు బిర్లాలమేడ -
తలవంచెనేమి ? మిన్నులు ముద్దుకొను మూడు
రంగుల వీరభారత పతాక -

తడిసిన దిదేమి ? కన్నీటిధారలందు
భరతజనయిత్రి ఖద్దరు పైటచెరగు -
ఏమొ పోగొట్టుకొన్నట్టు లేడ్తు రేమి ?
గోడుగోడున నలుబది కోట్ల ప్రజలు !!!

పిడుగుపాటు

ఇదియేమీ! నిజమా! మహాత్ముడిక లేనేలేడ-యీ వార్తవ
ట్టిదికాదా - కరుణాసముద్రుడగు తండ్రిన్ హత్యగావించిరా -
ఇదియేమీ! ఇదియేమి! ఏమిటిది! స్వామీ! ఈ విషంబేమి-మ్రిం
గుదుమా-మ్రింగక తప్పదా-జగము గగ్గోలెత్తి వాపోయెడిక -

హింసయహింసపై పగవహించె, నవోదయశక్తిమీద వి
ధ్వంసకశక్తి ద్రూకిన, దధర్మము ధర్మము నాక్రమించె, దు
ర్మాంస బుభుక్షు రాక్షసకరమ్ము ప్రశాంత మరుత్తరంగిణీ
హంసము నేసె, సాంధ్యసమయమ్మున విశ్వము విహ్వలింపగన్.

క్రొత్తవెలుంగుబాట నెటకో గొనివచ్చి, స్వతంత్ర భారతో
దాత్త నిదర్శనంబగు 'ప్రదర్శన' మంచు మహా భయంకరో
న్మత్త పిశాచినీ వికట నాట్యము సూపితివేమి? ఈ కథా
వృత్తము చూడలేము-తెరవేయుము-దీపము లార్పు మో ప్రభూ!

తీరని లోటు

గుండెలు జారిపోయె ప్రజకున్, కనుగోనల నశ్రువాహినుల్
నిండె, నభమ్ము ప్రబ్దలయి నెత్తిపయిం బడె, దద్దరిల్లి బ్ర
హ్మాండము క్రుంగిపోయినది, అంతటి తండ్రిని ధూర్తుడైన పు
త్రుండు కిరాత హస్తములతో వధియించె నటన్న వార్తకున్ -
మెత్తని గుండెనుండి పుడమిం ప్రవహించెడు పూజ్యబాపుజీ
నెత్తురు ద్రావుచున్ కనులనీరిడె మృత్యువు, బాపు లేమికిన్
సత్తువ చిన్నపోయినది, శాంతి కృశించె, నహింస యేడ్చె డ
గ్గుత్తికతోడ, ధర్మము దిగుల్పడె, క్రుంగెను కర్మసాక్షియున్ !!

నిండు మనస్వి - విశ్రుత వినీత పునీత యశస్వి - సాత్వికా
ఖండ తపస్వి - సత్యసహకారము చిట్టచిటారు కొమ్మపై
పండినపండు - బ్రహ్మఋషి - భారతభాగ్యవిధాత - ప్రార్థనా
మండప వేదిమీద నిక మా కనుదోయికి విందొనర్పడా ?

వకొనలేఖిని

'వ్రాయుము వ్రాయు'మంచు బలవంతము సేతువు నన్నుభావనా
ప్రేయసి! స్వేచ్ఛకై పరితపించెడి నల్వదిరెండుకోట్ల దే
శీయుల మైత్రికోసము కృశించి-కృశించి-నశించిపోయె జా
తీయ మహాతపస్వి గురుదేవుడు, చాలు-నికేమి వ్రాయుదున ?

'వ్రాయుము వ్రాయు' మంచు బలవంతము సేతువు దేవి! దేనితో
వ్రాయుదు? శాంతిదేవత యురమ్మున చిందెడి రక్తధారతో
నా! యమునాస్రవంతి నయనాంచల కజ్జల బాష్పధారతో
నా! యెటువ్రాతు విశ్వహృదయమ్ము కలంచు విషాదకావ్యమున.

ఏమని వ్రాయుదుం ? బ్రతుకు లిచ్చిన బాపు ఋణంబు తీర్చు కొ
న్నామనియా? స్వరాజ్యభవనంబున శాంతికి శాంతి చేసికొ
న్నామనియా? అఖండకరుణానిధి తండ్రికి కాన్క లిచ్చుకొ
న్నామనియా ? కృతఘ్ననయనమ్ముల ఘోరవిషాగ్నిగోళముల్ !

ధన్యజీవి

'ప్రేమార్ద్రహృదయుడౌ' జీమూతవాహను
జాలిగుండెల మధ్య జననమంది -
'నిరుపమాన త్యాగనిధి' దధీచి మునీంద్రు
నాశ్రమద్రుమరాజి నల్లువెట్టి -
'కరుణారసామృత గంగాలహరి' బుద్ధ
భగవాను కన్నీట చిగురుతొడిగి -
'ధర్మరక్షాప్రియదర్శనుం'డగు అశో
కుని చల్వ నాల్గు దిక్కులకు ప్రాకి -
చను నహింసా లతా మతల్లిని మహాత్ము
డంచితమ్ముగ పూలుపూయించి నాడు
మాలలం గూర్చి భారతమాత కంత
సీమ నర్పించి దివికి వేంచేసెనేడు !!

బొలబొపూజీ

విషపాత్ర మెత్తి త్రావెడు 'మహాయోగి' కన్
గొనలలో తాండవించిన యహింస
హృదయేశ్వరిని వీడి కదలు 'ప్రేమ తపస్వి'
బరువుచూపుల పొంగిపారలు కరుణ
సిలువపై నిండు గుండెలు గ్రుమ్మరించు 'ద
యామూర్తి' నుదుట పారాడు శాంతి
శిరసువంపక స్వేచ్ఛకొరకు పోరాడు 'వీ
రాగ్రణి' హృదయాన నలరు దీక్ష
ఏకమై - భారత ప్రజానీక పూర్వ
పుణ్యసంపత్తి పొత్తిళ్ళ పొదుపుకొన్న
పుత్తలీబాయి ప్రక్కలో నొత్తిగిల్లె
పోరుబందరులో నొక్క పురిటియింట !!

మహాప్రస్థానము

ఏ మహాత్మ ప్రేమహృదయ ముప్పొంగెనో
కరుణ వారిరాశి గట్లుతెగెనొ !!
పొర్లిపారుచుండె బిర్లాగృహమునుండి
జమునవైపునకు ప్రజాస్రవంతి !!

రత్నశిఖరి మీద రాయంచయే కాదు
చెట్టుమీద పరిగపిట్ట కూడ
వెక్కివెక్కి యేడ్చె వేడి బాష్పాలతో
సాగిపోవు "బాపు" శవము గాంచి

శాంత్యహింస లనెడు శస్త్రాస్త్రములు దాల్చి
సత్యకవచ మొడల సంతరించి
దండు నడపి నట్టి దండి సత్యాగ్రహి
కదలుచుండె శాంతి సదనమునకు !!

ఆగ్రహము లేదు - కలది సత్యాగ్రహంబె!
ఏ గృహము లేదు - కలది కారాగృహంబె!
దేశమున కెల్ల సత్య సందేశ మతడు -
లోకమునకెల్ల నవనవాలోక మతడు -

సత్యసహకారమున కహింసా లతా మ
తల్లికను మెల్లమెల్లగా నల్లుజెట్టి
పూలు పూయించి తేనెలు జాలువార్చు
కర్మచంద్రుడు మనకింక గానరాడు !!

నయనములు మూసికొని బోసినవ్వుబాబు
తల్లి ప్రక్కన నా డొత్తిగిల్లె నట్లు ;
నయనములు మూసికొని యమునానదీ మ
తల్లి ప్రక్కన నే డొత్తిగిల్లె నిట్లు !!

బాపు - ప్రియబాపు - భారత పారతంత్ర్య
బంధములు బాపు మా ప్రియబాపు - నేడు
పాంచభౌతిక దేహ మర్పించుచుండె
కొడుకు లంటించు నీ యగ్నికుండమందు !!

నెత్తురులు చింద తన మొండి కత్తితోడ
దేశమును చీల్చె నా 'ఖాయిదేఆజాము'
మంచిగందంపు చెక్కల మధ్య నేడు
భగ్గు మని మండుచుండె మా బాపు గుండె !!

చేతికట్టువీడి చెప్పులు విడనాడి
కదలిపోయినాడు గాంధితాత !
'ఎగుడు దిగుడు' లేని 'హెచ్చుతగ్గులు' లేని
'తేళ్ళు ముళ్ళు' లేని దేశములకు.

ప్రాక్సతీ స్వర్ణగర్భాన ప్రభవమంది,
తమ్ములను లేపి, నూత్నచైతన్య మొసగి,
ధ్వాంత మెడబాపి, స్వాతంత్ర్య కాంతు లిడిన
'భువనబంధుడు' పశ్చిమాంభోధి గుంకె.

ప్రతికి పేరు ప్రతిష్ఠలు బడయలేక
చచ్చి గొప్పవా రగుదురు చాలమంది -
ప్రతికియుం జచ్చియును ఈ ప్రపంచమందు
మూడు కాలమ్ములకు మహాత్ముడవు నీవు !!

దివ్యమూర్తి

విచ్చేయుచున్నాడు ! విశ్వసౌభ్రాత్రమ్ము
సాధించుకొన్న "దీక్షాతపస్వి"
దయచేయుచున్నాడు !! ధర్మమే జయమన్న
కర్తవ్యమును దెల్పు 'కర్మయోగి'
వేంచేయుచున్నాడు !! వీరభారతశక్తి
చాటిచూపిన 'బోసినేటిబాబు'
వచ్చుచున్నాడు !! నల్వదికోట్లప్రజలకు
మేలుకోలిడిన 'వైతాళికుండు'
దర్శనమొసంగుచున్నాడు ! స్పర్శమాత్ర
పతితపావనుడగు 'విశ్వబాంధవుండు'
"రండు రం" డంచు పువ్వులదండ లూని
దేవతలు మింటిపై బారు తీర్చినారు.

స్వర్గీయ బాపు

వీడలే! దక్షణాఫ్రికా ప్రభుత్వంబును
మూడూపు లూపిన 'ముసలి తాత'
ఇతడేనటే! జగత్త్రితయమ్మునకు సత్య
సందేశమందించు 'శాంతిదూత'
ఈతండటే! ప్రజాస్వాతంత్ర్య రథమును
కదలించు 'విశ్వమంగళ విధాత'
ఈయనేనటె! యూరపీయుల తబ్బిబ్బు
సలుపు 'సత్యాగ్రహ సమరనేత'
అంచు నీ దివ్యమూర్తి దర్శించు కాంక్ష
పూలదోసిళ్ళతో వేల్పు పూవుబోండ్లు
గుములుగూడిరి స్వర్ణసౌధములమీద -
స్వర్గవీథుల నీ తేరు సాగువేళ.

బాష్పాంజలి

ఎత్తిన కత్తి కాత్మ బలియిచ్చెడు మేకల పాటు ద్రావు నీ
మెత్తని చిత్తమందు కుసుమించిన కమ్మని సన్నజాజి పూ
గుత్తి పరీమళమ్ము లనుకొందుకు సత్య మహింస—నేడు నీ
వొత్తిగిలన్ మహాత్మ! భరతోర్విని వానికి దిక్కుగల్గునే!!

ఒక్క డదృష్టవంతు డయయో! భరతావని లేకపోయెనే
లెక్కకు - ఈ భయంకర మలీమస కర్మ జగచ్చరిత్రలో
నెక్కకపోదు - ఇందు జనియించిన ముందుతరాలవాకు మా
రక్కసి చర్యకుఁ తమ శిరమ్ములు వంచకపోరు సిగ్గుసఁ.

ఏమయ్యా! మిహికాచలేశ్వరుడ! నీ వెన్నాళ్ళనో యుండి ఈ
సీమాంతమ్మున నిల్చిచూతువుగదా శీర్షంబు పైకెత్తి - క్షో
ణీమధ్యమ్మున నెచ్చటేని ఎపుడేనిన్ 'బాపుజీ' వంటి ని
ష్కామ ప్రేమతపస్వి పుట్టినె - అహింసా బ్రహ్మతేజస్వియై.

పురోగమనము

నీ చరిత మ్ము దాత్త రమణీయ ము ; మా కు స్వతంత్ర భావనా
రో చిరహర్మ ఖంబుల పురోగమనమ్ములు నేర్పి శృంఖలా
మో చన మా చరించిన య మో ఘతపస్వివి ! నీకు గల్గె వీ
రో చితమైన మృత్యువు-మ హో జ్జ్వలమ ల్ భవదీయ సాధనల్ !!

నలువది కోట్ల తమ్ముల మనమ్ముల నల్వది కోట్ల జ్యోతులు
జ్వలిత మొనర్చి, చీకటులు వాపితి వీవొక పెద్ద జ్యోతివై -
వెలుగులు జిమ్ము అభ్యుదయ వీథుల ముందుకు సాగుచున్న మ
మ్ముల విడనాడి స్వర్గ పథముల్ వెలిగింపగ నేగితే ప్రభూ !

ఏ లోకమ్ముల నెందు నుండినను గానీ చల్లనైనట్టి నీ
యా లోకంబుల మా పయిం బరపు మన్నా ! అన్నతమ్ముల్ వలెన్
మా లో మేము విభేదముల్ మరచి ప్రేమ స్నిగ్ధ జాతీయ పం
థా లో ముందుకు సాగిపోయెద మహింసా జ్యోతి రోచిస్సులన్ !

స్వచ్ఛందజాతి

మన జాతీయత మంటగల్పుకొని, నిర్మర్యాద నీచ ప్రవ
ర్తనకుఁ లోబడి, పారతంత్ర్యమునకుఁ దాసుండవై, నీ పురా
తన విజ్ఞాన విశేష శేముషు లసత్యంబంచు శంకింపగా
జనునే? నీ ప్రియ భారతావని ప్రపంచఖ్యాతి నార్జింపదే !!!

అచ్చపు చీకటింట్ల బొరలాడుచునుండ ప్రపంచ మెల్ల - నీ
పచ్చనితల్లి గుమ్ములపై వెలిగెన్ మణి దీపికల్ !!! కనఁ
వచ్చిన ఖండఖండములవారికి కోరికి దీరునట్లుగా
బిచ్చము పెట్టె 'భారత సవిత్రి' ప్రియంబున రెండు చేతులన్ !!

చచ్చిన జాతికాదు-మరి చావదు వేయి యుగాలకైన-వె
న్నిచ్చినజాతి కాదు - పరువెత్తు విరోధిని బిల్చి కౌగిటఁ
గ్రుచ్చినజాతిరా యిది ! మరుత్తరు శాఖలతోడ హాయిగా
అచ్చనకాయ లాడుకొనెరా ! మన కీర్తిలతా మతల్లికల్ !!

ఇ • శ్రీ

విజయశ్రీ

ప్రతులకు

రామా పబ్లిషర్స్

ప్రొ, రామా బైండింగ్ వర్క్స్

కందులవారి వీధి, విజయవాడ

విజయశ్రీ

జంధ్యాల పాపయ్యశాస్త్రి
"కరుణాశ్రీ"

కరుణశ్రీ కావ్యమాల
అమరావతి

సర్వస్వామ్యములు రచయితవి
సప్తమ ముద్రణము ౧౦౦౦ ప్రతులు

మూ ల్య ము
రూ పా యి పా వ లా

జనరల్ ప్రింటర్సు
మారీసుపేట, తెనాలి
మే ౧౯౫౧

ప్ర స్తా వ న

ఎన్ని మారులు చదినినా తనివితీరని గ్రంథం మహాభారతం. చదివిన కొద్దీ చవులూరించే వీరభారత గాథ అది. అది కేవలం కౌరవ పాండవ ఇతిహా సమే కాదు; ధర్మశాస్త్రమూ, నీతిశాస్త్రమూకూడాను. ఆంధ్ర మహాభారత రచయితలలో ప్రప్రథముడైన నన్నయభట్టారకుడే చెప్పాడు, ఏమనంటే—

ధర్మశాస్త్రజ్ఞులు ధర్మశాస్త్రంబని, యధ్యాత్మ విదులు వేదాంత మనియు
నీతివిచక్షణుల్ నీతిశాస్త్రంబని, కవివృషభులు మహా కావ్య మనియు
లాక్షణికులు సర్వలక్షణం బనియును, నైతిహాసికు లితిహాస మనియు
పరమ పౌరాణికుల్ బహుపురాణ సముచ్చ, యంబని మహి గొనియాడుచుండ
వివిధ వేద తత్వవేది వేదవ్యాసు డాదిముని పరాశరాత్మజుండు
విశ్వసన్నిభుండు విశ్వజనీనమై పరగుచుండజేసె భారతంబు

అని. అందువల్ల మహాభారతం ఒక విజ్ఞానకోశమే. అది తెలుగులోనికి పరి వర్తన అయిన నాటినుంచి నేటివరకు తెలుగువారి కది ఒక ధార్మికదర్శనం; నీతిముక్తావళి; తత్వశాస్త్రం. ఆంధ్రమహాభారతమే ఆంధ్రజాతి సభ్యతకు పునాదులు లేసిందంటే అతిశయోక్తికాదు. ఆంధ్రసంస్కృతికి ఆంధ్రమహా భారతము ప్రధానప్రాతిపదిక. భాగవతం మినహాయిస్తే ఆంధ్రదేశం అంతటి లోనూ రామాయణానికంటె కూడా మహాభారతానికే ఆదర, ప్రచారాలు ఎక్కువ. భారత భాగవతాలలో కూడా దేనికి దేశంలో మొగ్గో చెప్పడం కష్టమే. భారతం పురాణం చెప్పించడం ఆంధ్రదేశంలో ఇప్పటికీ వుంది. తెలుగువారిలో భారతం ఇంటి పేరు గలవారు కూడా వున్నారు. అది

పారుషనాము మే. భారతం పురాణం చెప్పడంలోనో, మహా భారత రహస్యాలు వివరించి వ్యాఖ్యానించడంలోనో వారికిగల ప్రజ్ఞనుబట్టి ఆ యింటిపేరు కలిగివుంటుంది

ఆంధ్ర మహాభారత ప్రభావం ఇప్పటికీ తెలుగువారిమీద మాసిపోనూలేదు; తగ్గిపోనూలేదు. ఇప్పటికీ మహాభారతగాథ అనేకులను ఉత్సాహపూరితులనూ, ఉద్వేగపూరితులనూ చేస్తూనేవుంది. భారతగాథలు కథలుగా, నవలలుగా, నాటకాలుగా, నాటికలుగా, హరికథలుగా, పాటలుగా రచింపబడి తెలుగుదేశంలో నేటికీ ముమ్మరంగా ప్రచారంలో వున్నాయి. చదువు వచ్చినవారికే కాకుండా చదువు రానివారికికూడా, స్త్రీ పురుషులలో వృద్ధులకు, యువకులకు, బాలబాలికలకుకూడా కౌరవ పాండవగాథ తెలుసు. ఈ మహాభారతగాథతోడి పరిచయం చదువుకొన్న వారికే కాకుండా చదువురానివారికికూడా ధర్మరహస్యాలు తెలియజెప్పి వారి జీవితాలను చక్కదిద్దింది. తెలుగునాటిలో ధర్మరాజు ధర్మపరాయణత, భీముడి వేగిరపాటు, అర్జునుడి చురుకుపాటు, నకుల సహదేవుల ఉద్వేగము, శ్రీకృష్ణుడి నీతికౌశలము ఎందరెందరిని ఆశ్చర్య, ఉద్రేక, ఉత్సాహపూరితులను చేసినవో; పాంచాలి పడిన భంగపాటు, కౌరవుల దుస్తంత్రాలు ఎందరెందరిని విచార క్రోధావేశ పరులను చేసినవో!

మహాభారతగాథ అంతా మనవృత్తమే; మానవ ఇతిహాసమే, రాజ్యం పంపకంకోసం పాళ్ళుతెగక పోరాడుకొన్న రాచబిడ్డలు అన్నదమ్ముల కలహం. నేటికీ భారతవృత్తం మనకు సజీవగాథే. కొన్ని సందర్భాలలో అర్జునుడు నివాత కవచ సంహారంచేసి ఇంద్రుడికి హితముకూర్చి అమరావతికి వెళ్ళి అతడి అర్ధాసనం అధిష్ఠించడం, శ్రీకృష్ణుడు విస్వరూపం దాల్చడం

వంటి అప్రాకృత, దివ్యచర్యలు చేసినట్లు మహాభారతంలో చెప్పివున్నప్పటికీ, మొత్తంమీద కౌరవులు పాండవులు కూడా రాగద్వేషాలకూ, క్రోధ మోహ భయ లోభ మద మాత్సర్యాలకూ లోనై మనలాగే ప్రవర్తించిన వట్టి ప్రాకృతులే. నేటికీ మన కుటుంబాలలో భీములూవున్నారు. దుర్యోధనులూ వున్నారు. మన రాజకీయాలలో మన కుటుంబాలలో సంభవించే కలహాలలో కౌరవపాండవగాథల ఛాయలూ చహరాలూ కనబడుతాయి.

మహాభారతగాథ అంతటిలోను ఉద్యోగపర్వంలో శ్రీకృష్ణరాయబార ఘట్టం హృద్యాతి హృద్యమై మన మనస్సును ఆనందంతో కదళింపజేస్తుంది. తిక్కన సోమయాజి ఈ రాయబారఘట్టాన్ని రసోల్బణముగా రచించి దౌత్యం నడపడంలో శ్రీకృష్ణుని చాకచక్యము, రాజ్యతంత్రజ్ఞత చాలా చక్కగా చూపించాడు. కౌరవసభలో అధికార దుర్మదాంధత, స్వార్థలాభము, రాజ్యలోభము, గురుజనవాక్య ధిక్కారములవంటి మానవ సహజములైన వికారాలు పైశాచిక నృత్యం చేసిన సందర్భం ఇది. కౌరవ సభకు పాండవుల పంపున తెమ కయిదూళ్ళయినా ఇస్తే చాలునని సంధి ప్రయత్నంమీద దూతగా వెడతాడు శ్రీకృష్ణుడు. అయిదూళ్ళు కాదు కదా, సూదిమొన మోపినంత నేలనయినా ఇవ్వడానికి నిరాకరించడమే కాకుండా చివరికి దూతను బంధించి చెరబట్టుట కుద్యమించి విఫలీకృత మనోరథులవుతారు సుయోధనాధులు. అంతటితో వారి కండకావరమూ తెలిసి వస్తుంది; సంధిరాయబారమూ భగ్నమవుతుంది. రారాజు ఎంతటి అధికార గర్వప్రమత్తుడైతేమాత్రం, ఎంతటి బలపరాక్రమ సంపన్నుడైతేమాత్రం సంధిపొసగకపోయిన తరువాత తమకు న్యాయంగా రావలసిన రాజ్యం రాకపోతే రాచపాడి పోనాడి వూరకుంటారా పౌరుష ప్రతాప మహితులైన పాండునందనులు—రాచబిడ్డలు? సామముచేత చక్కబడని కార్యానికి ఇక

దండమే ప్రయోగం. యుద్ధం తప్పనిసరి అయింది. శ్రీకృష్ణ రాయబార ఘట్టంలో తిక్కనసోమయాజి పాత్రావిష్కరణలోను, రాజ్యతంత్రజ్ఞత లోను చూపిన నేర్పు అద్వితీయమైనది. ఏపాత్ర కాపాత్రకే ఒక విశిష్టత. నిండుసభలో దొరలందరి సమక్షాన అవమానింపబడిన మానవతి పాండుచక్ర వర్తికోడలు ద్రౌపది. అందరి పాత్రలు ఒకయెత్తు; ద్రౌపది పాత్ర ఒక యెత్తాను. పాండవులు యుద్ధసన్నద్ధులై సంగ్రామ రంగాని కవతరించడమే ఈ చిన్ని కావ్యం "విజయశ్రీ" లోని కథావస్తువు. తిక్కనసోమయాజి రాయబారఘట్టాన్ని వరవడిగా బెట్టుకొని వ్రాసిన రసవంతమైన కావ్యమిది.

ఈ "విజయశ్రీ" రచియించిన కవి "కరుణశ్రీ" అనే గుప్త నామము ధరించిన శ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు. వీరు ఇదివరకే చాలా కావ్యాలు వ్రాసి పేరు పొందారు. వీరి ఖండకావ్య సంపుటి "ఉదయశ్రీ" తెలుగునాటిని అలరించి, తెలుగు హృదయాన్ని ఆనంద వీచికలలో ఉయ్యాల లూగించింది. "ఉదయశ్రీ"కి సమానస్కంధము వీరి "అరుణకిరణాలు". "అరుణకిరణా"ల ప్రాతశ్శోభలో పరువులు పెడుతూ బయలుదేరింది వీరి "కరుణామయి". పాటల పాపాయి "కరుణామయి."

"విజయశ్రీ" వీరి నూతన కావ్యం. పాండవులు యుద్ధానికి సన్నద్ధులవడం ఈ కావ్యానికి వస్తువు. ఏమంత గొప్పవిషయమిది కావ్యవస్తువుగా స్వీకరించడానికి? అయితేమాత్రమేమి, కవి సొన్నారి. వస్తు వెంతటి సామాన్యమైన దయితేనేమి, అతనిచేతిలో దానికెక్కడలేని తీర్మా వస్తుంది. అందులో చాలా ఘటికుడు ఈ సొన్నారి "కరుణశ్రీ" నామాంచితుడు పాపయ్యశాస్త్రి. ఈ కవి ఈ యలంతి విషయాన్ని చేపట్టి చదివినకొద్దీ చవులూరించి హృదయాన్ని రంజింపజేసే భవ్యమైన దివ్యకావ్యముగా వెల

యించినాడు. విన్నాణముతో అద్భుతమైన శిల్పముచూపి మంత్రాలోచనం, స్కంధావారం, విషాదం, ప్రబోధం, విజృంభణం అనే అయిదు చక్కని చిక్కని రేకులుగా మలిచి సుమనో మనోజ్ఞముగా ఈ దివ్యకావ్యకల్ప ప్రసూనమును రచించారు శ్రీ శాస్త్రిగారు. గుణాలంకారాది కావ్య విభూతిని సంతరించుకొని ఈ రసకావ్యం ఆవిర్భవించింది. నేడు ప్రకటితము లవుతున్న నవ్యాంధ్ర కావ్యకుసుమాలలో విశిష్టతగల చక్కని మధుర సౌర్భ సుమ మిది. ఇందులో అచ్చటచ్చట ఒకటి రెండు దోషము లున్న ప్పటికి దోషజ్ఞులే కాని కావ్యరసాస్వాదనులైన రసికవతంసులు వాటిని పాటింపరు. ఈ కావ్యాని కీడువచ్చే ఖండకావ్యాలు తెలుగులో ఎన్నో లేవంటే అది అతిశయోక్తికాదు. అసలే ఇది భారతవీరకుమారగాథ సువర్ణాంచితమైనది; అందులోను శ్రీ పాపయ్య శాస్త్రిగారు కడునేర్పుతో ఈ కావ్యాన్ని నిర్మల గంగాప్రవాహముపలె అచ్చస్వచ్ఛము, మధురము, ఉద్దమనవేగాటోపము గల తమకు సహజమగు లలితమనోహరమైన చక్కని శైలిలో రచించారు. ద్రాక్షాపాకములోబడిన యిది యే సహృదయ హృదయాహ్లాదము కలిగింపదు? ఏ రసలుబ్ధుల కిది ఆస్వాద్యమై సుసేవ్యము కాదు? విశేష మేమంటే, ఇందలి పద్యము లన్నీ పండిత పామరుల నొక్కరీతి నలరించే రసగుటికలు.

ఈ కావ్యం చదివీ చదవగానే మన మనసుకు తట్టేది కవనమల్లుటలో కవికి గల చాతుర్యము. ప్రసన్న కథాకలితార్థ యుక్తిగల పదాలు ఏర్చి కవి రసజ్ఞుల కంజలిబట్టి గిలకరించి యిట్టె విక్షేపింపగా అవి తమకు దామై ఛందసూత్రములో కూర్పువడి, వృత్తాలుగా గీతికలుగా రూపొంది నట్టుంటాయి ఇందలిపద్యాలు. కాకపోతే ఏమిటీ క్రింది పద్యం చూడండి—

ఇమ్మన్నా డయిదూళ్ళు భీష్ముడు, గురుం డేదో విధిన్ సంధి కా
నిమ్మన్నాడు, విచిత్రవీర్యతనయుం డేలా విరోధమ్ము పో
నిమ్మన్నా, డటుమీద కర్ణుని మొగ మ్మీక్షించి పొండెమి పో
పొమ్మన్నాడు సుయోధనుండనుగుతమ్ముల్ రొమ్ములబ్బింపగన్.

ఇందులో భావం పదాల నేవిధంగా ఆకట్టుతూ తరుముకుపోయిందో. ఛందోవృత్తంలో పదాలు తమ స్థానాలలో ఆశ్రమముగా వెదకుకొంటూ వచ్చి నిలిచాయి. ప్రతి పద్యములోని భావమూ కొండ కోనలోనుండి వెలువడే ఓక సెలయేటిలాగ తనత్రోవ తాను అప్రయత్నముగాను, సుకరముగాను, మలచుకొంటూ పోయింది; ఏ గణ యతిప్రాసలూ దానిగతి కడ్డు రావు సరికదా దాని కలంకారప్రాయమే అవుతాయి. అవి వేని కవే ఒత్తిడికి త్రోవయిచ్చి భావాన్ని లోగొని ఒండొంటితో సమైక్యమై హృద్యతను భజించాయి. కావ్యములోని ప్రతి పద్యమూ ఇదేరీతి. కావ్యమంతా కథనరీతిలో నట్టు లేకుండా ఉద్వేగముతో ఉరవడితో నడిచిపోయింది.

ఈ కావ్యంలోని మరో గొప్పగుణం ఏమంటే, నిఘంటువులలోని మారు మూలపదాలు వెదకి పట్టివేయకుండా మనం సామాన్యంగా మాట్లాడుకొనే మామూలు మాటలతోనే రసం ఉట్టిపడేటట్టు శక్తిమహితమైన గొప్ప కవిత్వం చెప్పడం ఈ కవికి సహజంగా అలవడ్డ ప్రజ్ఞ. అన్నిశబ్దాలు మనకు పరిచయమైనవే, నిత్యవ్యవహారంలో వున్నవే తేలికవే. భావాన్ని ఎంత స్ఫూర్తితో బలంగా మలిచి మూర్తిమంతం చేస్తున్నాయో చూడండి;

ఆడుది యేడ్చి తెచ్చికొనినట్టి దయారస ధర్మభిక్షకై
గూడలు క్రుంగి కుంతికొడుకుల్ చెయి చాచుట యొగ్గు సిగ్గులన్
వీడుట కాదె? దేహి యని వేడుదురే పగవారి? నే డిటుల్
బూడిద పా లొనర్చితిమి పో అమృతాంశుకుల ప్రతిష్ఠలన్.

లెమ్ము ధనంజయా, విధి బలీయము! న్యాయము గెల్చు,నిల్చు స
త్యమ్ము, నశించు స్వార్థము, సదా యుగధర్మ మిదే గదోయి! క
న్నె మ్మిక నంత్యకాలమున నూర్వురు బిడ్డల తండ్రికైన పి
డ మ్మిడు దిక్కుగల్గ దకటా! గ్రహచారము తప్పివచ్చినన్.

మరోగుణము పద్యాలలోని హృద్యమైన సంభాషణశైలి. చూడండి ఈ క్రింది పద్యములు.

అంధుడు వృద్ధరాజట, మదాంధుడటే యువరాజు, రాజసం
బంధులు ద్యూతబంధులటె, మంచికి మార్గ మి కెట్లు? గాఢ గ
ర్వాంధ తమ స్తమస్వినుల స్వార్థపిశాచము గజ్జెగట్టగా
సంధిలునయ్య సంధి? కొనసాగునటయ్య నయప్రయత్నముల్?
హింస యొసర్పనంటివి సరే! మిము హింసల పా లొనర్చు వి
ధ్వంసక శక్తులందు దయదాల్చుట ధార్మికహింసకాదె? మా
కంసుని జంపి లోకముల కష్టము దీర్పనె? చెల్లునే? యస్మ
ద్మాంసము లెండ తిండికయి మాడుట రాచకొలమ్మువారికిన్?

ఈ విధంగా ఎన్ని పద్యాలయినా చూపవచ్చును. కావ్యమంతా ఇదే రీతి నున్నప్పుడు వేరే వాటిని ఎత్తి చూపడ మెందుకు?

ఈకావ్యము వీరరసప్రధానమైనది. అసలు కావ్యరచనకు తీసికొన్న ఘట్టమే అటువంటిది. సంధికార్యము విఫలమైనది. పాండునందనులలో ఒక్కధర్మరాజు తక్క మిగిలిన వారందరు కౌరవులమీద కారాలు మిరియాలు నూరుతున్నారు. సంధి విఫలమైనా అసలు సామంచేతనే కార్యం సాధించాలనే యత్నంలోవున్న ధర్మరాజు మాత్రం గురుబంధుజన సంహారా

నికి సుముఖుడు కాడు. కాని పరాభవానల దందహ్యమాన మానస పాంచాలి తనపతులను ఉపాలంభించి యుద్ధానికిపురికొల్పుతుంది. కౌరవుల రాజ్యముదాం గత తృష్ణ బాగా తెలిసివచ్చిన కృష్ణుడుకూడా ఇకదండోపాయంతక్క కార్య సాధనానికి వేరే ఉపాయం లేదనే నిశ్చయంలో వున్నాడు. చివరి కందరు యుద్ధం చేయడానికే నిశ్చయించి అందుకు తగిన సన్నాహం చేస్తారు. ఈ మంత్రాలోచన ఘట్టం రసవంతములైన పద్యాలతో హృద్యంగావుంది. ఈ ఘట్టంలోని పాంచాలి పాత్ర చాలాగొప్పది. ఆమె క్రోధోద్రిక్తఅయి తన పతులను వెగటుగాను వికటంగామ ఎత్తిపొడుస్తూ బరిమీద ఆడుత్రాచు లాగ శౌర్యాగ్ని విస్ఫులింగాలు చిమ్ముతూ బుసలు కొడుతుంది. ఆ సాధ్వి ఆడే ఒక్కొక్క మాటలో సెగలు పొగలతో కాలకూటవిషం గక్కుతూ వుంటుంది. ఆ విషం సెగకు తాళుకోగలవా రెవరు? ఆమె హృదయోద్వేగమూ, ఉద్రేకమూ గమనించండి.

భుజాగ్రముల్ పొంగ పురోగమింతురో!
ధ్వజాగ్రముల్ వంగ తిరోగమింతురో!
శరమ్ములక్ దాల్చి పరాక్రమింతురో!
కరమ్ములక్ మోడ్చి పరిక్రమింతురో!

ఏమి ఉద్వేగము, ఏమి ఉద్రేకము! సందర్భానుసారముగా ఇక్కడ వృత్తమే మారింది ఈ పద్యం చిత్రమైంది. అది చదువుతూవుంటే ఆ పాంచాలి హృదయంలోని భావోద్వేగ తరంగాలు ఒకదాని నొకటి తరుముకొనిపోతూ ఉవ్వెత్తుగా లేస్తూ పడుతూ లయబద్ధమైన ద్రుతగతితో సాగిపోతూన్నట్లు స్ఫురిస్తుంది మనకు. ఇదే కళ. కవిచాతుర్యము. చూడండి. ఈ యెత్తిపొడుపు — ఎంత నిష్ఠురమైనదో.

త్యజింతురో క్షాత్రకుల ప్రతిష్ఠలన్ !
భజింతురో శాత్రవ పాదపద్మముల్ !
భుజింతురో కానల కందమూలముల్ !
సృజింతురో తాత్విక ధర్మశాస్త్రముల్ !

ఈ విధంగానే విషాదఘట్టంలోకూడ కవి వృత్తం మార్చివేశాడు: ముత్యాల సరాలు వాడాడు. సందర్భానుసారంగా ఔచితిని అనుసరించి వృత్తం మారుస్తూ వచ్చిన కవి ప్రతిభను కొనియాడవలసిందే.

పాంచాలి చెప్పిన ఈ కింది పద్యం చూడండి ఎంత సొంపుగా వున్నదో. ఎంతటి సమయోచితంగా వున్నదో.

"భారత వీరమాత" యగు భాగ్యము ప్రాప్తిలు అత్తగారి కం
చూరక చూచి చూడనటు లుంటిమి; ఆమెకు దక్కకున్న ఆ
గౌరవలక్ష్మి లభ్యమగుగాక కుమారుల గన్న మా హిడిం
బా రమణీలలామకు సుభద్రకు ఈ ద్రుపదాత్మజాతకున్ !!

ఈ కావ్యంలో చాలా వున్నాయి యిటువంటి ముచ్చటైన పద్యాలు మచ్చుకు ఇదొకటి !

రారా జెవ్వడు రాజ్యమేలగ? నపార స్ఫార దోస్సార మే
పారన్ రాజుల నాజులన్ గెలిచి నా డాసేతు శీతాచల
క్ష్మారాజ్యమ్మును పాండురాజు వెలయింపన్, నే డిటుల్ కొల్వ్యుసం
గారమ్మై కుడువంగ బుట్టిరి దొరల్ గాంధారి గర్భమ్మునన్ !!

మొత్తంమీద రసగ్రహణపాకీణులైన పాఠకులకు ఆనందదాయకమైన కావ్యమిది. కొందరు ఈ కావ్యంలోని పద్యాలు ఒకటి రెండు వేలవంగా

వున్నవని, జిగి బిగి కొన్నిట తక్కువైనదని, పదముల కూర్పులో కొన్నిట మార్పు అభిలషణీయమని అంటే అనవచ్చును. కాని దోషజ్ఞుల విమర్శకు గురికాని కవులూలేరు; కావ్యాలూ లేవు. ఆధునిక కాలంలో కాని, ప్రాచీన కాలంలోగాని, ఏమాత్రమూ దోషాలూ లోపాలూలేని కావ్యాలు అరుదు. అయితే రసజ్ఞులైనవారు కవిప్రతిభనే, ప్రజ్ఞనే గమనించి రసగ్రహణమే చేస్తారు.

శ్రీ పాపయ్యశాస్త్రిగారు ముందుముందు ఇంకా గొప్ప కావ్యాలు వ్రాసి ఆంధ్రభాషాయోష నలంకరించి యశస్సు సంపాదింతురుగాక అని కోరుతున్నాను.

— మల్లంపల్లి సోమశేఖర శర్మ,
ఆంధ్ర విశ్వకళా పరిషత్తు.

ప్రియమిత్రుడు సహృదయుడు

ఆదిపూడి శ్రీకృష్ణమూర్తికి

పచ్చని పంటచేల పయిపై పరువెత్తెడి పైరుగాలితో
ముచ్చట లాడుచుక, హృదయముల్ పులకింపగ, నాడు కోతికొ
మ్మచ్చుల నాడుకొన్న మనమైత్రి క్రమమ్ముగ వృద్ధిజెందుచుక
వచ్చి, హిమాలయాగ్రములపై నిలిపెక మనజీవితమ్ములక !!

చల్లగ—మెల్లగా—కరిగి సాగిన ఈ యమునా స్రవంతిలో
వెల్లువ గొన్న సౌమనసవేదన రాగము దిద్దుకొన్న ఏ
పిల్లనగ్రోవి మోవి మురిపించెనొ ! నీ హృదయంబు నిండు జా
బిల్లివలెక ద్రవించి కురిపించిన దీ నవసౌధ దీధితుల్ !!

ఓయి స్వతంత్రతాప్రియ ! మహోదయ ! నా విజయారుణారుణ
శ్రీ యిది స్వీకరింపుము విశృంఖల హస్తములక, వినూతన
చ్ఛాయలు దిద్దునింక మన సౌహృదలక్ష్మికి వీరభారతా
మ్నాయ విరాట్ కిరీట సుషమా సుమనోజ్జ్వలము లీ ప్రభాతమున్! !

విజయోత్సవం

భారతం పాఠం చెప్పేనాడే విజయుడిమీద విశేషమైన ఆదరమూ అభిమానమూ కలిగించారు గురుదేవులు "కుప్పా శ్రీ ఆంజనేయ శాస్త్రిగారు"

ఆంధ్రక్రైస్తవ కళాశాలలో పనిచేస్తున్నరోజుల్లో ఒకనాడు నాలో ప్రతిధ్వనించిన "ఆత డజాతశత్రుడు మహాత్ముడు శాంత తపస్వి"అన్నహృదయస్పందనాన్నిగుర్తించి ఆరాత్రే"విజయశ్రీ"కి అంకురార్పణ జరిపించారు పూజ్యమిత్రులు "నండూరి రామకృష్ణ మాచార్య"

ఆనాడు ఆంధ్రవాఙ్మపత్రికల్లో భాగతుల్లో ఆ వ్యాసాల బింకమూ, మిసాల పొంకమూ చూచి ఏ సాహితీతపస్వి సౌజన్య సౌహార్ద్రాలకోసం ఈవిశ్వశ్లాఘేవాణ్ణో ఈనాడు నా అదృష్టం కొద్ది ఈ కావ్యానికి సువిస్తరమైన ప్రస్తావన వ్రాసిపెట్టారు ఆ మధుర హృదయులు "మల్లంపల్లి సోమశేఖరశర్మగారు"

ఆక్కడక్కడా చక్కనిసలహాలిచ్చి సముచితమైన సహాయం చేశాడు అభ్యుదయ మిత్రుడు మా "ప్రయాగ"

అనురాగంతోనూ అభిమానంతోనూ ఇచ్చిన ఈ ఉపహారాన్ని హృదయ పూర్వకంగా స్వీకరించాడు ప్రియవయస్యుడు "ఎ. యస్. కృష్ణా"

మళ్ళీ ఈ పుస్తకాన్ని కోరినట్లు ముద్దుగా ముచ్చటగా ముద్రించి యిచ్చారు. "జనరల్ ప్రింటర్స్‌వారు"

ఈ విజయోత్సవ సమారంభంలో పైవారందరికీ వందనాలూ అభినందనాలూ అర్పిస్తూ సహృదయులైన సోదరీ సోదరుల వీరహస్తాలకు "విజయశ్రీ" అందిస్తున్నాను.

కరుణశ్రీ

విజయశ్రీ

★ మంత్రాలోచనము

★ స్కంధావారము

★ విషాదము

★ ప్రబోధము

★ విజృంభణము

కురుక్షేత్రం

జీవితమే ఒక చిత్రమైన కురుక్షేత్రం. ఈ రంగంలో ఆస్తికీ నాస్తికీ, శాంతికీ క్రాంతికీ, ధర్మానికీ అధర్మానికీ, న్యాయానికీ అన్యాయానికీ అహరహమూ—అనుక్షణమూ—భయంకర సంగ్రామం జరుగుతూనే వుంటుంది.

ఒకప్రక్క స్వాతంత్ర్యాకాంక్ష నాలుకలు చాచుకొని ఆవేశంతో అనర్గళంగా ముందుకు తోసుకువస్తూవుంటే మరో ప్రక్క స్వార్థపరత్వం పాదాలు నాకే సామ్రాజ్యతృష్ణ మేడలుకట్టుకొని, గోడలు పెట్టుకొని తలుపులు బిగించు కూర్చుంటుంది.

అధర్మం ధర్మంమీద విజృంభించింది. రారాజు అత్యాచారాలు ఆరోజుకారోజుకు మేరమీరాయి. కర్రలతో బాదించాడు; కత్తులతో పొడిపించాడు; కాళ్ళు చేతులు బంధించి కారాగారాలలో త్రోయించాడు; అన్నంలో కాలకూటంకలిపించాడు; ఏమరి పాటున కొంపలకు నిప్పు పెట్టించాడు; మసిపూసి మాయ పాచికలువేసి రాజ్యంకాజేసి పాండవుల్ని అరణ్యాలకు పంపించాడు; పాంచాలిని పరాభవించటంకోసం పైకిలేచిన దుశ్శాసన హస్తాలు పైశాచిక ప్రభుత్వానికి ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచిపోయినై.

వనవాసాలు అజ్ఞాతవాసాలు గడిచినై; సంధులూ సంప్రదింపులూ విఫలమయినై; పాండవపరిషత్తుసమావేశమయింది—ఇక ముందు కర్తవ్యం?!?

అవిగో-పాంచాలీకచాంచలాలు రేగుతున్నై-పాంచజన్య దేవదత్తాలు మ్రోగుతున్నై—భీమగదాదండం ప్రతిపక్ష వక్షస్థలాలపై ప్రళయ తాండవం చేస్తున్నది.

అదుగో భారతవీరుడు పార్థుడు గాండీవం ఎక్కుపెడుతున్నాడు. మహాత్ముడుమధుసూదనుడు అశ్వాల్ని ఆదలిస్తున్నాడు. ఆ జగన్నాథ రథచక్రాలు ముందుకు పరుగెత్తుకు పోతున్నై—

తప్పదు—ధర్మం జయిస్తుంది-నరుడు విజయుడౌతాడు—"విజయశ్రీ" పరగీతులతో భారతమాతకు నీరాజనా లెత్తుతుంది.

మంత్రాలోచనము

శ్రీకృష్ణుడు

ఐనవి సంధిసంబరము, లాయుధముల్ ధరియింపు డయ్యా! దా
పైనది వీరభారతమహారణరంగము—సర్వథా వృథా
యైనవి సంప్రదింపులు—తథాస్తు—జయాపజయమ్ము లేవి యె
ట్లైనను మీవి వారివి గుణాగుణముల్ గ్రహియించి రందరున్!

పోయితి మీకు వారికిని పొందు పొసంగు నటంచు—వ్యర్థమై
పోయెను నాశ్రమల్, ముదిరిపోయెను జేనికి స్వార్థబుద్ధి—యే
మో యొక వాడిసూదిమొన మోపిన నేలయు చేతిమీదుగా
నీయడటే కురుప్రభు, డదెక్కడి రక్కసి రాజ్యకాంక్షయో!

ఇమ్మన్నా డయిదూళ్ళు భీష్ముడు, గురుం డేదో విధిన్ సంధి కా
నిమ్మన్నాడు, విచిత్రవీర్యతనయుం డేలా విరోధమ్ము పో
నిమ్మన్నా, డరకంట కర్ణునిమొగ మ్మీక్షించి పాండేమి పో
పొమ్మన్నాడు సుయోధనుం డనుగు తమ్ముల్ రొక్కులుబ్బింపగన్

సిరులుదొరంగి ఘోరవనసీమల చెట్టుకు పుట్టకొక్కరై
యరిగినవారు మీరు—దొరలై తెకతేరకు తీయగా తినన్
మరిగినవారు వా—రలతిమాటలతో ధర యిత్తురయ్య! సం
గరమున ఖడ్గముల్ గదలు గాండివముల్ చెరలాడకుండగన్!

కాలుని దున్నపోతు చిరుగంటల మ్రోతకుగాక సంధి వా
క్యాలకు వీనులొగ్గుదురటయ్య! మదాంధులు; గుండెగాలమై
యాలము దాపురించె దొర లందరకున్; కురుచక్రవర్తికిన్
కాలము దాపురించె—కలకాలము నిల్చునె మాయసంపదల్!

బంధింపన్ దలపెట్టినారు—బహుథా ప్రచ్ఛన్నులై వచ్చి ని
ర్బంధింపన్ సమకట్టినారు చెరసాలన్—చాలులే సంధి సం
బంధ మ్మీక్రియ బంధనమ్ములకు త్రోవందీసె—భీమన్నచే
బంధింపంబడుగాక! కృష్ణ కబరీ బంధ మ్మవశ్య మ్మికన్!!

భీముడు

త్రాటం గట్టిరి, నీటనెట్టిరి, విషాక్త మ్మన్నమున్ బెట్టి, రే
చేటుక వాటిలకున్క్రి కష్టపడి కాశీయాత్ర కంపించి, ర
చ్చోటక కొంపకు నిప్పువెట్టి, రడవుల్ చుట్టించి, రీ సాధ్వి కా
పాటుల్ గూర్చిరి, భాగ మీయమని రబ్బా యెంత సౌభ్రాత్రమో!

అవి యొక వీరభారత కులాంగన కంటి కవోష్ణ బాష్ప బిం
దువులు ధరిత్రిపై గురియు దుర్భర దుస్సహ దుర్దినమ్ము !! ల
య్యావి పదిమందిలో ఒక మహాసతి పైటచెరంగు బట్టి ధ
ర్మువు దిగద్రావి రక్కసి ప్రభుత్వము లాగిన దుర్ముహూర్తముల్!!

అది పాంచాలి పటాంచలాపహరణమ్మా! కాదు-తత్ కౌరవాం
త్య దిన ప్రేత పటాంచలాహరణమే యౌ నూటికి న్నూరు పా,
ళ్ళది వేణీగ్రహణమ్మకే! వికట నృత్య న్మృత్యుకాంతా భయ
ప్రద పాణిగ్రహణమ్ముగాక-భవితవ్యం బెంత దుర్లంఘ్యమో!

ఆశ్చర్య మ్మవిలంఘ్యమౌ విధికృత మ్మట్లుండెగాబోలు! నా
దుశ్చారిత్రులు దుర్విదగ్ధులు దురాత్ముల్ దుర్మదగ్రస్తులై
పశ్చాత్తప్తులు గారు నేటికిని-త త్పాపంబు బాపంగ ప్రా
యశ్చిత్తమ్మిక లేదు — మారణమహాయజ్ఞమ్మె కర్తవ్యమౌ!

రారాజెవ్వడు రాజ్యమేలగ? నపారస్ఫారదోస్ఫార మే
పారన్ రాజుల నాజులం గెలిచి నా డాసేతుశీతాచల
క్ష్మారాజ్యమ్మును పాండురాజు వెలయింపన్; నేడిటుల్ కొల్వ్యసిం
గారవ్మై కుడువంగబుట్టిరి దొరల్ గాంధారి గర్భమ్మునన్!

అబ్ధిప్రావృతమేదినీవలయరాజ్యమ్మెల్ల మాతండ్రిచే
లబ్ధమ్మయ్యెను గ్రుడ్డిరాజునకు—ఏలా నేడు చేజారు నా
లుబ్ధాగ్రేసరచక్రవర్తి? అయిదూళ్లుం గూడ నీయండు—ప్రా
రబ్ధం బింతకు నెట్టులున్నదొ యుపేంద్రా! వృద్ధజీవాలకుఁ!

అర్జునుడు

దొరల మటంచు రాజసముతో తెగనీలిగి పట్టుపాన్పులన్
పారలు దినమ్మ లన్నియునుబోయె-ప్రపంచము మారిపోయె-ము
ష్కరులు కురూద్వాహుల్ మనలగాదని కన్నులు మూసికొన్న-ఈ
నరుని కఠోరగాండివనినాదము నిద్దురమేలుకొల్పెడిఁ!

పచ్చని రాజవంశవని పాడొనరింప జనించినాడు కా
ర్చిచ్చయి తోడు-సూతసుతు స్నేహము దానికి తోడు-గాడుపై
కచ్చెలు రేపె నా శకునిగాడు-రగుల్కొనెమంట మింట, వి
వ్వచ్చుని వింట నింక శరవర్షము తప్పదు విశ్వశాంతికై!

ఆ సభయందు రాసభము లట్లు లతాంగిని లాగి కౌరవుల్
సేసిన చేతలుఁ, గుటిలజిహ్వాలు కూసిన కూతలుఁ, మదిఁ
గోసిన కోతలై చెరగకున్నవి, వారికి వారివారికిఁ
ద్రాసిన త్రాతలే యిక ధనంజయశాతశరప్రహూతముల్ !

దండము దక్క నొండొక విధానము వారల కింపుగాదు; కో
దండము దక్క కొండొక విధమ్మున కర్జములేదు; మత్త వే
దండము మాడ్క దివ్యబలధాముడు భీముడు దీప్తిమద్గదా
దండము ద్రిప్పునప్పుడుగదా కదనానకు కాలుద్రవ్వుటల్ !!

పుట్టినదాది రాజుకొనిపోయిన ద్వేషదవాగ్నికీలలఁ
చిట్టెముగట్టె కౌరవుల శీర్షములన్నియు—తప్పదింక డీ
కొట్టక వారికిఁ, చితుకగొట్టక తప్పదు మాకు—సంధి కూ
కొట్టుదురయ్య! మేలిపలుకుల్ చెవి బెట్టుదురయ్య బెట్టిదుల్ !

అంధుడు వృద్ధరాజట! మదాంధుడటే యువరాజు ! రాజ సం
బంధులు ద్యూతబంధులఁట ! మంచికి మార్గ మి కెట్లు? గాఢ గ
ర్వాంధతమస్తమస్వినుల స్వార్థపిశాచము గజ్జెగట్టగా
సంధిలునయ్య సంధి? కొనసాగునటయ్య నయప్రయత్నముల్ ?

నకులుడు

ఘోషయాత్రనాటి కురుకులాభరణంబు
తెలిసికొనడొ పాండవుల బలంబు!
చిత్రసేన కఠినశృంఖలాసంబద్ధ
హస యుగళి గురులయిన లేవొ!

విరటు గోగణంబు మరలించు సమయాన
పార్థువలన వీపు బ్రద్ధ లగుట
మరచిపోయిరేమొ కురువీరు, లొకమాటు
తలలు తవుడుకొన్న తలపువచ్చు.

కుటిల కీటక శత విషచ్ఛటల జిక్కి
కురుకుల లతామతల్లి సుందరత తరిగె!
కుంతికొమరుల ముత్యాల గొడుగునీడ
నేడు మొదలది నవనవలాడుగాక!

కలిత లలితేందుకుల యశోగ్రసన కాంక్ష
కలలుగనుచున్న దా నూరుతలల వాగు;
పడగ పైకెత్తి నెత్తిపై బడకమున్నె
పుడమి బడు వీర నకుల విస్ఫూర్తిలోన!

సహదేవుడు

దోసమెు మోసమో జరిగె ద్యూతము; గెల్చిరి వారు-దుష్ట దు
శ్శాసన హస్త మెత్తిన నృశంస ప్రభుత్వముముందు దాసియై
దోసిలియొగ్గి తెచ్చుకొనె ద్రౌవది రాజ్యము; దానికోసమై
చేసిన రాయబారము లిసీ! పస చాలని పాండునందనుల్!!

ఆడితి మోడిపోయితి మనఁత; యనంత! అనంతరమ్మునఁ
గోడలి కిచ్చె నిచ్చకపు గూరిమిపెంపున గ్రుడ్డిరాజు-ము
న్నోడినచానినే మరల నోడి వనుల్ దిరుగాడి నేడు వా
యోడక భాగమిమ్మనుటయుఁ-కురువల్లభు డీయకుంటయుఁ!!

ఆడది యేడ్చి తెచ్చికొనినట్టి దయారసధర్మభిక్షకై
గూడలుక్రుంగి కుంతికొడుకుల్ చెయిజాచుట యెగ్గుసిగ్గులఁ
వీడుటగాదె? దేహి యని వేడుదురే పగవారి? నే డిటుల్
బూడిదపా లొనర్చితిమి పో! యమృతాంశకుల ప్రతిష్ఠలఁ!

బావను హస్తినాపురము బంపెడిచో "నిదమిత్థ" మంచు నా
భావములోని భావములు స్పష్టముసేయదలంచియుఁ, శుభం
భావుక సంధియాత్ర అశుభం బని క్రిందితి-మిన్నకుంటి, మా
బావ సుఖంబుగా దిరిగివచ్చె నిదే పదివేలు నేటికిఁ!

పాంచాలి

భుజాగ్రముల్ పొంగ పురోగమింతురో !
ధ్వజాగ్గముల్ వంగ తిరోగమింతురో !
శరమ్ములఁ దాల్చి పరాక్రమింతురో !
కరమ్ములఁ మోడ్చి పరిక్రమింతురో !

త్యజింతురో క్షాత్రకుల ప్రతిష్ఠలఁ
భజింతురో శాత్రవ పాదపద్మముల్ !
భుజింతురో కానల కందమూలముల్ !
సృజింతురో తాత్విక ధర్మశాస్త్రముల్ !

స్మరింపుడీ భూత సభా ప్రమాణముల్ !
ధరింపుడీ చేత ధనుష్ కృపాణముల్ !
హరింపుడీ కౌరవ గర్వసంహతుల్
భరింపుడీ పౌరవ గౌరవద్యుతుల్

అధిష్ఠితోద్దండ రథిప్రకాండుడౌ
యుధిష్ఠిరుం డెంతటి సార్థకాఖ్యుడో !
అజాతశత్రుత్వ యశోభిలాషలో
స్వజాతి చైతన్యము విస్మరింతురో !

ధర్మరాజు

సంధి యగు—బాల్యవైర
గ్గంధి దొలగు—లోకశాంతి గలుగు నని జగ
ద్బాంధవు నిను బుత్తెంచిన
గాంధారేయులకు జన్నె కదనాకాంక్షల్ ?

"తగవులు సహోదరులలో
తగ"వని, సగ మొసగి మనుట తగవని, మేమిం
తగ వారి గోరినందుకు
తెగించిరటె ! బిట్టుబిగిసి ధృతరాష్ట్ర సుతుల్ !!

హింసామయ జీవనుల బ్ర
శంసింతురటయ్య ! ధర్మశాస్త్రజ్ఞు ? లస్మ
జ్జ్ఞాంపాహుతు లందక యీ
సంసార మహామఘంబు సాగదటయ్యా !

సింహాసనమ్ము కొరకై
సంహార మొనర్పజాల సంబంధుల—మా
యంహశ్చరితల "భారత
సంహిత"ను కళంకితమ్ము సలుపగజాలన్ !

దారుణ రణాంగణమ్మున
మారణ మొనరించి కురుకుమారుల, తద్ర
క్తారుణ ధరణీరాజ్య
శ్రీరమణుడ నగుట నిగ్గుచేటు మురారీ!

అర్థములకోసమై పర
మార్థమ్మును విస్మరించి యన్యోన్యమ్ముఁ
స్పర్థించి రణము సేసిన
వర్థిల్లునటయ్య భరతవంశము కృష్ణా!

చుట్టాల చంపి పట్టము
గట్టుకొని సుఖించు కాంక్షకంటె, విరక్తిఁ
నట్టడవి కావిపుట్టము
గట్టుకొని తపమ్ము సేత కార్యము గాదే!

సంతోషించితి కురురా
ట్సంతానము సమ్మతించు సంధి కని, యికఁ
శాంతియొ క్రాంతియొ ముందిడి
కొంతేయుల గావుమయ్య! కమలదళాక్షా!

పాంచాలి

మారనిమాట లేటికిటు మాటికి? కూటికి తోటిరాజుతో
బేరములాడుటే మిగుల పేలవ! మంతటబోక సంధికిఁ
వారు తిరస్కరించి కరవాలములెత్తిన నిర్నిమిత్త ని
స్సారవిచారులై మెడలుసాచుట శోచ్యము నైచ్య మెంతయుఁ!

ఆయెనుబోయె సంధి; యికనైనను నాయకు లాయుధమ్ములఁ
దీయక ధర్మశాస్త్రములు త్రిప్పుట నమ్మినవారిగొంతుకల్
గోయుటగాదె – మీరు గయికొన్న యహింసలు హింసలయ్యె నా
త్మీయులయందు – చాలు గురుతింపుడు పీడితజాతియాతనల్!

పుట్టితి పూజ్యుడౌ ద్రుపదభూపతికిఁ; జగజెట్టి పాండుస
మ్రాట్టుకు కోడలైతి; నభిమానధనుల్ ఘనులైనవారి జే
పట్టితి; శౌర్యధైర్య గుణపాత్రుల పుత్రుల గంటి; నూడిగం
బెట్టుల జేయజాలుదు నిసీ! మగవారలు సిగ్గుమాలినఁ!

అన్నయు నాన్నగారు చతురంగబలమ్ములతోడ నస్మద
భ్యున్నతిగోరివచ్చిరి, మహోదయు లీక్రియ నీళ్లుమ్రింగుచుఁ
మిన్నులు చూచిరేని విషమించు పరిస్థితు – లైనవారిలో
చిన్నతనమ్ము మోయుదురె! ఛీ యని నల్వురు నవ్విపోవరే!

హింస యహింస యంచు నొకటేయొకటే తిరుమంత్ర మేదొ మీ
మాంసకుదెచ్చి, మా రుధిరమాంసములన్ బలియిచ్చి, ఇష్ట వి
ధ్వంస పథమ్మునన్ నడచు వైఖరి నేటికి చాలు – దుష్ట వి
ధ్వంసన మాచరింప విలు దాల్పుడు! నిల్పుడు క్షాత్రదీపికల్!

చాలితిరేని ముందునకు సాగి – సపత్నుల నాగి – పత్ని పాం
చాలి కచాలి కూర్పుడు! విచారము దీర్పుడు! శౌర్యధైర్యముల్
చాలవయేని ధర్మములు చాలిక పెద్దలు మిన్నకుండుడీ—
బాలురు దీర్తు రీ సమరభారము "భారతభాగ్యమూర్తులై"!

మండితపాండవాన్వయుడు మా యభిమన్యుడు, దండితద్విష
న్మండలు డా ఘటోత్కచకుమారుడు చాలరె! ధార్తరాష్ట్రులన్
పిండియొనర్చ–హెచ్చు పయిపెచ్చులు నచ్చుకొనన్ ధనుష్కళా
పండితు డన్నలేడె! యుపపాండవు లేమి కృపాణహీనులే!

"భారతవీరమాత" యగు భాగ్యము ప్రాప్తిలు అత్తగారి కం
చూరక చూచిచూడనటులుంటిమి; ఆమెకు దక్కకున్న ఆ
గౌరవలక్ష్మి లభ్య మగుగాక కుమారుల గన్న మా హిడిం
బారమణీలలామకు - సుభద్రకు - ఈ ద్రుపదాత్మజాతకున్!

భీముడు

ఏమీ యిప్పటికైన ముందడుగు లేనేలేద! నేపథ్య మి
థ్యా మీమాంసల కంతు గల్గద! గదాదండంబు దుర్యోధన
ప్రేమాలింగన మెప్పు డెప్పు డని సంప్రీతిన్ కురుక్షేత్రసం
గ్రామక్షోణికి పర్వులెత్తెడి భుజాస్కంధమ్ము లంఘించుచున్

శ్రీకృష్ణుడు

ఆశాస్యమ్ములు దీరు చెల్లి! సహదేవా మెచ్చితిన్; భీమసే
నా శాంతింపుము; సత్య మోయి నకులా! అల్లో కిరీటీ! రణా
వేశుల్ సోదరు లాగబో రిక దయాబ్ధీ! ధర్మరాజేంద్ర! మా
కాశీర్వాదములిమ్ము లెమ్ము కొనుమయ్యా! కేల కోదండమున్!

నిండిన పాపభాండ మవనింబడి బ్రద్దలుగాకపో దిక
పండిన దుష్క్రియాఫలము భళ్ళున ద్రెళ్ళకపోదు—ప్రజ్వలత్
పాండవ రోషవిస్ఫుర దభంగనిషంగసితాంబకాగ్నులన్
మండకపోవు భగ్గు మని మార్తుర వంశ మహాటవీస్థలుల్!

గ్రామము లైదు మీ రడుగగా కురురాజు నిరాకరించి సం
గ్రామ మొసంగినా డొకటి—కాదనరా దిక లెండు ధార్మిక
గ్రామణులార! తోరణముగట్టి యథేచ్ఛగ నేలుకొండు ప్ర
జ్ఞామతులై, భవద్గుణగణంబులు దిక్కుల మారుమ్రోయగన్!

భీముడు

త్రిపథగాసుత కుంభజ మద్రరాట్
కృప జయద్రథ కర్ణుల కోడి మా
శపథముల్ విపథమ్ముల బుత్తుమే?
కుపథవర్తనులన్ మననిత్తుమే?

అర్జునుడు

పర పరాభవ రోష పరీతుడౌ
నరుడు కింకరుడై నిదురించునే?
శరశరాసనముల్ గొని డుల్పడే
ధర, విరోధి శిరోధి సమూహముల్!

నకులుడు

కుపిత పాండవ కాండ హత ద్విష
న్నృపతి రక్తనదుల్ తిలకింపకే
ఉపశమించునె పీడిత తాడిత
ద్రుపదరాజ తనూజ మనోరుజల్?

సహదేవుడు

"ధణ ధణం ధణ" భీమ గదా ధ్వనుల్
"ఘణ ఘణం ఘణ" పార్థ గుణ ధ్వనుల్
వ్రణములై శ్రవణమ్ముల దాక మా
రణము గాంతురు గాక కురుప్రభుల్!

ధర్మరాజు

నలుగురు సోదరు లొకపై
యలుగులు సింగాణు లూని యలిగిన, నిలువం
గలుగుదు రెవ్వారలు? మరి
కులక్షయమ్మునకు మనసు కుందు ముకుందా!

మా పాలు మా కొసంగగ
భూపాలున కింత బుద్ధి పుట్టకపోయెన్;
కోపాలసు లగు తమ్ముల
చాపాలకు పనులువెట్టె స్వార్థపరుండై!

నెయ్యమునకు మే మంపిన
కయ్యమునకు దింపినారు కౌరవులు—వృథా
యయ్యె మదాశయ; మిక నా
దయ్య మెరుగు కురుకులంబు దశ యేమగునో?

ఏమయిన తప్ప దిక సం
గ్రామ, మ్మాపైన నీవె గల వన్నిటికిన్!
మా 'మాతృశ్రీ' బిడ్డల
కే మని సందేశ మంపె నీ విలయమునన్?

NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

శ్రీ కృష్ణుడు

విశ్వవిఖ్యాత భారతవీరమాత
కుంతి పడియుండె కురురాజు కొంపలోన
అశ్రుధారలు తన లోచనాంచముల
యమునలై గంగలై కృష్ణలై స్రవింప!

బిడ్డలకు దూరమై, యొక గ్రుడ్డిరాజు
రాజ్యమున జిక్కియుండె మీ పూజ్యజనని!
వత్సమును బాసి రాకాసి వనములోన
క్రూరమృగమధ్యమున గంగగోవువోలె!

నన్ను గని కౌగలించి యానంద కరుణ
గద్గద గళమ్ముతోడ స్వాగత మొసంగి
కన్నబిడ్డల కోడంగ్రడ, చిన్న మనుమ
లందరను సేమమడిగిన దత్తగారు.

పరుల పంచల పడు భంగపాటు లెల్ల
చెప్పి వాపోయె గుండెలు చెరువుగాగ;
బాష్పముల నాగి, జయవాక్కు పలికి; మీకు
తెలుపుమన్నది మాతృసందేశ మిట్లు:—

(మాతృసందేశము)

"స్వచ్ఛజ్యోత్స్నలు చిందు చందురుని వంశమ్మందు జన్మించి,యే
కచ్ఛత్రేశుని బిడ్డలై, భరతరక్త మ్మూని నెమ్మేనులన్,
స్వచ్ఛంద ప్రియ భావి జీవన సుధాస్వాదంబు గావింతురో !
స్వేచ్ఛాలక్ష్మికి స్వస్తి చెప్పి పరులక్ సేవించి జీవింతురో !

విపరీతమ్ముగ విశ్వ విప్లవ మహావిర్భూతికై మాయదా
రి పిశాచమ్ములు రెక్క లార్చుచును గర్జించెక్ సముద్రాలపై,
ఎపుడోలే యనుకొన్న యుద్ధ మది రానేవచ్చె, మీ దొడ్డి గు
మ్మపు మెట్లెక్కిరి శాంతిభూతుకులు సామ్రాజ్య క్షుధాబాధితుల్!
భారతభాగ్యదీపికలపై మసిబొచ్చెలు మూయువార లె
వ్వారలురా ? యపార మనవద్య మపూర్వ మఖండ మైన మీ
వీర విజృంభణమ్మునకు విశ్వము విస్మయ మందురా ! భవత్
పౌరుషలక్ష్మి కారతులు బట్టునురా సకలప్రపంచముల్ !

సంపాదించిన తండ్రి వైదొలగ, తత్సంతానమౌ మిమ్ము గ
ర్హింపక్ సాగెను పెద్దతండ్రి; కపటప్రేమం బ్రదర్శించి ని
ర్మింపక్ సాగెను స్నేహసౌధ; మటుపై మీసొంపు మీపెంపు మీ
కంపే గిట్టకపోయె కౌరవులకుం గాలప్రభావమ్మునక్ !!

దేశకల్యాణ దివ్యసందేశదీక్ష
నందుకొని స్వేచ్ఛకొరకు విల్లందుకొనుడు!
భరతసంతతి భావిసౌభాగ్యమునకు
సాగుగావుత స్వాతంత్ర్యసమరరథము!

వీరభారతభూమి నావిర్భవించి
పౌరుషము లేని బానిస బ్రతుకులేల?
ఈ యయోమయ శృంఖలా లింకనైన
త్రెంపుకొని బైటపడి విజృంభింప రేల?

తనకుమారుల పరతంత్ర దశ తలంచి
తల్లి హృదయము పడు – బాధ – తపన – యెరుగ
రెట్టిదో యెవ్వరును—ఆశ పెట్టుకొంటి
సుతుల అతుల భుజా బలోద్ధతులమీద!

దిక్కుచెడియున్న మీ తల్లిదిక్కు జూచి
గుండెలోని సెగల్ రగుల్కొల్పుడయ్య!
దాస్య దారిద్ర్య గాంఢాంతతమసమందు
జ్యోతి వెల్గింపవలె యుగాభ్యుదయమునకు!!

ఏ మహోద్దేశ సిద్ధి లోనిచ్చగించి
ప్రియ కుమారుల గనును క్షత్రియసవిత్రి ;
ఆ మహోద్దేశ సంసిద్ధి నాత్మ నెంచి
నడుములు బిగించి ముందుకు నడువుడయ్య !

క్షాత్ర తేజస్సు భారతక్షేత్ర మెల్ల
చల్లబోయెడి శ్రమికకర్షకులు మీరు ;
కృష్ణమేఘము మిము కటాక్షించె నింక
మీకు సులభము విజయలక్ష్మీఫలమ్ము"

అనుచు దెలుపు మనియె అత్త మీతో—పాత
మప్పగించినాను చెప్పినటుల;
ఇంక సిద్ధపరుచుడీ కురుక్షేత్ర సం
గ్రామమునకు గదలు గాండివములు !!

ఆలకించినారలా బావలార! మీ
యేపు జూపవలయు రేపు మొదలు;
దూతకృత్య మెట్టులో తీరిపోయె—నే
సూతకృత్యమునకు జొత్తు నింక.

అని చిరునవ్వు నవ్వుచు మురారి కిరీటిని దట్టి కూరుచుం
డెను; కుతుకమ్ముమై వదమునిం గనుగొన్నది కృష్ణ; ధర్మ నం
దనుడు ప్రసన్నతం గనె, గదం గదలించెను భీమసేను; డ
ర్జునుడును గాండివమ్ము దెస జూచె; కవల్ పులకించినారలుక్ష!

అం దేకాంత రహస్సభాంతరమునం దాయోధనప్రక్రియా
సందర్భమ్ములు సంప్రదించుకొను పాంచాలీయుతుల్ పాండవుల్
"వందే మాతర" మంచు భక్తిమెయి సంభావించి రాత్మ ప్రసూ
సందేశమ్ము, వినమ్ర శీర్షములతో—సంతోష భాష్పాలతో!!

స్కంధావారము

శ్రీకృష్ణుడు

మణిమయ స్వర్ణ కింకిణీ మంజులములు
అరి భయంకర కపికేతనాంకితములు
రంగ దుత్తుంగ ధవళ తురంగమములు
జయముగను పార్థ! నీ రథస్పందనములు !!!

పరిచి తాభీల సంగర ప్రాంగణములు
త్రాస పరిభూత కర్ణ దుశ్శాసనములు
సంభృ తానేక నవ యుగ స్వాగతములు
అలరు విజయ! త్వదీయ శంఖారవములు !!!

సత్వర పరాజి తారాతి సంచయములు
దివ్య మహిమా విశేష సందీపితములు
శమిత శతకోటి శతకోటి సంభ్రమములు
వెలయు గాండీవి ! నీ ధను ర్విభ్రమములు ! ! !

ముందు కూర్చుండి నే పగ్గములను బట్టి
రథము నడిపింతు సంగ్రామ పథము వెంట ;
చేత విలు దాల్చి లక్ష్యమ్ము సెదరకుండ
కార్య సిద్ధికి నీ వింక గడగుమయ్య !

అర్జునుడు

రణ ముహూర్తము డాసె యుద్ధా
రంభ ఘంటలు మ్రోగనున్నపు
క్షణము మన మిట సైన్య సమవే
క్షణము సేయుదమే !

దుష్ట దుర్యోధనుని కొరకై
కష్టపడి కయ్యమ్ము సేయగ
వసుమతీపతు లెవ్వ రెవ్వరు
వచ్చియున్నారో !

రాజరాజు సహాయులై ఘో
రాజి సలుపగ నరుగుదెంచిరి
రాజసూయము మరచిరో మన
రాజనందనులు

మాధవా! రథ ముభయ సేనా
మధ్యమున నడపింపుమయ్యా!
యోధులను పరికింత మింత సు
యోధనానుగులన్.

శ్రీ కృష్ణు డు

అతిరథులు వీరు—అల్ల వా రర్ధరథులు—
అరుగొ సమరథు లచట—మహారథు లిట—
యుద్ధ సన్నద్ధులై నిల్చియున్నవారు
రాజసుతులు నిజధ్వజ రాజి వెలయ.

భట హుంకృతు లొక యెడ, గజ
ఘట ఘీంకృతు లొక్క యెడ, నఖండిత భేరీ
పటు భాంకృతు లింకొకయెడ,
అట నట జ్యాటంకృతులు, ధ్వజాహంకృతులున్.

కేల పెనువిల్లు వెలయ, నుత్తాల తాల
కేతనమ్ము ధరించి మీ తాతగారు
కౌరవాధీశు సేనాముఖమ్మునందు
అలరుచున్నాడు చూచినావా కిరీటి !

"కదలివచ్చిన హిమవన్నగంబొ !" తేక—
"గడ్డకట్టిన పుంస్త్వమో ! కాక— "రూపు
నందుకొన్నట్టి వీర రసాపతార
మో" యన వెలుంగు వృద్ధగాంగేయమూర్తి !

ప్రాత రుత్పుల్ల పంకజశ్రీ తలిర్చు
ఆ కనుల కెంత బ్రహ్మచర్య ప్రదీప్తి !
కదలుచున్న ఆ తెల్లని గడ్డ మెంత
పండిపోయెనొ క్షాత్ర తపస్సునందు !

ఈ మహామహుడైన పితామహునకు
ప్రేమ యధికంబు మీ మీద—నేమిసేయు
తప్పదయ్యె - వేల్పులు మింట గుప్పవడిరి
తాత మనుమల ద్వంద్వయుద్ధమ్ము సూడ !

భీష్మ పార్శ్వాన ధీరగంభీరమూర్తి
కురుకులాచార్యు డున్నాడు కుంభజుండు!
కంచె కాంచనమయవేదికాపతాక!
సమర జయలక్ష్మి కదియ విశ్రాంతిపీఠి !!

అస్త్రవిద్యా రహస్యము లన్ని తెలిపె
కుంభభఘనకు నీ వన్న కూర్మి పెద్ద;
శైశవాభ్యస్త మగు ధనుశ్శాస్త్రమందు
శిష్యుని గురూత్తముడు పరీక్షించు నేడు.

గురున కా ప్రక్క అపర శంకరుని భంగి
శౌర్యసంపన్ను డగు కృపాచార్యు డడుగొ!
కురుమహీపతి యన్నమ్ము గుడుచుకతన
వచ్చియున్నాడు రారాజు వైపు నేడు.

సింహలాంగూలకేతనశ్రీ వహించి
యల్లవాడె యశ్వత్థామ! యగును మామ
నానుకొని నిల్చియుండె; నాజానుబాహు
డన్నిటను కన్నతండ్రి కీడైనవాడు.

అతడె! శకునాల పక్షి, పండితుడు మాయ
పాచికల—ముచ్చు కనుబొమల్ సూచినావె!
దొంగ జూదమ్ములో సిరుల్ దోచుకొన్న
మీ సుయోధను గారాబు మేనమామ!

అల్లదే! ముద్దు బావ జయద్రథుండు
సింధుదేశాధిపతి దయచేసినాడు;
సోదరీమణి పాంచాలి జోలి కేగి
తియ్య తియ్యగ తన్నులు దిన్నవాడు!!

భద్రగజము వీపుపైన—అక్షౌహిణుల్
పదునొకండు తన్ను బలిసి కొలువ;
వెల్ల గొడుగు క్రింద వేంచేసియున్నాడు
పెద్ద తండ్రిగారి పెద్దకొడుకు!

ఇండ్లు గాల్చుటందు, ఇల్లాండ్ర వస్త్రమ్ము
లొల్చుటందు, మేటి యుక్కలుండు!
కుటిలబుద్ధి—వీని గుణము నూహింపంగ
పడగమీది నాగుబాము చాలు.

రాజు ప్రక్క నంగరాజు నీక్షించితే
శక్తిశాలి సూర్యసన్నిభుండు ;
పౌరుషమ్ము మొలచె కోరమీసాలలో
విప్ర శాప లుప్త వీర్యు డితడు !

అరుగో ! దుశ్శాసనాది సోదర శతంబు
అన్న కిరువైపులం గాచియున్నవారు ;
లక్ష్మణాదులువచ్చి రాలమ్ముకొరకు
కురు కుల కిశోరములు కనుంగొను కిరీటి !

మనకు సాయమ్ము సలుప రా—మార్గమందె
మాయచేసి స్వపక్షమ్ము మలపుకొనియె ;
మద్రదేశాధినేత మీ మామగారు
శల్యు డల్లడుగో వచ్చె సమరమునకు.

అతడు భగదత్తు ! డితడు బృహద్బలుండు !
వాడె కృతవర్మ ! భూరిశ్రవస్సు వీడె !
బాహ్లిక సుదక్షిణాదు లాప్రక్క ! సోమ
దత్తు డీ ప్రక్క నిలిచి రాయత్తు లౌచు !!

ఆప్తులు కౌరవేశ్వరున కత్యధికంబుగ, శౌర్యధైర్య సం
దీప్తులు నిగ్గుదేరి చలిదీరిన వా, రొకపాటి పోరికిన్
తృప్తి వహింపబోరు, సమితింజయు లందరు రాజువెంట సం
శప్తకు లున్నవా రదె సుశర్మముఖుల్ పదివేవు రర్జునా!

అరదము లొప్పు దీపుల క్రియన్, ధరణీధర సన్నిభమ్ములై
ద్విరదము లొప్పు, నంబువు గతిన్ రజమొప్పు, భటాళి వొల్చు వా
శ్చరములటుల్,తురంగము లెసంగు తరంగములో యనన్,మహా
శరనిధిభంగి నున్న కురుసైన్యము గంటె ప్లవంగకేతనా!

విషాదము

అర్జునుడు

అగుమాగు మొకింత బావా!
అస్మదీయ హృదంతరమ్మున
ఆగికోలేకుంటి భావా
వేగ మిది యేమో!

మారుచున్నది యంతకంతకు
మాధవా! నా యంతరంగము
క్రొత్త భావన లేవియో తల
లెత్తుచున్నయవి.

దేహమా కంపించుచున్నది
"ద్రోహమా" యనిపించుచున్నది
మోహ మేదో కుంచుచున్నది
స్నేహ బంధములన్.

గాండివము చే వీడుచున్నది
గుండె గజగజలాడుచున్నది
ఎండుచున్నది గళము, నే ని
ల్చుండలే నింకన్.

బందుగుల ద్రుందింప భావం
బందు సందియ ముద్భవించెను ;
అందరను హతమార్చి నే నే
మందుకోగలనో ?

వలదు విజయశ్రీ వికాసము
వలదు రాజ్య రమా విలాసము
వైభవోజ్వల సౌధ వాసము
వలదు వలదయ్యా !

శ్రీకృష్ణుడు

ఇదియేమీ! ఇదియేమి! యేమిది కిరీటీ! ఈ వృథావిస్మయా
స్పద నిర్విణ్ణత కర్థమేమి? గ్రహదోషమో మా! పరిహాసమో!
మదిరాపానమొనర్చితో! నిదురలో మాటాడుచున్నావొ! నీ
హృదయమ్మున్ పదిలమ్ము సేసికొనుమోయా! సుంతవీరాగ్రణీ!

గాండీవ మ్మిది చేయిజారినది, మై కంపించెడిక, బాష్పముల్
నిండెక కన్నులయందు–ఏమిటిది కౌంతేయా! ద్విషత్సైన్యముల్
"బండార మ్మది బైటపడ్డ" దని వేళాకోళముల్ సేయరే—
రెండే రాజుకు "స్వర్గమో జయమొ" వేరే మార్గమే లేదికన్!

అంగేశుం గని భీతి నందితివొ! ద్రోణాచార్యు వీక్షించియే
కంగారెత్తెనొ? ధార్తరాష్ట్రశతమే కంపమ్ము కల్గించెనో!
గంగానందను గన్న కాతరతయో? కాకున్న సంగ్రామమే
సింగారమ్ముగు రాచపుట్టువున కీస్సి! యింతవైక్లబ్యమా?

ఇందరు శౌర్యధైర్యధనులే! సమరాంగణసార్వభౌములే!
సందియ మింతలే, దయిన సార్థక మేమి? అధర్మ పక్షులై
ముందుకువచ్చిరాలిరి సమూహముగా; మన వింటిదేబ్బకున్
చిందరవందరై పడి నశింపక తప్పదయా! ధనంజయా!

అర్జునుడు

గాండివము మోపెట్టవలెనా
కంఠములు దునుమాడవలెనా
మొండెములతో భండన మ్మిది
నిండిపోవలెనా !

తాతలను తండ్రులను గురువుల
భ్రాతలను బరిమార్చుటకు నా
చేతులాడుటలేదు నే నెటు
సేతు సంగరము ?

మిత్రుల—ననుగు పుత్రుల
సదయహృయముతోడ బలిగొని
తృప్తిపడునో మనసులోపలి
తృష్ణ గోవిందా !

ఖాండవము దహియించునప్పుడు
ఖండపరశువు నోర్చునప్పుడు
పాండుసూతి యెరుంగ డిట్టి య
కాండ తాండవము.

ఎంతపని కొడిగట్టుచుంటిని!
ఎంతఘోరము సేయనుంటిని!
భ్రాంతమై స్వాంతమ్ము చింతా
క్రాంత మగుచుండెగ.

సిద్ధవందితచరితు—కురు కుల
వృద్ధు—గాంగేయుని—పితామహు—
యుద్ధమున దయమాలి విశిఖా
విద్ధు చేయుదునే!

ఆర్యజనసన్నుతుని ద్రోణా
చార్యు మద్గురుదేవు—కార్య్
కార్యమూఢుడనై యెదుర్చుట
గౌరవమ్మగునే?

రాజ్యలోభాక్రాంతమతితో
సజ్య మగు గాండివము గైకొని
పూజ్య పాదులమీదనా నా
పురుష కారమ్ము?

దుష్ట దుర్యోధనుడు, లోభా
కృష్ట నిష్ఠుర మానసుండై
ఇష్ట జన విధ్వంసనమ్మున
కిపపడినాడు.

ధూర్తమతినై స్వార్థమున కల
ధార్తరాష్ట్రుల కసిమసంగిన
కీర్తి గందునొ ! రాజ్య కాంక్షయు
పూర్తిచెందునొకో !

ఇట్టి దారుణ మారణ క్రియ
కెట్లు లోర్చు మదీయహృదయము ?
కొట్టనీ ! కౌరవులు, చేతులు
కట్టుకొని యుందున్.

త్రిజగతీరాజ్యమ్మె రానీ
విజయ నామమె మాసిపోనీ
స్వజనమును హింసింపజాలను
నిజ సుఖమ్మునకై.

గోడుగోడున నాలు బిడ్డల
నేడిపించి, సమస్త రాజుల
వాడి శరముల ద్రుంచి, నెత్తురు
కూడు దినజాలన్.

కష్టమెయి పోరాడుకొని యిరు
పక్షముల నెందరు నశింతురొ ?
రక్ష కలదే జాతి కింక కు
లక్ష్యము కాదే ?

"ధర్మ సమ్మోఢమ్మ" చేతము
ఘర్మ కణ సంప్లుతము గాత్రము
మర్మములు దెగగోయు శోకము
మాటి మాటికిని.

పుణ్య పదవీ భ్రష్టుడను "కా
ర్పణ్య దోష హత స్వభావుడ"
గణ్య మగు కర్తవ్య మార్త శ
రణ్య ! తెల్పగదే !

శ్రీకృష్ణుడు

చిక్కని పోటుమానిసి విసీ! ససిదప్పి త్రపాకరమ్ములౌ
వాక్కులు వల్కజొచ్చితి వవారిగ, వైరిగణమ్ముమధ్య; నే
డెక్కడనుంచి యూడిపడె నింత వివేకము నీకు; నవ్వరే
"పక్కున" నీ యకాల సముపస్థిత శేముషి గాంచి భూపతుల్!

చిత్తముచిక్కబట్టుము; త్యజింపుముబేలతనమ్ము; మోముపై
కెత్తుము; ధైర్యమున్ జెదరనీకుము; కొంపలుమున్గునయ్య! నీ
తత్తరపాటు, నీ ముఖవిధంబు పరుల్ పసిపట్టిరేని—పో
నిత్తు రథమ్ము నా తరువునీడ కటన్ వినిపింతు నంతయున్.

ప్రబోధము

శ్రీకృష్ణుడు

అల వారాణసి కౌరవోజ్జ్వలిత లాక్షాగార రూక్షారుణ
జ్వలన జ్వాలిక లీ నిమేషమునకున్ జల్లారలేదె—మహో
జ్వల గాండీవము సజ్యమై శరములన్ వర్షింపనేలేదె—ఈ
చలి నీ కెక్కడ దాపురించినది? సంస్తంభించె సర్వాంగముల్!

అంధత్వమ్మున కన్నుగాన కలనా, డాగ్రుడ్డిదర్బారులో
గాంధారేయులు కాలదన్నిరి జగత్కల్యాణసంబంధియౌ
సంధిన్—సల్పినసంప్రదింపు లెదురై సంధించె—గాండీవమే
సంధింపన్ బని గల్గె, లే వితరథా సంబంధభాంధవ్యముల్!

తప్పదు హింస ఎందుకు వృథావ్యథ నీకు? రథమ్ము వెన్కకున్
ద్రిప్పితినేని సాయమరుదెంచిన యిందరు ధారుణీపతుల్
దెప్పరటయ్య! మీసములుద్రిప్పితి రాసభలోన ; నా డటుల్
గొప్పలు వల్క నే డిటు దిగుల్వడి దిగ్భ్రమనంద జెల్లునే!

అర్జునుడు

గుండెలు రాయిచేసికొని క్రూరుడనై కురురాజు సేనపై
గాండివ మెక్కు వెట్టి, రిపుకంఠవిలుంఠనమాచరించి, యీ
భండనభూమి—తద్రుధిర పారణ మత్త పిశాచ ధాకినీ
మండలతాండవమ్ము గన మామకమానస మొప్ప దచ్యుతా!

ఇంక రణోత్సుకత్వము వహింపగజాలను—బాహువుల్ త్రపా
సంకుచితమ్ము, లాత్మజన సంహరణక్రియ కంతరంగ మా
శంకిత, మా మహేశ్వరుని సాక్షిగ, చాలక గాదు, పోరికిఁ
జంకియు గాదు, క్రుంకు లిడజాలను రక్తనదీనదమ్ములన్!!

పెద్దన్నయ్య యహింసయే మదికి సంప్రీతిఁ సమర్థించె, నా
యుద్దేశమ్ములు మారె, గ్రమ్ముకొనె నేవో మోహమేఘమ్ము—లీ
గద్దెల్ మిద్దె లశాశ్వతమ్ములు మిథఃకార్పణ్యముల్ చాలికఁ
వద్దయ్యా! పరపక్ష మారణ రణ వ్యాపార పారీణతల్!

కత్తుల గ్రుచ్చినఁ, శరముఖమ్ముల వ్రచ్చిన, కార్ముకమ్ములఁ
మొత్తిన, నెత్తిపై గదల మోదిన, నెత్తురు పీల్వసాగినఁ,
కుత్తుక నొక్కిపైన బడి కొట్టిన, తిట్టిన, శాంతితోడ నో
రెత్తక మిన్నకుండు నెవ రేది యొనర్చిన చూచుచుండెదఁ!

శ్రీ కృష్ణు డు

కొంచెపు మాటలాడెదు—జుగుప్స! అశోచ్యుల కొస మేల శో
కించు? "టనార్యజుష్ట" మపకీర్తికర, మ్మపవిత్రమైన దీ
చంచలబుద్ధి, కశ్మలత చాలు, మహా ప్రళయమ్ముగా నివే
ముంచుకవచ్చుచుండె నలుమూలనుండి విరోధివాహినుల్ !!

రక్తపుకూడుగాక మన రాజులకుఁ ఘృతసూపయుక్తమౌ
భుక్తి లభించునే? విడిచిపుత్తువె ధర్మ్మవు! కర్మసూత్ర సం
సక్తము సృష్టి యెల్ల, సహజమ్ములు తప్పవు చావు పుట్టుకల్,
ప్రాక్తనపుణ్యపాపములు ప్రాణులకుఁ సుఖదుఃఖహేతువుల్ !

చంపుటొ చచ్చిపోవుటయొ క్షాత్రము, విస్తృతవిద్విషచ్చమూ
సంపద గాంచి గుండెదిగజారి, అకారణపస్మయస్మయో
త్కంపముచెల్లునయ్య! కులధర్మమువీడుట పాడియయ్య! మీ
కొంపలు గొల్చు దుండగపు గుంపులపై ననుకంప యేటికిక్ ?

ప్రుక్కడి కౌరవాధములు మోసము సేసి దురోదరమ్ములో
ద్రొక్కరి యుక్కుపాదములతో మిము, ద్వేష రుషా విషార్చులన్
గ్రక్కరి, లక్కయిండ్ల నిడి కాల్చిరి, బందుగు లన్నదమ్ములం
చక్కటికమ్మ గైకొనెద వక్కట! యుక్కటిలాత్ములందునన్ !

హింస యొనర్ప నంటివి సరే! మిము హింసల పాల్జొనర్చు వి
ధ్వంసక శక్తులందు దయదాల్చుట ధార్మికహింసకాదె! మా
కంసుని జంపి లోకముల కష్టము దీర్పనె చెల్లునె! యస్మ
ద్భ్రూంసము లెండ తిండికయి మాడుట రాచకొలమ్మువారికిన్ !

లెమ్ము ధనంజయా! విధి బలీయము! న్యాయముగెల్చు! నిల్చు స
త్యమ్ము, నశించు స్వార్థము, సదా యుగధర్మమిదేగదోయి! క
న్గైమ్మిక నంత్యకాలమున నూర్గురుబిడ్డలతండ్రికైన పిం
డమ్మిడుదిక్కు గల్గ దకటా! గ్రహచారము తప్పివచ్చినన్ !

"ఆర్థింపన్ విజయమ్ము, భోగముల నభ్యర్థింప, రాజ్యార్థినై
ప్రార్థింపన్ సిరు" లంచు ధర్మములు ప్రారంభించినా వేమిటో
పార్థా! చాలును కట్టిపెట్టుము వచఃప్రాగల్భ్యముల్—చాలురా
స్వార్థత్యాగము, తల్లిపిల్ల వినరా! శంఖమ్ము పూరింపరా!

శంకాసంకుచితాంతరంగులు, వృథాసందేహమందేహులున్,
కింకర్తవ్యవిమూఢచిత్తులు కురుక్షేత్రమ్ములో నిల్వరా;
దింకన్ మార్గము లేదు, వింట విశిఖమ్మే లాగెదో, కానిచో
"పంకాలాగెదొ" రాజరాజునకు బావా! రెండు హస్తాలతో!

ధర్మక్షేత్రము, క్షాత్రమండల పవిత్రమ్మౌ 'కురుక్షేత్ర' మన్
కర్మక్షోణి స్వధర్మనిర్వహణదీక్షం దాల్చి విద్రోహులన్
నిర్మూలించి "స్వతంత్ర భారతభవానీవీరసంతానమై"
మార్మ్రోగింపుము దిగ్దిగంతముల యుష్మద్దేవదత్తధ్వనుల్!

అంగత్రాణకృపాణబాణధరులై, యంగమ్ము లుప్పొంగ, దు
స్సంగ స్వార్థ మదేభ కుంభములపై సంగ్రామరంగమ్మునన్
సింగమ్మట్టుల దూకి, కర్కశ ఖరాసిన్ చించి చెండాడ కీ
భంగిన్ వీరులు భీరులై చనుట దౌర్భాగ్యమ్ము రా! జాతికిన్.

నిద్రాణమ్మగు జాతికిన్ నవనవోన్మేషమ్ము చేకూర్చి, ని
ర్నిద్ర స్ఫూర్తి స్వతంత్రభారతపునర్నిర్మాణముం జేయుటే
భద్రా ! భద్రము క్షాత్రనందనుల; కీ భంగిన్ నిరుత్సాహివై
యుద్రేకమ్ము దొరంగి చల్లబడి నిట్టూర్వంగ నీ కొప్పునే !

జెండా జాతికి జీవగట్టి ! సమతా చిహ్నమ్ము ! సర్వస్వ ! మీ
జెండా వంపు సహింపజాలని శిరశ్ఛేదమ్ము, లే లె మ్మికన్
జెండాడన్వలె శాంతిభూతుకుల; జేజే లేల్ల జేజేలతో
గొండాడన్వలె విశ్వవిశ్రుతభవత్కోదండపాండిత్యమున్ !!

నీ దైన్య మ్మిక చాలు ! గుండెగలదేనిన్ గొమ్ము కోదండమున్—
లేదా పోదము రమ్ము ద్వారకకు, వేరే వారు వీ రేల నే
నైదూ శ్శిత్తును బావ లైదుగుర, కత్యంత ప్రశాంతమ్ముగా
వేదాంతార్థము ముచ్చటించుకొను డన్వేషింపుడీ బ్రహ్మమున్ !!

"వీడే భారతవీరు డర్జునుడు ! దోర్వీర్యస్ఫురాసంగర
క్రీడానిర్జితశూలి, నిర్జరగణక్షేమంకరుం, డల్లదే
వా" డంచున్ వినువీథి గుంపులయి గీర్వాణుల్ విమానాలపై
జూడన్వచ్చిరి గుట్టు రట్టయిన నిల్చుండన్ గతుల్ గల్గునే ?

"ఫెళఫెళ" మ్రోగెరా విజయభేరి ; ధణింధణ నిస్వనమ్మదే
పిలుచుచునుండెరా ! పడుచుబిడ్డల వీరవిహారయాత్రకై;
ప్రళయ మహాశ్మశాన నటరాజ జటానట దభ్రవాహినిన్
తళతళలాడురా ! విజయతాండవ పాండవచంద్రహాసముల్ !!

ఔదాసీన్యము నుజ్జగింపుము వయస్యా ! కర్మవీరుండవై
పాదమ్మ్రోంచుము యుద్ధరంగమున; నీ స్వాతంత్ర్యశంఖధ్వనుల్
వేదవ్యాస "జయ" ప్రబంధ కవితావేశమ్ములో మ్రోగు; ని
న్నాదర్శమ్ముగ జెప్పుకొందురు భవిష్యద్భారతీయప్రజల్ !

భవదీయస్తవనీయబాహుబల మోర్వంజాలువాడేడి ? ప
ర్యవసాన మ్మది నేనెరుంగుదు, విదగ్ధాఖండలాఖండఖాం
డవుడౌ పాండవమధ్యముండు కడకంటన్ గెంపురేకెత్త గాం
డివమున్ గైకొని నిల్చినఁ పగఱగుండెల్ క్రుంగికూలారవే !

అన్నకర "మ్మనంతవిజయమ్మ"న కాస్పద మైన, దింక నీ
కున్నది "దేవదత్తము" మహోజ్జ్వలసత్త్వము, సవ్యసాచి కీ
విన్నదనమ్మ మున్నెపుడు విన్నది కన్నది కాదు, దుర్జయ
మ్మన్నది లేదు విశ్వవిజయా ! విజయా ! నరు డుద్యమించినన్.

ఆత డజాతశత్రుడు—మహాత్ముడు—శాంతతపస్వి—విశ్వవి
ఖ్యాతుడు—ధర్మరా—జతని యాత్మిక శక్తికి లే వసాధ్యముల్!
తాతలవంటివా రయిన తప్పదు లోబడిపోదురోయి! ధ
ర్మేతర శక్తు లెట్లు తల యెత్తును ధర్మబలమ్మ సన్నిధిన్?

సస్యశ్యామల, రత్నగర్భ, మహిమాసంపన్న, మీ తల్లి దీ
నాస్యచ్ఛాయ లురమ్మ గ్రమ్మికొన నిద్రాహార సన్యస్తయై
దాస్యంబీడ్చుచునుండె శాత్రవగృహద్వారమ్ములఁ, చాలు నా
లస్యం బో కురుసింహ! శృంఖలము లుల్లంఘించి లంఘింపుమా!

అమ్మ పరాయిపంచబడి, అశ్రువు లొడ్చుచునుండ బిడ్డ చి
త్తమ్మది చూచి యోర్వగలదా! బ్రదుకుం బలివెట్టి తల్లి దా
స్యమ్మును దీర్ప కిట్లనదవై పడియుందువె చేతకాని ద
ద్దమ్మ విధాన! ము న్నల బృహన్నలనామము సార్థకంబుగఁ!

"విజయశ్రీ గొని తెత్తు వీ" వనుచు నువ్విళ్ళూరుచున్నారురా
విజయా! సోదరు లెల్ల; నీ విటుల నిర్వీర్యుండ వైనఁ, కపి
ధ్వజ మర్యాదయు, గాండివమ్ము పరువుఁ ధ్వంసంబుగా నవ్వవే
త్రిజగంబుల్, తలయెత్తుకోగలదె కుంతీదేవి చుట్టాలలో?

చిగురుచున్నది క్రిందికి మెట్ల మీదుగన్ [8ం పుట]

కన్నతండ్రి సవ్వుల పూలు గంపెడేసి—
చిన్నినాన్నకు కన్నులు చేరెడేసి—
చక్కనయ్యకు నెరికురుల్ జానెడేసి—
చిట్టిబాబు మై నిగనిగల్ పెట్టెడేసి—

బాలభానునిబోలు నా బాలు నీదు
గర్భమున నుంచుచుంటి గంగాభవాని!
వీని నే తల్లిచేతిలోనైన బెట్టి
మాట మన్నింపుమమ్మ! నమస్సులమ్మ!"

దిక్కులను జూచి భూదేవి దిక్కుజూచి—
గంగదెస జూచి బిడ్డనొగమ్ము చూచి—
సజలనయనాలతో ఒక్కసారి "కలువ
కంటి" తలయెత్తి బాలభాస్కరుని జూచె—

మరులు రేకెత్త బిడ్డను మరల మరల
నెత్తుకొనుచు పాలిండ్లపై నొత్తుకొనుచ
బుజ్జగింపుల మమకార ముజ్జగి
పెట్టెలోపల నుంచి జోకొట్ట

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

ఆతపత్రమ్ము భంగి కంజాతపత్ర
మొండు బంగారుతండ్రిపై నెండ తగుల
కుండ సంధించి, ఆకులోనుండి ముద్దు
మూతిపై కట్టకడపటి ముద్దు నునిచి--

"నన్ను విడిపోవుచుండె మానాన్న" యనుచు
కరుణ గద్గద కంఠియై కంపమాన
హస్తములతోడ కాంక్షలల్లాడు కనులు
మూసికొని నీటిలోనికి ద్రోసె పెట్టె.

వీటి కెరటాలలో పెట్టె యేగుచుండ
గట్టుపై నిల్చి అట్టె నిర్భాంతపోయి
నిశ్చల నిరీహ నీరస నిర్నిమేష
లోచనమ్ములతో కుంతి చూచుచుండె -

ధనుర్భంగము

అది మహాసభ—సీతా స్వయంవరార్థ
మచట గూడెను; తళతళలాడు భూష
ణాలతో ఖండ ఖండాంతరాల దొరలు
శివ ధనుర్భంగమునకు విచ్చేసినారు.

బారులు తీర్చి భూపతులు బంగరు గద్దెలమీద గూరుచు
న్నారు-వెలుంగుచుండె నయనమ్ముల ముందొక పెద్దవిల్లు, శృం
గార మధూక మాలికను గైకొని జానకి చూచువారి నో
రూరగ తండ్రి ప్రక్క నిలుచున్నది ముద్దుల పెండ్లికూతురై.

ఆ కనుదోయిలో తొణుకులాడు సముజ్జ్వల దివ్యదీప్తి ము
ల్లోకములేలు రాజసము లొగొనగా—రఘురామమూర్తి తా
నాకృతిగొన్న వీరరసమట్టుల నమ్మునిరాజు వెక్క నా
జూకుగ నిల్చియుండె ప్రియ సోదరుతో అభిరామమూర్తియై.

"స్వాగత! మో స్వయంవర సమాగత రాజకుమారులార! మీ
యాగమనమ్ముచే హృది ప్రహర్ష పరిప్లుతమయ్యె—ఈ ధను
ర్యాగమునందు శంకర శరాసన మెక్కిడు నెవ్వ; డా మహా
భాగు వరించు నా యనుగుపట్టి సమస్త సభాముఖమ్మునన్."

అని జనకుండు మెల్లగ నిజాసనమం దుపవిష్టుడయ్యె—ప్రమో
గెను కరతాళముల్; నతముఖీ ముఖపద్మము వైపు పర్వులె
త్తినవి నరేంద్రపుత్రుల సతృష్ణ విలోకన భృంగపంక్తి; అ
ల్లన పులకించె మేను మిథిలాపురనాథుని ముద్దుబిడ్డకున్.

బిగువునిండారు కొమ్మ మేనుగులవంటి
రాచవస్తాదు లెందరో లేచినారు;
శివధనుర్భంగ మట్లుండ శృంగభంగ
మయ్యెను సమస్త సభ్య సమక్షమందు.

ముని చిరునవ్వుతోడ తన ముద్దుల శిష్యుని మోము జూచె—త
మ్మునకు ధనుస్సు నిచ్చి రఘుముఖ్యుడు జానకి నోరకంటితో
గనుచు, వినమ్రుడై గురువుగారికి—సింహకిశోరమట్లు ముం
దున కరుదెంచె నచ్చెరువుతో నృపతుల్ తలతెత్తిచూడగన్!

"ఫెళ్ళు" మనె విల్లు—గంటలు "ఘుల్లు" మనె—"గు
భిల్లు" మనె గుండె నృపులకు—"ఝల్లు" మనియె
జానకీదేహ -— మొక నిమేషమ్మునండె
నయము జయమును భయము విస్మయము గదుర.

సిగ్గు బరువున శిరసు వంచినది ఒక్క
సీతయే కాదు—సభలోని క్షితిపతులును ;
ముదముమెయి పూలు వర్షించినది సతీ శి
రోమణులె గాదు - దేవతాగ్రామణులును.

చెలరే విలు విరుచునే నలవాడు
పది పదారేండ్ల యెల రాచ పడుచువాడు
"సిగ్గు సి"గ్గంచు లేచి గర్జించినారు
కనులుగుట్టిన తెల్లమొగాలవారు.

లక్ష్మివంటి సీతామహాలక్ష్మి విజయ
లక్ష్మితో శ్యామునకు గృహలక్ష్మి యయ్యె ;
భరతజనయిత్రి ప్రేమ బాష్పాలలోన
అయ్యె నతివైభవముగ సీతమ్మ పెండ్లి.

ఊర్మిళాకువరారి

ధవుని వెనువెంట జనిన సీతామతల్లి
గడపివచ్చు వత్సర మొక గడియమాడ్క;
నాథు నెడబాసి శూన్యమౌ నగరిలోన
నెట్లు నిలచెదు? పదునాలుగేండ్లు తల్లి!

రమణుడు చెంతనుండిన నరణ్యములే యపరంజి మేడలౌ—
రమణుడు లేక మేడలె యరణ్యములౌ - నికనేమి జానకీ
రమణికి రాణివాసమె అరణ్యనివాసము - నీవు నీ మనో
రమణుని బాసి ఘోరపుటరణ్యములో బడిపోతి విచ్చటన్!

"వదినయు నన్నగారు వనవాసము సేయగ నన్నగారి శ్రీ
పదముల సేవచేసికొను భాగ్యము స్వేచ్ఛగ నాకు గల్గు నీ
యదనున నీవు రావల" దటంచు ప్రియుండు నిరాకరింప, నీ
హృదయము క్రుంగి పొంగి పొరలెత్తిన దుఃఖము మ్రింగికొంటివే.

అత్తరి "పోయి వత్తును ప్రియా! యికనే"నను భర్త కెట్టి ప్ర
త్యుత్తర మీయలేక యెటులో తలయెత్తి యెలుంగురాని ద
గ్గుతికతోడ నీలి కనుగొల్కుల బాష్పకణమ్ము లాపుచున్
"చిత్త" మటన్న నిన్నుగన చిత్తము నీరగు నమ్మ ఊర్మిళా!

పైటచెరంగుతో పుడమిపై బడకుండగ నద్దుకొమ్ము నీ
కాటుక కన్నుదామరల కాలువలై ప్రవహించు వేడి క
న్నీటికణాలు—క్రింద పడనీయకు! ముత్తమ సాధ్వివైన నీ
బోటి వధూటి బాష్పములు భూమి భరింపగలేదు సోదరీ!

అన్నపదమ్ములన్ గొలుచు నాస మనోహరు డేగినాడు— తా
జన్నది భర్తృపాద పరిచర్యకు ప్రేమపుటక్కగారు—ఏ
మున్నది దిక్కు నీ కిచట? నొంటరి వైతివి తల్లి! ఎంతయున్
జిన్నతనమ్మ—నీ వెటుల జేతువొ కోడరిక మ్మయోధ్యలో!

"నన్ను నా పుత్రు జంపి, అన్నను అయోధ్య
గద్దె నెక్కింప వీరకంకణము దాల్చు
లక్ష్మణకుమారు దేవేరులా!" యటంచు
ఆడిపోయదె కైక ని న్నహరహమ్ము.

క్రొవ్వలపు జవ్వనపు మూగ కోరికలకు
దాపురమ్మైన మీ లేత కాపురమ్ము
చేతిమీదుగ నడవిపాల్ చేసినాడు
కనులుగుట్టిన వేమొ రాకాసివిధికి !

చెల్లెం డ్రిర్వురు ప్రాణవల్లభుల సంసేవించుచున్నారు—తా
నుల్లాసమ్మున సీత వల్లభునితో నుండెన్ వనిన్-నీవెటుల్
తల్లీ! భర్తృ వియోగ దుఃఖమున నుల్లం బల్లకల్లోలమై
యల్లాడన్ కడత్రోతువమ్మ ! పదునా లుగ్దమ్ము లేకాకృతిన్ ?

నలుగురు "నంగనాచి గహనాలకు కాంతుని గెంటి యింటిలో
కులుకుచు కూరుచున్న" దనుకొందురటంచు రవంతయేని చిం
తిలకుము తల్లి! త్యాగమయదేవివి నీవని నీ చరిత్రమే
తెలుపుచునుండె-లోకము హృదిన్ గదలించు సదా త్వదశ్రువుల్!

కమ్మని జవ్వన మ్మడవి గాచిన వెన్నెలజేసి, భర్తృవా
క్యమ్మున కడ్డుచెప్పక మహత్తరమౌ పతిభక్తిలోన నీ
తమ్మును మించిపోయితివి—తావక దివ్య యశోలతా వితా
నమ్ములు ప్రాకిపోయె భువనమ్ముల, పుణ్యవతీవతంసమా !

అనసూయాదేవి

అల కలహభోజనుని ఫలాహారమునకు
నినుప గుగ్గిళ్ళువండి వడ్డించినావు;
అమ్మ ! నీ చేతి తాలింపు కమ్మదనము
భరతదేశాన గుమగుమ పరిమళించె.

అత్యపూర్వ మమోఘ మనంత మైన
తావక పతివ్రతా మహత్త్వమ్ములోన
ఆది సాధ్వీమణుల హృదయాలతోడ
నుక్కు సెనగలు తుకతుక ఉడికిపోయె

వేద వేదాంత సౌవర్ణ వీథులందు
తిరుగుచుండెడి దివ్య మూర్తిత్రయమ్ము
నేడు నీ వంటయింట దొగాడుచుం
గోరుముద్దలు గుజ్జనగూళ్ళు తినుచు.

కాలు కదపక బిడ్డ లుయ్యేలలందు
నూగునాడె ముల్లోకము లూగుచుండె ;
కాలు వచ్చి గంతులువేయు కాలమునకు
ఇంత కెంతౌనొ ? వింతబా లెంతరాల !

ఇయ్యఖిల ప్రపంచములనే తమబొజ్జల మాటుకొన్న బొ
బయ్యలు మువ్వురున్ శిశువులై శయనించిరి నీ గృహాన—నీ
తియ్యని జోల పాటల కిదే పులకించెను సృష్టి యెల్ల—నీ
యుయ్యెల తూగులో నిదురనొందెనులే పదునాల్గు లోకముల్ !!

గర్భములేదు - కష్టపడి కన్నదిలే - దిక బారసాల సం
దర్భములే - దహొ ! పురిటి స్నానములున్ నడికట్లు లేవు - ఏ
స్వర్భవనాలనుండి దిగివచ్చిరి నీ ప్రణయాంక పీఠి కీ
యర్భకు ? లంతులేని జననాంతర పుణ్య తపఃఫలమ్ములై !!

ఆదియు నంతమే యెరుగనట్టి మహామహిమాఢ్యులైన బ్ర
హ్మాదుల కుగ్గు వెట్టి ఒడియం దిడి జోలలుపాడు పెద్ద ము
త్తైదువ ! "ధన్యురాలవు" గదమ్మ ! త్వదుజ్జ్వల కీర్తి గీతికా
నాదము ప్రాగై స్వర్గ భువనమ్మున దైవతమౌని వీణపై.

అగ్గిని గల్పి మట్టు మరియాదలు—పుణ్య పురాణ పూరుషుల్
ముగ్గురు చేయవచ్చిన యమోఘపు టగ్నిపరీక్షలోపలన్
నెగ్గితి వీ - పపూర్వములు నీ చరితల్ చెవిసోకి మేనులన్
గగ్గురుపాటు పుట్టినదిగా! ముగురమ్మల కొక్కపెట్టునన్

కొంగులుబట్టి "మా పసుపుకుంకుమతో పతిభిక్ష పెట్టి మా
మంగళ సూత్రముల్ నిలుపు" మంచు సరస్వతి సర్వమంగళా
మంగళదేవతల్ ప్రణత మస్తకలై పడియున్నవారు నీ
ముంగిటిముందు నారదుని మోమున నవ్వులు నాట్యమాడగన్!

అమ్మవైనావు చతురాస్య హరి హరులకు—
అత్తవైతివి వాణీ రమాంబికలకు—
ఘనతవై అత్తగారి పెత్తనము చూచి
క్రొత్త కొడండ్ర నిక దిద్దుకోగదమ్మ!

మాతృప్రేమ పునీతమౌ సఫల దాంపత్యమ్మ నీ సొమ్మ, నీ
పాతివ్రత్యములోన అత్రితపముల్ పండెన్, వియద్గంగకే
యేతామెత్తెను నీ యశస్సులు, గుమాయించెన్ జగమ్మెల్ల నీ
యాతిథ్యమ్మ, నమస్సులమ్మ! అనసూయా! అత్రి సీమంతినీ!

సతీసావిత్రి

ఓ దీనత్వము రూపుగైకొనిన ప్రేమోన్మాదినీ! యేల నీ
వీ దారిం బడి దక్షిణాభిముఖివై యేతెంతు వీ కానలో?
నీ దిక్కైర్ధ దరిజేర్చువా రెవరు లేనేలేరటే తల్లి! ఏ
దేవీ! మో మిటు ద్రిప్ప మెవ్వతెవు దేవీ! నీవు సావిత్రివా!!

"నల్లనివాడు—రక్త నయనమ్ములవాడు—భయంకర స్వరూ
పోల్లసనమ్ము వాడు—గద నూని మహామహిషమ్ముపై ప్రవ
ర్తిల్లెడివాడు—నా ప్రణయ దేవుని జీవధనమ్ము తెచ్చె—నో
భిల్లపురంధ్రులార! కనిపింపడుగా? దయచేసి చెప్పరే!!"

చెడ్డది గొడ్డుబోతువిధి, చెల్లి! నిమేషముక్రింద వీటికా
యొడ్డున గట్టుమీద నిలుచుండి హుటాహుటి రెండుచేతులన్
గొడ్డలి బట్టి కట్టియలు గొట్టెడి నీ హృదయేశు నెత్తిపై
గొడ్డలిపెట్టుపెట్టి పడగొట్టిన దుష్టకిరాతు డెవ్వడో!

నారదుడుచెప్పె— బెదరించె నాన్నగారు—
తల్లి బ్రతిమాలె—నీ గుండె ధైర్య మేమైయె !!
చా వెరింగియు కట్టుకొన్నావు నాడు !
కొదువరాయె పసుపు కుంకుమలు నేడు !

పెండ్లినా డమ్మ చెక్కిట బెట్టినట్టి
కాటుక యరాబు రవ్వంత కందలేదు ;
పెద్దముత్తైదువలు కాళ్ళ దిద్దినట్టి
పసుపు పారాణి కనుమాపు పడనెలేదు.

అత్తయు మామగారు జనుషాంధులు! కానన భూములందు క్రొం
గ్రొత్తది కాపురమ్మా ! జనకుం డిట లేడు ! నిజేశు డిట్లిక
స్మాత్తుగ కూలిపోయె ! కొరమాలిన క్రూర విధాత నేడు నీ
కుత్తుక కత్తిపెట్టి తెగగోసెను చిట్టిపు రాతి గుండెతో !

వదనశ్రీ వసివాడిపోయినది, జవ్వట్లాడె లేగౌను, నీ
మృదు పాదమ్ములు బొబ్బలెత్తినవి, నెమ్మేనెల్ల కంపించె ప
ట్టిది నీ నాథుడు నీకు దక్కుట వధూటీ ! ఆగిపోపమ్మ ! ఆ
ల్లదిగో ! కాలుడు - చాలదూరమున; నీ వందించుకోలేపులే !

"నా" యను దిక్కులేని, పదునారవయేడును వచ్చిరాని, లే
బ్రాయపు చిట్టితల్లివి! అరణ్యములో! జమువెంట నొంటిగా
నాయువు దీరి పోవు పతికై పరువెత్తెదు! నీ ప్రపత్తికిన్
మ్రోయవె దేవదుందుభులు! మ్రొక్కవె ఈ పదునాల్గులోకముల్!

బత్తెపుగింజ లేని పతి ప్రాణము కోసము వెంటనంటి ప
ర్వెత్తెడు పిచ్చిపిల్ల వనియే తలపోసెనొ—కచ్చగట్టి దం
డెత్తు సతీ మతల్లి వని యెంచెనొ—చట్టున నిల్చిపోయినా
డుత్తదిగాదు చూడు మవిగో! బిగబట్టిన దున్న పగ్గముల్!

"వందన మో మహామహిషవాహన! నీదయచేత నాన్నకున్
నందను లబ్బినారు, నయనమ్ములు గల్గెను మామగారికిన్,
హైందవసాధ్వి కీ శుభము లన్ని లభించియు భర్తలేక ఆ
నందము గల్గునా? నుతగుణా! పతిభిక్ష ననుగ్రహింపుమా!"

"పతి నొసగు" మంచు దోసిలొగ్గితివొ లేదొ
చేతి పగ్గాలు సడలించె ప్రేతరాజు;
పరచుచున్నది మహిష మంబరమునందు
వెంటబడుమమ్మ! గుండె ద్రవించునేమొ!

చేతిమీదుగ ఎన్నెన్నో పూతపిందె
కాపురమ్ములు తీసిన ఘాతుకుండు!
నిండు ప్రాణాలు నిలువున పిండుకొనెడి
గుండెతడి లేని కర్కోటకుండు వాడు!

కాలుని దున్నపోతు మెడ గంటల పట్టెడలోని కింకిణీ
జాల "ఘణం ఘణం" ధ్వనులు చల్లగ చల్లగ సాగి, దూర దూ
రాలకు పోయె - నీ యెలుగు రాసిన గొంతుక పిల్పులేల? "ఓ
హో" లకు నంద డాత డడుగో! కనిపించెడి కొండమల్పులో!

వైతరణీ ప్రవాహములు వైదొలగెన్—అసిపత్ర కానన
వ్రాతము స్వాగత మ్మిడె~సెబా! సదిగో యమరాజధానియున్!
ప్రేత పురీశు డేడి కనుపింపడు! దుర్గములోన దూరినా
డాతడు—కోటతల్పు లకటా! బిగియించిరి ద్వారపాలకుల్.

కడకంటన్ బ్రభవింప రక్తనది—సాక్షాత్ కాళికాదేవివై
నడికట్టుం బిగియించి నిల్చిన త్వదంతశ్శక్తికిన్ "ఫెళ్ళున"
గడియల్ గూలి "గభీలు" మంచు యమ దుర్గద్వారముల్ బ్రద్దలై
పడియెన్ ధాత్రి "చిరాయురస్తు" జగదంబా నీకు నీభర్తకున్!

"భగవంతుం డొక డున్న నాకిడును నా ప్రాణేశు—లేకున్న ఈ
జగముల్ నిల్చునె"యంచు భారతసతీ సామర్థ్యముల్ మ్రోతమ్రో
యగ గర్జించితి వమ్మ! దండధర బాహాదండ చండ ప్రచం
డ గదాదండము బెండువోయినది బిడ్డా! నీదు క్రోధాగ్నికిన్!

నిఖిల లోకైక సాధ్విని నిన్నుగన్న
భరత జనయిత్రి భాగ్యాలు పండెనమ్మ!
మెచ్చుకొన్నాడు ని భర్త నిచ్చినాడు
పుచ్చుకోవమ్మ! నీ పూర్వ పుణ్య ఫలము!

విశ్వవిచిత్ర మైనది పవిత్రము నీ చరితమ్ము—దిక్కులన్
శాశ్వతమయ్యె తావక యశ శ్శశి కాంతులు—నీవు రాజ రా
జేశ్వరివే పతివ్రతల కెల్లను—పచ్చనితల్లి! యింత కా
యశ్వపతి క్షితీంద్రుడు కృతార్థుడులే నిను గన్న తండ్రియై!

పోతన

గంటమొ చేతిలోది ములుగట్టియొ? నిల్కడ యింటిలోసనో
పంటపొలానొ? చేయునది పద్యమొ సేద్యమొ? మంచమందు గూ
ర్చుంటివొ మంచెయందొ? కవివో గడితేరిన కర్షకుండవో?
రెంటికి చాలియుంటివి సరే కలమా హలమా ప్రియంబగున్?

కాయలు గాచిపోయినవిగా యరచేతులు! ప్రాతగంటపున్
రాయిడి చేతనా? మొరటు నాగలిమేడి ధరించి సేద్యమున్
జేయుటచేతనా? కవికృషీవల! నీ వ్యవసాయదీక్ష "కా
హా" యని యింతలేసి కనులార్పక చూచిరిలే దివౌకసుల్.

మెత్తనిచేయి నీది; సుతిమెత్తని చిత్తమువాడ వంచు నీ
పొత్తమె సాక్ష్యమిచ్చు; పొలమున్ హలమున్ గొనిదున్ను చోనెటుల్
గిత్తల ముల్లుగోల నదలించితివో! వరిచేల పైని ను
వ్వెత్తుగ ప్రాలుచో పరిగపిట్టల నెట్టుల తోలినాడవో!

"నమ్ముము తల్లి! నాదు వచనమ్ము; ధనమ్మునకై బజారులో
అమ్మనుజేశ్వరాధముల కమ్మను ని" న్నని బుజ్జగించి నీ
గుమ్ముములోన నేడ్చు పలుకుంజెలి కాటుకంటి వేడి బా
ష్పమ్ములు చేతితో తుడిచివైచెడి భాగ్యము నీకె యబ్బెరా!!

గంటలు గట్టుకొంటివటగా! "విటగాండ్రను బోలునట్టి యీ
కుంటికురూపి భూపతులకుం గవితాసుత నీయ" నంచు—ఆ
పంటవలంతి యల్లునకె భాగవతమ్మును ధారవోసి, ని
ష్కంటక వృత్తికై నడుము గట్టితి వెంతటి పుణ్యమూర్తివో!

అచ్చపు జుంటితేనియల; నైందవ బింబ సుధారసాల, గో
ర్వెచ్చని పాలమీగడల, విచ్చెడి కన్నెగులాబి మొగ్గలన్,
మచ్చరికించు ఈ మధుర మంజుల మోహన ముగ్ధశైలి నీ
వెచ్చట నేర్చినావు? సుకవీ! సుకుమారకళా కళానిధీ!

కమ్మని తేటతెల్గు నుడికారము లేరిచి కూర్చి చాకచ
క్యమ్ముగ కైత లల్లు మొనగాడు కవీశ్వరు లెంతమంది లో
కమ్మున లేరు—నీవలె నొకండును భక్తి రసామృత ప్రవా
హమ్ముల కేతమెత్తిన మహాకవి యేడి తెలుంగుగడ్డపై?

ఎండినమ్రోడుతే కిసలయించెనొ ! యేకశిలాపురమ్ములో
బండలు పుల్కరించెనొ ! అపారముదమ్మున తెల్లుతల్లికిన్
గుండెలు పొంగిపోయి కనుగొల్కులు నిండెనొ ! పచ్చిపైరులే
పండెనొ ! జాలువారిన భవత్కవితామృత భక్తిధారలన్ !

భీష్మునిపైకి కుప్పించి లంఘించు గో
పాల కృష్ణుని కుండలాల కాంతి
కరిరాజు మొరపెట్టి పరువెత్తు కరివేల్పు
ముడివీడి మూపుపై పడిన జుట్టు
సమరమ్ము గావించు సత్య కన్నులనుండి
వెడలు ప్రేమ క్రోధ వీక్షణములు
కొసరి చల్దులు మెక్కు గొల్ల పిల్లల వ్రేళ్ళ
సందు మాగాయ పచ్చడి పసందు

ఎటుల కనుగొంటివయ్య ! నీ కెవరు చెప్పి
రయ్య ! ఏ రాత్రి కలగంటివయ్య ! రంగు
కుంచెతో దిద్దితీర్చి చిత్రించినావు !!
సహజ పాండితి కిది నిదర్శనమటయ్య !!!

ముద్దులుగార—భాగవతమున్ రచియించుచు, పంచదారలో
నద్దితివేమొ గంటము మహాకవిశేఖర! మధ్యమధ్య—అ
ట్లద్దక—వట్టిగంటమున నట్టిటు గీచిన తాటియాకులో
పద్దెములందు—ఈ మధుర భావము లెచ్చటనుండి వచ్చురా!

"భాగవతమ్ము భాగ్య పరిపాకమ ఆంధ్రులకెల్ల—దానిముం
దాగగజాల వే కవిత" లంచు నభంబున దేవదుందుభుల్
మ్రోగినవేమొ! నీవు కలముంగొని కావ్యము వ్రాయు చిందిపో
సాగినవేమొ! తీయని రసాల రసాలు త్వదీయ లేఖినిన్!

వేసము మార్చి యిన్ని దిగవేసి యభా సొనరింపకుండ శ్రీ
వ్యాసుని గ్రంథ మాంధ్రమున వ్రాసితి! వందము చింద, నీద ఆ
గ్రాసనమయ్య ఆంధ్ర కవులందు; వరాలకు నెత్తుకెత్తుగా
ఆ సొగసైన పద్దెము లయారె! తయారగు నీ కలాననే!!

ఖ్యాతి గడించుకొన్న కవు లందరు లేరె—అదేమిచిత్రమో
పోతన యున్నచో కరగిపోవు నెడంద, జొహారుసేతకై
చేతులు లేచు, ఈ జన వశీకరణాద్భుతశక్తి చూడగా
నాతనిపేరులో గలదొ! ఆయన గంటములోన నున్నడో!

ఆంధ్ర విద్యార్థి

సర్వభూమి పూజ్య గీర్వాణ భాషా మ
తల్లి గారాబంపు తల్లి నాకు
అత్యంత సుకుమారి ఆంధ్రభాషా యోష
అల్లారు ముద్దుల చెల్లి నాకు
నవ నవోన్మేష సుందరమూర్తి సాహితీ
లక్ష్మియే అర్ధాంగలక్ష్మి నాకు
కమనీయ మృదుపదక్రమ కవితాబాల
కలికి పల్కుల పసికందు నాకు

పాణినీయులు దేశికప్రభులు నాకు
సరసవాఙ్మయపురము కాపురము నాకు
వాణివీయించు మాణిక్య వీణలోని
యర్థమెరిగన "ఆంధ్ర విద్యార్థి నేను!"

ఒకమాటు కనుమోడ్చుచుందు బమ్మెరవారి
మందార మకరంద మధుర వృష్టి
ఒకమాటు మూర్కొనుచుందు తిమ్మనగారి
పారిజాత వినూత్న పరిమళమ్ము
ఒకమాటు చవిజూచుచుందు పెద్దనగారి
ద్రాక్షాగుళుచ్ఛ సుధా సుధార
ఒకమాటు విహరించుచుందు పింగళివారి
వరకళాపూర్ణ సౌవర్ణ శిఖరి

ఒకట కవితా కుమారితో నూగుచుందు
గగన గంగా తరంగ శృంగారడోల
ఆంధ్ర సాహిత్య నందనోద్యాన సీమ
నర్థివిహరించు "ఆంధ్ర విద్యార్థి" నేను.

కాళిదాస కవీంద్ర కావ్యకళావీధి
పరుగులెత్తెడి రాచబాట నాకు
భట్టబాణుని ముద్దు పట్టి కాదంబరి
కథలు చెప్పెడి చేల్మికత్త నాకు

భవభూతి స్నేహార్ద్ర భావవైభవగీతి
కరుణా రసాభిషేకమ్ము నాకు
వాల్మీకి కవిచక్రవర్తి భావస్ఫూర్తి
ఆటలాడెడి పూలతోట నాకు

భారతీదేవి మృదులాంక భద్రపీఠి
ముద్దులొలికెడి రతనాల గద్ది నాకు
తెలుగుతోటల సంస్కృత వనలతాళి
నంటుతొక్కెడి "ఆంధ్ర విద్యార్థి" నేను.

అస్వాతంత్ర్యుడు

నేనొక దగ్ధజీవనుడనే అయినాను—మదీయ మానసో
ద్యానమునిండ రక్కసిపొదలో చిగిరింతలు గారకంపలే
గాని, పదేపదే పయిరుగాలికి నూగు గులాబి గుత్తులే
కానగరావు— స్వేచ్ఛయును గల్గునె యీ కరుణా విహారికిన్ ?

నేనొక వెఱ్ఱిమొఱ్ఱికవినే అయినాను—మదీయ జీవితా
ధ్యానమునందు క్లిష్టగతి కష్టసమన్వయ దుష్టసంధులే
కాని సుగమ్య సుందర సుఖంకర సూక్తి సుపర్ణ పంక్తియే
కానగరాదు— బోధమును గల్గునె యీ కవితావిలాసికిన్ ?

నేనొక జీర్ణశిల్పకుడనే అయిపోయితి—నా యులిన్ సదా
పీనగు పెండెమల్—పునుకపేరులు-కుంటికురూపి బొమ్మలే
కాని, వినూత్న యౌవన వికాస మనోహర రూపరేఖయే
కానగరాదు—తృప్తియును గల్గునె యీ తృషితాంతరాత్మకున్ ?

నేనొక క్లిష్టగాయకుడనే అయిపోయితి—నా విపంచిపై
దీన గళమ్ముతో తెగిన తీగలమీద విషాదగీతులే
కాని, రసంబు పొంగి పులకల్ మొలిపించు ప్రమోదగీతియే
కానగరాదు—స్థాయియును గల్గునె యీ రసలుబ్ధజీవికిన్?

నేనొక రంగలంపటుడనే అయినాను—మదీయ నాటకా
స్థానములో బుసల్ గుసగుసల్ సకిలింతలు చప్పరింతలే
కాని, సెబాసటంచు రసికప్రవరుల్ తలలూపి మెచ్చుటే
కానగరాదు—సిద్ధియును గల్గునె యీ నటనావిలాసికిన్?

నేనొక కషకరకుడనే అయినాను—మదీయ బుది మా
గాఱము నిండ ఒడ్డు మెరకల్ రవపెంకులు రాలురప్పలే
కాని, పసందుగా పసిడి కంకులువంగిన పంటపైరులే
కానగరావు—పుష్టియును గల్గునె నిష్టదరిద్రమూర్తికిన్?

నేనొక నష్టజాతకుడనే అయినాను—మదీయ జన్మ చ
క్రాన కుజాష్టమాది కుటిలగ్రహ కుండలి క్రూర దృష్టులే
కాని, త్రికోణ కేంద్ర శుభగ గ్రహ వీక్షణ సామరస్యమే
కానగరా—దదృష్టమును గల్గునె యీ దురదృష్టమూర్తికిన్?

నేనొక భగ్నవిక్రమడనే అయినాను—మదీయ భావనా
భోనిధిలో మహామకరముల్ సుడిగుండములున్ తుపానులే
కాని, సుధా సుధాకిరణ కల్పక దివ్యమణీ వితానమే
కానగరాదు - అద్దరియు గల్గునె యీ యెదురీతగానికిన్?

నేనొక దీన భిక్షుకుడనే అయినాను - మదీయ జీర్ణగే
హాన దరిద్రదేవత మహా వికట ప్రళయాట్టహాసమే
కాని, యదృష్టలక్ష్మి కడకంటి సుధా మధురార్ద్రదృష్టియే
కానగరాదు—భాగ్యమును గల్గునె యిట్టి యభాగ్యమూర్తికిన్?

నేనొక వ్యర్థతాపసుడనే అయినాను - మదీయ సంతత
ధ్యాన సమాధిలో వెకిలిదయ్యపు మూకల వెక్కిరింతలే
గాని, ప్రసన్నభావ కళికా లవలేశ విలాసమేనియున్
గానగరాదు - ముక్తియును గల్గునె యీ పరితప్తమౌనికిన్?

తెనుగుతల్లి

కనిపింపదే నేడు! కాకతీయ ప్రాజ్య
సామ్రాజ్య జాతీయ జయపతాక —
పినిపింపదే నేడు! విద్యానగర రాజ
సభలోని విజయ దుందుభుల మ్రోత —
చెలగదే నేడు! బొబ్బిలికోట బురుజు పై
తాంబ్రపాపయ తళత్తళల బాకు —
నిప్పచ్చరంబయ్యెనే నేడు! వీర ప
ల్నాటి యోధుల సింహనాదలక్ష్మి —

చెక్కు చెదరని - యేనాడు మొక్కవోని
ఆంధ్ర పౌరుష మిప్పు డధ్వాన్నమయ్యె;
మరల నొకమాటు వెనుకకు తిరిగిచూచి
దిద్దుకోవమ్మ! బిడ్డల తెనుగుతల్లి!

రాజరాజుల చరిత్రల నాలపించెడి
గౌతమీ గద్గద కంఠరవము
కృష్ణరాయల కీర్తిగీతాలు కడుపులో
జీర్ణించుకొను హంపి శిథిలశిలలు
అలనాటి కాకతీయుల పౌరుషము త్వ్వి
గంపకెత్తెడి ఓరుగంటి బయలు
బలితంపు రెడ్డి బిడ్డల సాము గరిడీల
రాటుతేలిన కొండవీటి తటులు

విని - కని - తలంచుకొని — గుండె వ్రిలిపోయి
వేడి వేడి నిట్టూర్పులే విడిచినాము !
గుడ్డ గట్టిన కడిపెడు కొడుకులుండి
యిల్లు వాకిలి కరువైన తల్లివీవు ! !

"రాయి గ్రుద్దును" నీ పురాశిల్ప సంపత్తి
అమరావతీ స్తూప సముదయంబు;
"చదివించు" నీ మహాసామ్రాజ్య కథల నాం
ధ్ర క్ష్మాపతుల జయస్తంభ లిపులు;

"గళమెత్తిపాడు" నీ గాన సౌభాగ్యమ్ము
రమణీయముగ త్యాగరాయ కృతులు;
"వేనోళ్ళచాటు" నీ వీరమాతృత్వమ్ము
పలనాటివీరుల పంబ కథలు;
"వల్లెవేయును" నీ వైభవ ప్రశస్తి
హొరుమంచును నేడు మా యొడరేవు;
బ్రతికిచెడియున్న నీ పూర్వ భాగ్యరేఖ
చెరిగిపోలేదు తల్లి! మా స్మృతిపథాల!!

గంటాన కవితను కదను త్రొక్కించిన
"నన్నయభట్టు" లీనాడు లేరు
కలహాన కంచుఢక్కల నుగ్గునుగ్గు గా
వించు "శ్రీనాథు" లీవేళ లేరు
అంకాన వాణి నోదార్చి జోలలు వాడు
"పోతనామాత్యు" లీ ప్రొద్దు లేరు
పంతాన ప్రభువుచే పల్లకీ నెత్తించు
కొను "పెద్దనార్యు" లీ దినము లేరు

"వాణి నా రాణి" యంచు సవాలు కొట్టి
మాట నెగ్గించు వీరులీ పూట లేరు
తిరిగి యొకమాటు వెనుకకు మరలి చూచి
దిద్దికోవమ్మ ! బిడ్డల తెనుగుతల్లి !

కవులకు బంగారు కడియాలు తొడిగిన
రాయల గన్న వరాల కడుపు
సీసాలతో కవితాసార మిచ్చు శ్రీ
నాథుని గన్న రత్నాల కడుపు
భద్రాద్రిలో రామభద్రు స్థాపించు గో
పన్నను గన్న పుణ్యాంపు కడుపు
జగమగంటిమి నల్దెసల్ వెలార్చిన పాప
రాయని గన్న వజ్రాల కడుపు

పిసినిగొట్టు రాజులకును - పిలకబట్టు
కుకవులకు - పిచ్చిపిచ్చి భక్తులకు - పిరికి
పందలకు - తావు గాకుండ ముందు ముందు
దిద్దికోవమ్మ ! బిడ్డల తెనుగుతల్లి !

కల్యాణగీతి

శ్రీకరము లౌత మీకు నాహ్వ్యికలోల
శివ జటాజూట గాంగేయ శీకరములు ;
రంజితము లౌత మీకు శర్వాణి చరణ
కంజ మంజుల మంజీర శింజితములు !!

జయోస్తు

రాజ్యమహేంద్ర కవీంద్రు రత్నాల మేడలో
పసిడి గిన్నెల నుగ్గుబాలు త్రాగి
సోమయాజులవారి హోమవేదికలపై
అల్లారు ముద్దుగా నాటలాడి
శ్రీనాథుల సువర్ణ సీస మాలికలలో
హాయిగా తూగుటుయ్యాల లూగి
భాగవతులవారి పంచపాళీలలో
మెత్తని శయ్యల నొత్తిగిల్లి

విజయ విద్యానగర రాజవీథులందు
దిగ్గజమ్ములమీదనే తిరిగి తిరిగి
కంచు జయభేరి దెసల మ్రోగించుకొన్న
ఆంధ్ర కవితాకుమారి ! "జయోస్తు" నీకు !!

ధా

అద్దమరేయి ఒంటిగ—రహస్యముగా—తపియించు గుండెపై
అద్దుకొనంగ వచ్చితి దయామయు! నీ చరణారుణాబ్జముల్ [illegible]



"స్వామి యుర్వ నిమీలితేక్షణములందు
ఏమి యూహాంకితమో చెప్పలేము గాని" [భ 3 పుట]

కవితాకుమారి

జడయల్లి జడకుచ్చు లిడ "రాయప్రోలు" "త
ల్లావజ్ఝుల" కిరీటలక్ష్మి నింప
"పింగళి" "కాటూరి" ముంగురుల్ సవరింప
"దేవులపల్లి" శ్రీతిలక ముంప
"విశ్వనాథ" వినూత్న విధుల కిన్నెర మీట
"తుమ్మల" రాష్ట్రగాన మ్మొనర్ప
"వేదుల" "నాయని" వింజామరలు వేయ
"బసవరాజు" "కొడాలి" పదములొత్త

"అడివి" "నండూరి" భరతనాట్యములు సలుప
"జాషువా" "ఏటుకూరి" హెచ్చరిక లిడగ
నవ్యసాహిత్య సింహాసనమున నీకు
ఆంధ్ర కవితా కుమారి! "దీర్ఘాయురస్తు"

బీదపూజ

"వాడిన గ్రుడ్డిపూలు గొనివచ్చెను వీ" డని జాలిమాలి నో
నాడకు మో దయామయ ! యథార్థము నీకడ విప్పిచెప్ప నో
రాడుటలేదు—పూలకొరకై పువుదోటకు నేనుగూడ జ
న్నాడను—పుష్ప మొక్కటయినన్ లభియింపకపోయె నాకటన్.

వారలు పెద్ద పెద్ద ధనవంతుల బిడ్డలు—మంచి మంచి బం
గారపు పూల బుట్టలను గైకొని పోయిరి ముందుగానె—మా
బూరుగు చెట్టుక్రింద పడిపోయిన గోడల పూరిపాకలో
దూరిన లేత వెల్గులకు దుప్పటి నెత్తితి అమ్మ లేపినన్.

లేచి— చిరుచాప నొకమూల దాచిపెట్టి—
పాత తాటాకు బుట్టను చేత బట్టి—
పొంతలోపలి జల మింత పుక్కిలించి—
తల్లి కాళ్ళకు వంగి వందన మొనర్చి—

తెలతెల వారుచుండ జనితిన్ విరితోటకు—తోటమాలి త
ల్పులు బిగియించె నా చినిగిపోయిన గుడ్డలు నన్ను జూచి; కా
ళుల బడి గడ్డ మంటి యెటులో బ్రతిమాలి యవస్థనంది లో
పల బడినాను—చెంత గనుపట్టిరి మిత్రులు పూలు గోయుచున్.

చకచక పూలు గోసికొని సాగిరి వారలు—శూన్య కుంజ మా
లిక లెటు చూచినన్; మిగులలే దొక పుష్పము గూడ నాకు; నే
నొకదెస విన్నబోయి నిలుచుంటిని—నన్ గని వార లందరున్
పకపక నవ్వినారు—తల వంచితి నేనొక కొమ్మచాటునన్.

వట్టి పూమొక్కలన్ని నా వంక జూచి
ప్రసవ బంధాలు సడల బొప్పములు రాల్చె;
చేతిలోనున్న బుట్టను చింపివైచి
తిరిగివచ్చితి గుండెలు దిగబడంగ.

ఇంటికివచ్చుచుండ గనుపించిరి దేవర దేవళమ్ములో
మంటపమందు పుష్పములు మాలలుగ్రుచ్చుచు వారు-పోయికూ
ర్చుంటిని నేనుగూడ నొకచో నొక స్తంభమువెన్క—ఇంతలో
గంటలు మ్రోగె - అర్చనలకై గుడిలోనికి పోయి రందరున్.

పూజలై మిత్రు లిండ్లకు పోయినారు
రిక్తహస్తాల నిన్ను దర్శింపలేక
మండపము ప్రక్క ధూళిలో నిండియున్న
గ్రుడ్డిపువ్వులనే యేరుకొంటి నేను.

పరిమళములేక—ఎవరికి పనికిరాక—
పారవేయ బాటల ప్రక్కబడి—కరాళ
కాల పురుషుని కారు చక్రాల క్రింద
బ్రతుకలేని దరిద్ర పుష్పమ్ము లివ్వి.

ఈ యనాథ సుమాలనే—ఈ విశీర్ణ
జీర్ణ కుసుమాలనే—ఈ కృశించు మ్లాన
హీన దీన ప్రసూనాలనే—త్వదంఘ్రి
సేవకై దోయిలించి తెచ్చితిని నేను.

పూల దోసిలి కన్నీట పొరలిపోయె
విరుల మాలిన్య మంతయు వెడలిపోయె
ఆగియుంటి ప్రభూ! స్వామి యాజ్ఞ కొరకు
ఆదరింతువో లేదొ నా బీదపూజ!

సారకత

అర్చకు లొనర్చు పూజల నందుకొనుచు
గుళ్ళలోపల హాయిగా కూరుచున్న
దైవముల తలకెక్కి తైతక్కలాడి
కులుకరింపగ మా మది కోర్కెలేదు.

గందపొడి గాలిపైచల్లి విందులిడి మ
రంద బిందువులు మిళిందబృందములకు
సిగ్గు విడనాడి ఉచ్ఛిష్ట జీవితమ్ము
గడుపుటకు మా మదిని కౌతుకమ్ము లేదు.

హాయి మేయుచు శయ్యాగృహాంతరముల
పూలపాన్పులపైబడి పొరలుచున్న
మనుజ మహిషాల అడుగున మణిగిపోయి
కమలి పోవగ మాకు నుత్కంఠలేదు.

తొడిమ లెడలించి చించి తంతువులతోడ
గొంతులు బిగించి దండలు గ్రుచ్చి మమ్మ
ముడుచుకొను మోహనాంగుల ముడులమీద
ఫేషనులు దిద్ద మా కభిలాష లేదు.

ప్రణయినీ మృదులాంగుళీ రచిత పుష్ప
దామమై ప్రేమికుని కంఠసీమ నలరి
వలపు కౌగిళ్ళ సందున నలిగి నలిగి
పరవశత నంద మాకు సంబరములేదు.

ఒక ప్రశాంత ప్రభాతాన ఒక్క మంద
మలయ మారుతవీచిలో పులకరించి
మెల్లగా తల్లి చల్లని కాళ్ళపైన
రాలి కను మూసికొనుటె సార్థకత మాకు.

సాంధ్యశ్రీ

అంజనరేఖ వాల్గనుల యంచులు దాట, మనోజ్ఞ మల్లికా
కుంజములో సుధా మధుర కోమల గీతిక లాలపించు ఓ
కంజదళాక్షి! నీ ప్రణయ గానములో పులకింతునా – మనో
రంజని! పుష్పవృష్టి పయి రాల్చి నినున్ పులకింపజేతునా!

క్రొంజిగురాకు వ్రేళ్ళుల కురుల్ తడియార్చుచు కూరుచున్న అ
భ్యంజన మంగళాంగి! జడ యల్లుదునా— మకరంద మాధురీ
మంజుల మామక ప్రణయ మానస భావనలే ప్రఫుల్ల పు
ష్పాంజలి చేసి నీ యడుగులందు సమర్పణచేసికొందునా —

సంజ వెలుంగులో పసిడిచాయల ఖద్దరు చీరగట్టి నా
రింజకు నీళ్ళువోయు శశిరేఖవె నీవు; సుభద్రసూతివై
రంజిత పాణిపల్లవము రాయుదునా—నిను మౌళిదాల్చి మృ
త్యుంజయమూర్తివై జమునితో తొడగొట్టి సవాలుసేతునా!

వెశాఖి

కుండలమీద పిచ్చికలు గుంపులుగూడె; నఖండ చండ మా
ర్తాండుడు చేటలన్ జెరిగె నగ్నికణమ్ములు, వెండినీ రదే
కొండలు నెత్తిపై ఫులుముకొన్నవి, రమ్మ శయింత మీ లతా
మండప మందు, ప్రేమమయ మానసముల్ మధురించిపోవగన్.

బుడుత డుయేలలో నిదుర బోవుచునుండెను; పొట్లపాదుపై
ఉడుత పదేపదే అరచుచున్నది; పిట్టలు చెట్టుకొమ్మలన్
వడబడి కూరుచుండె; తలవంచెను చిట్టిగులాబి; గాడుపుల్
సుడిగొనుచుండె నో కుసుమసుందరి! మో మటు త్రిప్పబోకుమా!

ఉండుము-లేవబోకుము-కృశోదరి! నీనుదుటన్ శ్రమాంబుపుల్
నిండెను; పైపయిం దుడువనీ-సుమా సుకుమారమైన నీ
గండయుగమ్మ వాడె వడగాలికి; ఊయలలోన వచ్చి కూ
ర్చుండుము-స్వేచ్ఛపై కలసియూగుద మాశలు మిన్నుముట్టగన్!

ప్రాభాతి

రేగిన ముంగురుల్ నుదుట ప్రేమ సుధా మధురైక భావముల్
ప్రోగులు వోయగా నిదురవోవు దయామయి! నా యెడందలో
ఆగక పొంగు స్వాప్నిక రహస్యము లెవ్వియొ నీదు గుండెతో
దాగుడుమూతలాడ సరదాపడుచున్నవి కన్నులెత్తుమా!

ఈ గిజిగానిగూడు వలెనే మలయానిల రాగడోలలో
నూగుచునుండె నాతలపు లూరక; నీ కబరీభరమ్ములో
మాగిన కేతకీ సుమ సమంచిత సౌరభవీచి పైపయిన్
మూగి స్పృశించినాహృదయమున్ కదలించుచునుండె ప్రేయసీ!

రాగము నందుకొన్నది తరంగిణి; బాలమరీచిమాలికిన్
స్వాగత మిచ్చె పద్మిని; హసన్ముఖియై మనదొడ్డిలోని పు
న్నాగము కుప్పవోసె సుమనస్సులు, కోవెలలో వివంచికల్
ప్రోగెను; లెమ్ము! పోదము! ప్రమోదముతో మనమాతృపూజకున్!

రాట్నసుందరి

రాటము మేళవించి, అనురాగము రాగము మాతృభూమిపై
పాటయి ప్రోగ, నూల్ వడకు పావన భారత భాగ్యలక్ష్మి! నీ
పాటల పాణిపద్మములు భవ్యము లయ్యెను-వేలు లక్షలున్
కోటులు నూరుకోట్లు గయికొ మ్మివె ముద్దుల బావ దీవనల్.

పసుపుంబూతల లేత పాదములకున్ బారాణి గీలించి, నె
న్నొసటం గుంకుమ దిద్ది, కజ్జలము కన్నుంజేయి గై సేసి, క్రొం
గుసుమంబుల్ తలదాల్చి, రాట్నముకడన్ గూర్చున్న నీమూర్తిలో
ప్రసరించెన్ జయభారతీ మధుర శోభా భాగ్య సౌభాగ్యముల్.

పండెను దేవి! నా వలపుపంటలు; పింజలు పింజలైన యా
గుండెయె యేకుగా వడకుకొంటివి; నా బ్రతుకెల్ల దారమై
కండెలుగట్టె నీదు చరణాపయి; నేనిక చే రుమాలనై
యుండెద మెత్తగా పెదవు లొత్తుచు నీ వరహాలచేతిలో!

మధురస్మృతి

ఆ మనోహర మధుర సాయంతనమున
ఉపవన నికుంజ వేదిపై నుంటి నేను;
చేత సుమరజ మూని వచ్చితివి నీవు
తిలకమును నా ముఖమ్మునపై దిద్ది తీర్వ.

ఒరిగి ఒయ్యారమొలుక కూర్చుండినావు
అందములరాణివై అస్మదభిముఖముగ;
చేరె మునుముందు నీ కుడిచేయి నాదు
అలిక ఫలకమ్మి తిలక విన్యాసమునకు.

పులకలెత్తించె తనువెల్ల చెలి! మదీయ
చిబుక మంటి పైకెత్తు నీ చేతివ్రేళ్ళు;
రాగరస రంజిత పరాగ రచ్యమాన
తిలక కళిక పరిమళమ్ములను చిందె.

"ఐనది సమర్చ, సొగసింక అద్దమందు
చూచుకొను" డంటి వీవు నాజూకుగాను ;
"అటులనా" యంచు నటునిటు నరసి, నీదు
చెక్కుటద్దమ్ము కడ మోము చేర్చినాను.

"ఎంత ముద్దుగ దిద్దితి వేది యేది"
యనుచు నొకరెండు ముద్దుల ననిచినాను ;
పకపక మటంచు నవ్వి నీ పాణితలము
అడమొనరించితివి తళుక్కుటద్దమునకు.

నాటి ప్రేమార్ద్రతిలక మీ నాడు, విజయ
దీక్ష నిప్పించు రక్తార్ద్రతిలకమయ్యె ;
ప్రియతమా! రమ్ము! చేయెత్తి పిలుచుచుండె
అమ్మ మనలను కరుణకంఠమ్ము తోడ.

తపోభంగము

మానస సరోవరాంతర మధుకణాలు
మోసికొనివచ్చి సేవలు చేసిపోవు
మంచుమల మీది యాదిమ మౌనిమణికి
మందమంద మందాకినీ మారుతములు.

స్వామి యర్ధ నిమీలితేక్షణములందు
ఏమి యాకాంక్షితమొ చెప్పలేము గాని
సర్వమంగళ పర్వతసార్వభౌము
పట్టి ముప్రొద్దు భక్తిమై పరిచరించు.

అమ్మునిరాజు గెల్చి విజయధ్వజ మెత్తెడి పూన్కి చెంగటన్
ద్రిమ్మరుచుండె మారుడు సతీయుతుడై సమయప్రతీక్షమై
తుమ్మెదనారితో-చివురుతూణముతో-విరజాజిపూల వి
ల్లమ్ములతో-శుకీపిక బలమ్ములతో - అతిలోకశూరుడై.

ఉచిత పూజోపహారము లూని గౌరి
మూడుకన్నుల మునిమౌళి ముందు నిలిచె;
వినయము భయమ్ము సిగ్గు ముప్పిరిగొనంగ
పలికె కలకంఠి చిగురుచేతులు మొగిడ్చి.

"వాచవులూరు పండ్లు గొనివచ్చితి స్వాములకోస మిచ్చటన్
దాచుదునా ప్రభూ మిసిమి తామరపాకులలోన; క్రొత్తగా
మా చదలేటి ప్రక్క మధుమాస మనోజ్ఞ మహోదయమ్ములో
పూచెను మొన్ననే కొగడపూలివి, మాలలు గ్రుచ్చి యిత్తునా!

వచ్చుచు నున్న సూర్యభగవానుని చక్కలిగింత కప్పుడే
విచ్చుచు విచ్చుచున్న అరవిందములందున పొంగి వెల్లువౌ
వెచ్చని తియ్యదేనియలు భృంగకుమారిక లంటకుండగా
తెచ్చితి దొన్నెలందు నిడి దేవరవారికి ఆరగింపుకై!"

అందముచిందిపోవు చెవియందలి చెందొవ జారుచుండ "పూ
లందుకొనుం" డటంచు సుమనోంజలి ముందుకు జాచి శైలరా
ణ్నందన వంగె - చెంగున అనంగుని చాపము వంగె - వంగె బా
లేందుధరుండు కాన్కలు గ్రహింపగ ఉన్నమితోర్ధ్వకాయుడై.

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనావలోకిక

పుస్తకం సంఖ్య	AOUA103B126
పుస్తకం పేరు	ఉదయశ్రీ 01
తారీఖు	31 December 2025
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	321 341
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO 8/11
లేని పేజీలు	NO
తయారు చేసినది	Bindery
పేజీలు విడదీసినది	Unbinding
స్కాన్ చేసినది	Cutting Scan
పరీక్ష చేసినది	SARANYA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
వరిస్థితి	good